ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-5-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 107 పేజీలు: 12 వెల: 6.50

భారత్ మామిడి పండ్లను తిరస్కరించిన అమెరికా
లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ హతం
9లో

## ఉచిత బస్సు రాష్ట్రమంతా వర్తింపు!




### ప్రభుత్వానికి యేటా రూ. 3,182 కోట్ల భారం

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** సూపర్ సిక్స్ ఎన్నికల హామీల్లో ఒకటైన కూటమి ప్రభుత్వ మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకం అమలు తేదీ ఖరారైంది. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్ట్రాలో ఉచిత బస్సు అమలుకు సిద్ధం కావడం ఇదే ప్రథమం కావొచ్చు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్నట్లు నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.ఈ పథకంపై ఆయన స్పష్టతను ఇచ్చారు.దీని వలన ఆర్థిక భారంపడినా, ఆర్టీసీని నష్టాలకు గురిచేయని రీతిలో చర్యలు తీసుకోవాలన్నది సిఎం చంద్రబాబు ఆలోచన ప్రస్తుతం బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో 69 శాతం ఉండగా, అది 94 శాతానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటకల మాదిరిగానే రాష్ట్రమంతా వర్తించేలా మహిళలకు ఉచిత ప్రయాణం అమలుచేసే అవకాశం ఉందని తెలుస్తోంది.జిల్లాలకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని భావించినా ప్రభుత్వం ఆ ఉద్దేశం మార్చుకుంటుందంటున్నారు.
ఈ క్రమంలో ఈ పథకం వల్ల ప్రభుత్వంపై ఏటా రూ.3,182 కోట్ల మేర భారం పడనుందని అంచనా వేస్తున్నట్లు ఎపి రోడ్డు రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేసారు. సిఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఈ పథకం ఉంటుందని వివరించారు.పథకాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు తీసుకుని వెళ్లగలమన్న దీమా చంద్రబాబుది. మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా నిత్యం మరో 10.84 లక్షలకు పెరుగుతుందని ప్రాథమికంగా >>2

## ప్రజాభిప్రాయం మేరకే పథకాల అమలు

- 10 అంశాలపై ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్
- వచ్చే నెలనుంచే 'తల్లికి వందనం' కార్యక్రమం
- పలు సర్వేల నుంచి కూడా సమాచార సేకరణ
- అవినీతి రహితంగా కార్యాచరణ: సిఎం చంద్రబాబు



**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు.ప్రతి పథకం విషయంలో లబ్ధిదారులకు నేరుగా ఫోన్ చేసి వారికి విషయాన్ని తెలిపి,వారి సూచనలు తీసుకుంటున్నామని వివరించారు. 'ఎక్స్'వేదికగా ఆయన రాష్ట్రంలో 10 అంశాలపై ఐవిఆర్ఎస్‌తో ద్వారా ప్రజల నుంచి తీసుకుంటున్న ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామన్నారు. అందువలనే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను కచ్చితంగా అమలు చేయగలుగుతున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు విషయంలోను ఐవిఆర్ఎస్ ద్వారా అనేకవిషయాలపై ఒక అవగాహనకు వస్తున్నామన్నారచు.ఐవిఆర్ఎస్ పాటు వివిధ రూపాల్లో నేరుగా లబ్ధిదారుల నుంచి అభిప్రాయాల సేకరణ తీసుకుంటున్నామన్నారు. పింఛన్ల పంపిణీ, దీపం పథకంఅమలు, అన్న క్యాంటీన్ నిర్వహణ, ఇసుక సరఫరా, ఆసుపత్రులు, దేవాలయాల్లో సేవలపై వివిధ రూపాల్లో సమాచారం సేకరణ..'ప్రజలే ముందు' (పీపుల్‌ఫస్ట్) అనే విధానంలో ప్రజల అభిప్రాయాలు, అంచనాల మేరకు ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి, ప్రతి విభాగం పనిచేయాలని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిదారుల నుంచి నేరుగా సేకరించిన సమాచారం ఆధారంగా ఎప్పటికప్పుడు సమీక్షను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ సేవలపై నేరుగా లబ్ధిదారులు ఏమంటున్నారు అనే అంశంపై ఐవిఆర్ఎస్‌తో పాటు వివిధ రూపాల్లో సర్వేలు నిర్వహించారు. ఈ సర్వే రిపోర్టుల ఆధారంగా శాఖల వారీగా అధికారులతో చర్చిస్తున్నామన్నారు. వారి ద్వారా నివేదికలను తీసుకుని అమలు చేస్తున్నామన్నారు..ఎవరు ఏం చెప్పినా లబ్ధిదారుల మాటే ఫైనల్ అని, ప్రజలు క్షేత్ర స్థాయి నుంచి ఇచ్చిన ఫీడ్‌బ్యాక్‌నే ప్రామాణికంగా తీసుకుంటామని అధికారులకు సిఎం స్పష్టం చేశారు. కొన్ని శాఖల్లో కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి వరకు విధానాల అమల్లో ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తం అవ్వడంపై సిఎం సంతోషంగా ఉందన్నారు. కొన్ని శాఖల్లో 11నెలల కాలంలో అనుకున్న స్థాయిలో మార్పు రాకపోవడంపై సిఎం లోతుగా సమీక్షించారు. కారణాలు తెలుసుకుని దానికి అనుగుణంగా మార్పులు తేవాలని అధికారులకు సూచనలు చేసామన్నారు. ప్రభుత్వ సేవల్లో వేగం, నాణ్యత పెరగాలని, పథకాల పంపిణీలో 1 శాతంకూడా అవినీతి ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజల సంతృప్తి అంశంలో క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితుల ఆధారంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని సూచించారు. పథకాల లబ్ధిదారుల నుంచి నేరుగా సేకరించిన సమాచారం ఆధారంగా ఆయా శాఖల పనితీరుపై అధికారులతో సీఎం చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ సిబ్బంది, ఉద్యోగులు, అధికారులపై వచ్చిన ఫీడ్ బ్యాక్‌పై అధికారులు చంద్రబాబుకు నివేదిక అందించారు.
పింఛన్ల పంపిణీ, దీపం పథకం అమలు, అన్న క్యాంటీన్ నిర్వహణ, ఇసుక సరఫరా వంటి పథకాలు, పాలసీలపై వివిధ రూపాల్లో సేకరించిన సమాచారంపైనా చంద్రబాబు ఆరా తీశారు. ప్రభుత్వానికి సంబంధించిన ఏడు శాఖల్లో పథకాలు, కార్యక్రమాలపై సేకరించిన సర్వే ఫలితాలపై అధికారులు ముఖ్యమంత్రికి ప్రజెంటే >>2

## పది రోజుల్లో కేరళకు 'నైరుతి'

**విజయవాడ,మే 18,ప్రభాతవార్త ప్రతినిధి:** నైరుతి ఋతుపవనాలు మరో పది రోజుల్లో కేరళను తాకనున్నాయని వాతావరణ విభాగం (ఎఐండి) వెల్లడించింది. వాస్తవానికి ఇవి ఈ నెల 22న అండమాన్‌ను,26న శ్రీలంకను తాకొచ్చని భావించగా.. అందుకు పది రోజుల ముందుగానే శ్రీలంకలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం శ్రీలంక,అండమాన్‌లో విస్తరించాయి. తాజాగా ఈ నెల 27 నాటికి కేరళను తాకే అవకాశం కనిపిస్తోందని ఐఎండి తెలిపింది. రాబోయే రోజుల్లో మరింత వేగంగా కదలడానికి అనుకూల పరిస్థితులున్నాయని చెప్పింది. మరో వైపు పశ్చిమ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంకొనసాగుతోంది. దీని ప్రభావంతో రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది.

## 'సీమ' రైల్వే ప్రాజెక్టులకు రూ. 13,878 కోట్లు




### కొత్త రైలు మార్గాల నిర్మాణానికి రూ.8,358.12 కోట్లు
### డబ్లింగ్ రైలు మార్గాలకు రూ.3,344.77 కోట్లు
### రైల్వే విద్యుదీకరణ పనులకు రూ.2,113.82 కోట్లు
### ప్రాజెక్టు నిర్మాణాల సర్వేల నిర్వహణ, భూసేకరణ తుది సర్వేలకు రూ.61.31 కోట్లు

**గుంతకల్లు రైల్వే,మే 18,ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాయలసీమ జిల్లాలలో కొత్తగా చేపట్టనున్న, పనులు జరుగుతున్న వివిధ ప్రాజెక్టులకు రూ.13,878.29కోట్లను రైల్వే శాఖ కేటాయించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో సమర్పించిన బడ్జెట్‌లో రైల్వే శాఖకు కేటాయించిన ఈనిధులను రైల్వే శాఖ కన్సాలిడేటెడ్ బడ్జెట్ స్టేట్‌మెంట్ (సిబిఎస్)లో రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలో జరుగుతున్న వివిధరైల్వేప్రాజెక్టులను మంజూరుచేసిన నిధులవివరాలు ఇలా వున్నాయి.

**నూతన రైలు మార్గాలు :**
కంభం-ప్రొద్దుటూరు రైలు మార్గానికి రూ.1,575.55కోట్లు, రాష్ట్ర రాజధాని అమరావతి మీదుగా విజయవాడ-గుంటూరు మధ్య నిర్మించనున్న రైలు మార్గానికి రూ.2,679.59కోట్లు, మునిరాబాద్-మహబూబ్‌నగర్ ప్రాజెక్టుకు రూ.1,813కోట్లు, కళ్యాణదుర్గం మీదుగా రాయదుర్గం-తుముకూరు రైలు మార్గానికి రూ.1,687.19కోట్లు, మరికుప్పం-కుప్పం ప్రాజెక్టుకు రూ.279.65 కోట్లు, మలుగూర్-పాలసముద్రంకు రూ.323.14కోట్లు చొప్పున కేటాయించారు. ధర్మవరం-పాకాల-కాట్పాడి డబ్లింగ్ రైలు మార్గానికి రూ.2,900 కోట్లు, ఎర్రగుంట్ల బైపాస్ లైన్ నిర్మాణానికి రూ.48.74కోట్లు, యలహంక-పెనుకొండకు రూ.988.37కోట్లు, పెనుకొండ-ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్టుకు రూ.307.66కోట్లు చొప్పున కేటాయించారు.

**రైల్వే విద్యుదీకరణ ప్రాజెక్టులకు :**
యలహంక-పెనుకొండ-శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం ధర్మవరం-గుత్తి విద్యుత్‌రైలుమార్గానికి రూ.402.13 కోట్లు, నల్లపాడు-గుంతకలు >>2

## పిఎస్ఎల్‌వి సి-61 రాకెట్ విఫలం



### రక్షణ ఉపగ్రహం కక్ష్యకు చేరకముందే గతి తప్పిన రాకెట్
### సాంకేతిక లోపాలను విశ్లేషిస్తున్నామన్న ఇస్రో చైర్మన్ వి. నారాయణన్
#### కీలక ఉపగ్రహ వైఫల్యంతో అందరిలో నిరాశ, నిస్పృహలు



ఇస్రో చైర్మన్ నారాయణన్

**శ్రీహరికోట (తడ),మే 18, ప్రభాతవార్త:** కోట్లాది మంది భారతీయులు ఎన్నో ఆశలతో ఎదురు చూసిన ఉపగ్రహ ప్రయోగ విజయం సిద్ధించలేదు. సరిహద్దు రక్షణలో అత్యంత కీలకం అవుతుందని భావించిన ఇఒఎస్09 ఉపగ్రహం నిర్ణీత కక్ష్యకు చేరలేదు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కుతిరుగులేని విజయాలు అందించిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్‌వి-సి61) ఈసారి గతి తప్పింది. ఆదివారం ఉదయం ఉదయం సరిగ్గా 5.59 గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ విఫలం చెందింది. కేవలం 6 నిమిషాల 16 సెకన్ల వ్యవధిలోనే దారి తప్పింది. నాలుగు దశలతో నిర్మించిన ఈ రాకెట్ మొదటి, రెండు దశలు విజయవంతంగా దాటుకుని మూడో దశలో దిశ మారిపోయింది. అది ఘన ఇంధన దశ. 1993 సెప్టెంబర్ 20న పిఎస్ఎల్‌వి సిరీస్ ప్రారంభమయింది. ఈ సిరీస్‌లోని మొట్టమొదటి రాకెట్ పిఎస్ఎల్‌వి-డి1 కూడా సరిగ్గా మూడవ దశలోనే గతి తప్పింది. అయితే ఆ తర్వాత ఎన్నో పిఎస్ఎల్‌విలు మరెన్నో గఘన విజయాలు అందించాయి. భారత్ ఇప్పటివరకు 63 పిఎస్ఎల్‌వి రాకెట్లు ప్రయోగించగా, ఇది మూడవ వైఫల్యం మాత్రమే. శ్రీహరికోట నుంచి రాకెట్ నింగికి దూసుకెళ్లినతర్వాత 376.8 సెకన్లకు దారి మళ్లినట్లు సంకేతాలువచ్చాయి. ఈ రాకెట్‌ను >>2

## ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రుల కమిటీ

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వచ్చేనెల 21న ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ప్రభుత్వంనియమించింది. కమిటీలో మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కందుల దుర్గేష్ ఉన్నారు. కన్వీనర్‌గా వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు వ్యవహరిస్తారని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## మాజీ ఎంపి నందిగం సురేష్ అరెస్ట్

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీకి చెందిన మాజీ ఎంపి నందిగం సురేష్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. టిడిపి కార్యకర్త ఇసకపల్లి రాజుపై దాడి కేసులో సురేశ్ అరెస్టు అయినట్లు వెల్లడైంది. నందిగం సురేశ్ ను ప్రస్తుతం తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాజధాని పరిధిలోని ఉద్దండ రాయునిపాలెంలో టిడిపి నేత రాజుపై వైఎస్సార్సీకి చెందిన మాజీ ఎంపి నందిగం సురేశ్ దాడికి పాల్పడ్డారన్నది అభియోగం. శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసు >>2

## చికిత్స కోసం అమెరికాకు కొడాలి నాని!

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** గుండె సమస్యతో భాధపడుతూ ముంబయి లోని ఓ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న వైఎస్సార్సీ నేత,మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వర రావు(నాని) హైదరాబాద్ చేరుకున్నారు. మెరుగైన చికిత్స కోసం అమెరికాకు వెళ్లే యోచనలో నాని ఉన్నట్లు సమా >>2



ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఘటనలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

### నగల దుకాణం దగ్ధం, 17 మంది దుర్మరణం
### మృతులలో 8 మంది చిన్నారులు

**హైదరాబాద్, (చార్మినార్) మే 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలో గల గుల్జార్‌హౌజ్ వద్ద నగల దుకాణం యజమాని ఇంట్లో ఆదివారం ఉదయం సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో 17 మంది దుర్మరణం చెందగా నలుగురిని అగ్నిమాపక శాఖ సిబ్బంది కాపాడారు. కాగా మృతులంతా నగల దు కాణం యజమానితో పాటు ఆయన సోదరుడు వారి కుటుంబీకులే కావడం, మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు, ఐదుగురు మహిళలువుండడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో గల నగల దుకాణంలో ఏసి కంప్రెషర్ పేలడం వల్ల ఒక్కసారిగా మంటలు, పొగ చెలరేగి, నిమిషాల వ్య వధిలో మొదటి అంతస్తుకు, రెండవ అంతస్తుకు వ్యాపించడంతో ఆ సమయంలో గాడ నిద్రలో వున్న వారు పొగతో ఊపిరి ఆడకుండా స్పృహ కోల్పోయారు. నగల దుకాణంలో మంటలు చెలరేగిన విషయమై అగ్ని మాపక శాఖ అధికారులకు సమాచారం అందగానే పది నిమిషాల వ్యవధిలో మొగల్‌పురా ఫైర్ స్టేషన్‌నుంచి రెండు యంత్రాలు, ఆ తరువాత మరో ఎనిమిది అగ్నిమాపక యంత్రాలను రంగంలో దించి మంటలను ఆర్పారు.మూడుగంటలు శ్రమించిన తరువాతే మంటలు అదుపులోకి వచ్చాయి. >>2

## అలిపిరి వద్ద బేస్ క్యాంప్



### తిరుమల భక్తుల కోసం వసతి సౌకర్యం, దర్శన కౌంటర్లు ఏర్పాటు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమల విజన్ 2047 అమలులో భాగంగా కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి విచ్చేస్తున్న భక్తులకు వసతి,దర్శన సదుపాయాలు మరింత సులభం చేయదానికి వీలుగా తిరుపతి అలిపిరి వద్ద బేస్‌క్యాంపు ఏర్పాటుకు టిటిడి సిద్ధమైంది. సుమారు 15హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీ చేసే కౌంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు.ఇందుకు అన్ని సమకూర్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలి, అధికారులు కూడా ముందుకు కదులుతున్నారు. దేశంలోని అనేక ప్రాంతాలనుండి దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతి రోజూ లక్షమందివరకు భక్తులు వస్తున్నారు.
కొండపై 50వేలమంది భక్తులు రద్దీ పెరిగిత 1,2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు నిండిపోయి వెలుపలకు క్యూలైన్లు విస్తరిస్తున్నాయి. విపరీతమైన రద్దీతో శ్రీవారి దర్శనానికి 20గంటల నుండి 30గంటల సమయం పడుతోంది. దీంతో రద్దీకి అనుగుణంగా టిటిడి కొన్ని ప్రత్యామ్నాయ చర్యలు, నిర్ణయాలు తీసుకుంటోంది. భక్తులు తిరుమలకు చేరుకుంటే వీలైనంత వరకు త్వరగా నాలుగైదు గంటల్లోనే దేవుని దర్శనం చేయించేలా కృత్రిమమేధ (ఏఐ) ఆధారిత సేవలను ప్రారంభించాలని ఆలోచన ఉంది. ఇదే సమయంలో తిరుపతి అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడం వల్ల వసతి, దర్శన కౌంటర్లు అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 30వేలమంది వరకు భక్తులు ఈ >>2



ప్రమాదానికి గురైన కారును బావిలోనుంచి బయటకు తీస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) ప్రమాదానికి గురైన కారు

## వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిన కారు

### ముగ్గురు మృతి, ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు, పీలేరు వద్ద దుర్ఘటన

**పీలేరు మే 18 ప్రభాతవార్త:** పీలేరు మండలంలో ఓ కారు వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లడంతో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. కర్ణాటక రాష్ట్రం చింతామణి పరిసర గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు కేటరింగ్ నిర్వహించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు వీరందరూ పీలేరులో కేటరింగ్ నిర్వహించడానికి ఒప్పుకున్నారు తమిళనాడు రాష్ట్రం హోసూరులో క్యాటరింగ్ నిర్వహించి ఆదివారం అర్ధరాత్రి12 గంటల ప్రాంతంలో పీలేరు బయలుదేరారు. మరో 10 నిమిషాలు ప్రయాణిస్తే పీలేరుకు చేరుకుంటారు ఈ >>2



గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఆదివారం తిరంగా యాత్రలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# పథకాల అమలు

>> షన్ ఇచ్చారు. ఐవీఆర్ఎస్‌తోపాటు ఇతర రూపాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయగా.. ప్రజల సంతృప్తి అంశంలో క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితుల ఆధారంగా ముందుకెళ్లాలని సీఎం ఆదేశించారు. ప్రజలే ఫస్ట్ అనే విధానంలో ప్రజల అభిప్రాయాలు, అంచనాల మేరకు పనిచేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సిఎంకు అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో వివరాలు ఇలా ఉన్నాయి. వీటిని అనుసరించి ప్రతి నెలా 1వ తేదీన ఇంటివద్దే ఫింఛన్ అందుతుందా అనే ప్రశ్నకు 94శాతం మంది లబ్ధిదారుల నుంచి సంతృప్తి వ్యక్తమైంది. పింఛను అందించిన ఉద్యోగుల ప్రవర్తనపై 90 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. మీరు పింఛను తీసుకుంటున్నప్పుడు అవినీతి గమనించారా అన్న ప్రశ్నకు 12శాతం మంది అక్కడక్కడా అవినీతి జరుగుతుందని ఫిర్యాదు చేశారు. అన్న క్యాంటీన్‌లో పారిశుధ్యంపై 82 శాతం మంది, ఆహారంలో నాణ్యతపై 91 శాతం మంది, సమయపాలనపై 84 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణ విధానంపై 89.92 శాతం మంది రైతుల నుంచి సంతృప్తి వ్యక్తమైంది. గోనె సంచుల విషయంలో 30 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతకు తగ్గ ధర లభించిందని 84 శాతం మంది అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 7 ఆలయాల్లో దర్శనాల తీరుపై సర్వే నిర్వహించగా 70 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. వసతులపై 37 శాతంమంది భక్తుల్లో అసంతృప్తి కనిపించింది. ప్రసాదంపై మాత్రం 81 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో ఆసుపత్రుల్లో అడ్మిషన్‌పై 90 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. సేవల విషయంలో 87 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యమిత్రల పనితీరుపై 87 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపైన అధికారులు సిఎం చంద్రబాబుకు పలు విషయాలు వివరించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటుపై 65 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవినీతి జరుగుతుందని 37 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను సాదా సీదా తీసుకోకండి..ప్రతిది మనం రికార్డు చేసుకుంటున్నాం,ఆయా అంశాలను మనం పరిష్కరించడంతో పాటు వివిధ ప్రభుత్వశాఖల పనితీరు బాగుపడాలని సిఎం వ్యాఖ్యానించారు. వైద్య, ఆరోగ్య శాఖపై వచ్చే ఫిర్యాదుల విషయంలో అలెర్ట్‌గా ఉండాలన్నారు. ఈ శాఖలో అవినీతి ఆరోపణలు,పనితీరుపై వస్తే అభిప్రాయాలపై ఎప్పటికప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు.గతంలో ఎన్నడు లేని వైద్యశాఖపై మనం దృష్టి పెట్టామన్నారు. ప్రస్తుత తరుణాన్ని పరిశీలించి, వ్యాధుల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలన్నారు.కొత్త వేరియంట్లు వస్తే వెంటనే అవి వ్యాప్తి చెంద కుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇది మనకు అత్యంత కీలకంగా భావించా లన్నారు. వైద్యశాఖ అలసత్వం వ్యవహరించిన అనేకమంది వైద్యులు నిర్లిప్త మాటలగా చర్యలు తీసుకున్నామన్నారు.సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూ గిరిజనులకు న్యాయం చేస్తామని తెలిపారు.మా ప్రభుత్వం ఇటువంటి కీలక నిర్ణయాలను ఐవిఆర్ఎస్ ద్వారానే తెలుసుకుంటున్నారు. 'తల్లికి వందనం' వచ్చే నెలలో విద్యాసంవత్సరం ఆరంభం నాటికి అందుబాటులోకి తీసుకువ వస్తామన్నారు.

## సనంద్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షా

సనంద్(గుజరాత్), మే 18: ఆపరేషన్ సిందూర్‌తో భారత్ విజయానికి ప్రతీకగా దేశవ్యాప్తంగాజరుగుతున్న తిరంగార్యాలీల్లో కేంద్ర మంత్రులు కూడా పాల్గొంటున్నారు. గుజరాత్ బిజెపి ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీలోకేంద్ర మంత్రి అమిత్‌షా పాల్గొన్నారు. మువ్వన్నెల జెండాను చేతబట్టి సనంద్‌లోని నల్ సరోవర్ చౌకినుంచి ఎక్లింగ్‌జీరోడ్డులోని మహారాణాప్రతాప్ చౌక్ వరకూ పాదయాత్రచేసారు. ర్యాలీలో ముఖ్య మంత్రి భూపేంద్ర పటేల్, హర్ష్‌సంఘ్వీ తదితర రాష్ట్రమంత్రులు కూడా పాల్గొన్నారు. ఎక్లింగ్‌జీరోడ్డులోని 16వ శతాబ్దపు మహారాణా విగ్రహం వద్ద నివాళి అర్పించి అనం తరం పాదయాత్రను కొనసాగించారు. స్థానిక ఎమ్మెల్యేలు, బిజెపినాయకులు, వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అత్య ధిక సంఖ్యలో పాల్గొన్నారు. సనంద్‌వీసరాల నుంచి కూడా సామాజిక రాజకీయ కార్యకర్తలు తిరంగా యాత్రలో పాల్గొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలుచేసారు. త్రివిధ దళాల ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరూ అభినందిం చారు. ఆపరేషన్‌సింధూర్ విజయవంతం చేయడంలో మన త్రివిధ దళాలశక్తిని ప్రపంచా నికి చాటిచెప్పామని, మన యోధులకు గౌరవ సూచకంగానే ఈ యాత్రలునిర్వహి స్తున్నట్లు గుజరాత్ బిజెపిరాష్ట్రయూనిట్ ప్రకటించింది.

## సురేష్ అరెస్ట్

>> కుంది. రాజుపై నందిగం సురేష్‌తో పాటు ఆయన సోదరుడు ప్రభుదాసు, బంధువులు దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన రాజు మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతు న్నారు. ఈఘటనపై బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజు ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో రాత్రి 9 గంటల సమయంలో వేగంగా కారువచ్చి ఇసుకపల్లి రాజుని ఢీకొట్ట డంతో కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసేపటికే సురేష్ ఆయన అన్న ప్రభుదాస్, ఇతర బంధువులు వచ్చి అక్కడే రాజుని కొట్టి మళ్లీ ఇంటికి తీసుకెళ్లి అక్కడా చావబాదారు. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయకముందే సురేష్ భార్య రాత్రి 11 గంటలకు సమయంలో కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసారు.

## కొడాలి నాని!

>> చారం. హైదరాబాద్‌లోని వెంకటేశ్వరరావు విశ్రాంతి తీసుకుంటున్నారు. వైకాంగ్రెస్ పార్టీలోని అత్యంత సన్నిహితులను మినహా ఎవరినీ దగ్గరకు రానివ్వట్లేదని తెలిసింది. వైఎస్సార్సీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలపై అసభ్య పదజాలంతో విరుచుకుపడిన నాని తెరవెనుక మట్టి, ఇసుక సహా అనేక అక్రమాలకు పాల్పడ్డా రన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం వాటిపై విజిలెన్స్ విచారణలు జరుగుతున్నాయి.



ఆదివారం నాగ్‌పూర్ జిల్లాలో తిరంగా యాత్రలో పాల్గొన్న మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్ తదితరులు

# రూ. 13,878 కోట్లు

>> (పెండే కల్లు-గుంతి కలువకుని) రూ.824.9 కోట్లు, (తోరణగల్లు- రంజీతపుర బ్రాంచిలైన్ కలువకొని) రూ.226.68కోట్లు,చిక్ జాజూర్-రాయదుర్గం-బళ్లారి ప్రాజెక్టుకు రూ.244.23కోట్లు, నంద్యాల-ఎర్రగుంట్లకు రూ.121.86కోట్లు, ధర్మవరం-పాకాల ప్రాజెక్టుకు రూ.239.1కోట్లు,గద్వాల-రాయచూరుకు రూ.54.92కోట్లు కేటాయించారు.

**సర్వేలు,భూసేకరణ తుది సర్వే ప్రాజెక్టులు :**

కర్నూలు జిల్లా వాసులు సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న మంత్రాలయం రోడ్డు-కర్నూలు నూతన రైలు మార్గాన్ని ఇంజనీరింగ్, ట్రాఫిక్ సంయుక్తంగా నిర్వహించే ప్రాథమిక సర్వేకు రూ.0.28కోట్లు కేటాయించి ప్రాజెక్టుకు జీవం పోశారు. ధర్మవరం-బళ్లారి నూతన రైలు మార్గానికి ఇంజనీరింగ్,ట్రాఫిక్ సంయుక్తంగా నిర్వహించే ప్రాథమిక సర్వేకు రూ.0.30కోట్లు,కడప,గుంతకల్లు,బళ్లారిలతో పాటు దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో మరికొన్ని రైలు మార్గాల నిర్మాణానికి ప్రాథమిక సర్వేకు రూ.1.11కోట్లు కేటాయించారు. అలాగే అమరావతి మీదుగా విజయవాడ-గుంటూరు మధ్య నిర్మించనున్న నూతన రైలు మార్గం తుది భూసేకరణ సర్వే నిర్వహణకు రూ.1.33కోట్లు,ముద్దనూరు-ముదిగుబ్బ ఆర్ఇటి సర్వేకు రూ.0.16కోట్లు, విశాఖపట్నం-విజయవాడ- కర్నూలుతో పాటు చేపట్టనున్న నూతన రైలు మార్గాల నిర్మాణాల తుది భూసేకరణ సర్వేలకు రూ.4.71కోట్లు, ఓబులవారి పల్లి-రేణిగుంట వరకున్న రైలు మార్గాల తుది భూసేకరణ సర్వే నిర్వహణకు రూ.1.12కోట్లు, స్వామి హళ్లి-రాయదుర్గం తుది భూసేకరణ సర్వేకు రూ.1.30కోట్లు, ములుగూరు-మదకశిర-హోసూర్ నూతన రైలు మార్గం భూసేకరణ తుది సర్వేకు రూ.2.75కోట్లు,రాయదుర్గం-తుముకూరు డబ్లింగ్ రైలుమార్గం ప్రాజెక్టు తుది భూసేకరణ సర్వే నిర్వహణకు రూ.3.88కోట్లు,హిందూపురం-చిత్రదుర్గమధ్య చేపట్టనున్న ఆర్ఇటిసర్వేకు రూ.0.33కోట్లు కేటాయించారు.

# బంగాళాఖాతంలో 'శక్తి' తుఫాను

### పలు జిల్లాలను అప్రమత్తం చేసిన వాతావరణ శాఖ

హైదరాబాద్, మే 18, ప్రభవార్త: దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతోంది. రానున్న రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇది తుఫానుగా మారనుంది. దీనికి 'శక్తి' తుఫాను అని పేరు పెట్టారు. దీంతో వారం రోజుల పాటు తెలంగాణ,ఎపి లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. వీటి ప్రభావంతో వారం రోజుల పాటు తెలంగాణ, ఎపి సహా దక్షిణాది రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశంకూడా ఉందని, వర్షంపడే సమయంలో చెట్ల కిందకు వెళ్లకూడదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తెలంగాణలో అక్కడక్కడా భారీ వర్షం కురుస్తుందని ఐఎండీ తెలిపింది. సాయంత్రం 5గంటల తరువాత పశ్చిమ తెలంగాణలో వర్షం మొదలై రాత్రంతా కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని గద్వాల్, మహబూబ్ నగర్, నిజామాబాద్, పెద్దపల్లి, జగిత్యాల ఇలా కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే, గాలి వేగాన్ని బట్టి వర్షం పడే ప్రాంతాలు మారే అవకాశాలున్నాయి. మరోవైపు రాబోయే మూడురోజుల్లో తెలంగా ణలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాగల మూడు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుండి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాతావరణం మేఘావృతం అయ్యి ఉంటుంది.

# రాష్ట్రమంతా వర్తింపు

>> అంచనా వేశారు. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, హోంమంత్రి అనిత, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిల బృందం ఫిబ్రవరిలో కర్ణాటకలో పర్యటించింది. అక్కడ అమలవుతున్న ఉచిత బస్ పథకంపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. మరోవైపు ఈ పథకం అమలవుతున్న 5 రాష్ట్రాల్లోని పరిస్థితులపై ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వానికి మరో నివేదిక ఇచ్చింది. ఆర్టీసీలో 11,216 బస్సులుంటే, వాటిలో 8,193 పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ఈ పథకం అమలు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం 69 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో టికెట్ల ద్వారా రాబడి ఏడాదికి రూ.3,708 కోట్లుగా ఉంది. అందులో 40 శాతం మహిళా ప్రయాణికుల ద్వారా వస్తున్న రాబడి 14 వందల 83 కోట్లుగా లెక్క వేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే ఓఆర్ 94 శాతానికి చేరుతుంది. టికెట్ల ద్వారా వచ్చే రాబడి రూ.5051 కోట్లకు చేరుతుంది. మహిళా ప్రయాణికుల సంఖ్య 63 శాతానికి పెరుగుతుంది. వారి టికెట్లకు చెందిన సొమ్ము ఏటా రూ3,182 కోట్లు ఉంటుంది. ఇదంతా ప్రభుత్వం భరించాలి. ఆర్టీసీ బస్సుల్లో ప్రస్తుతం నిత్యం ప్రయాణించే వారి సంఖ్య సగటున 43.59 లక్షలు. అందులో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ప్రతిరోజూ ప్రయాణించే వారు 23.67 లక్షలు. వీరిలో మహిళా ప్రయాణికుల సంఖ్య 9.46 లక్షలు. దూరప్రాంత సర్వీసుల్లో ప్రయాణికులు 3.33 లక్షలు. విద్యార్థి పాస్‌లు, వివిధ రాయితీల పాస్‌లు కలిగినవారు 16.59 లక్షలు. వీరిలో మహిళలు 6.64 లక్షలు. అంటే ఉచిత ప్రయాణం అమలు చేయనున్న బస్సుల్లోని మహిళా ప్రయాణికులు 9.46 లక్షలు, మహిళా పాస్ హోల్డర్లు 6.64 లక్షలు కలిపి నిత్యం 16.10 లక్షల మంది ఉన్నారు.ఉచిత ప్రయాణ పథకం అమలు చేస్తే వీరి సంఖ్య నిత్యం 26.95 లక్షలకు చేరుతుంది. అంటే రోజుకు 10.85 లక్షల మంది మహిళలు అదనంగా ప్రయాణిస్తారని అంచనా. ఉచిత ప్రయాణ సమయంలో మహిళలకు జీరో టికెట్ జారీ చేస్తారు. మహిళలకు ఇచ్చే టికెట్‌లో సున్నా ఉంటుంది. కానీ, ఈపోస్ యంత్రంలో మాత్రం టికెట్ ధర నమోదవుతుంది. ఇలా మహిళా ప్రయాణికులకు జారీ చేసిన టికెట్ల విలువను ఆర్టీసీ లెక్కించి, ప్రతినెలా ప్రభుత్వానికి అందజేస్తుంది. ఆ మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సి ఉంటుంది.ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబుకు మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య ప్రజల కోసం ముఖ్యమంత్రి చొరవ అభినందనీయమన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు భారీ ఊరటనిచ్చారన్నారు. చంద్రబాబు ప్రజా సంకల్పమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని తెలిపారు. మహిళలకు, వృద్ధులకు ప్రయాణంలో భద్రత, స్వేచ్ఛను కలిగించిన సీఎంకి ధన్యవాదాలు చెప్పారు. గ్రామాల నుంచి పట్టణాలకు వడివడిగా ప్రయాణించే మహిళలకు ఇది వరమని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఓ నిర్ణయం కాదు - ప్రజల పట్ల సీఎం హృదయాన్ని చూపిస్తోందన్నారు. ఉచిత బస్సు పథకంతో కుటుంబ ఆర్థిక భారం తగ్గుతుందని వెల్లడించారు. టిడిపి ప్రభుత్వం సామాజిక న్యాయం, సౌకర్యాల పాలనకు సంకేతం ఇదే అన్నారు. మహిళా సాధికారతకు చంద్రబాబు బలమైన అడుగులు వేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణంపై సిఎం చంద్రబాబు క్లారిటీ ఇవ్వడంతో మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# అలిపిరి వద్ద బేస్ క్యాంప్

>> క్యాంప్‌లోనే ఉండేందుకు వీలుంటుంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కూడా అవసరమైన మౌలిక వసతులకు టిటిడికి అనుమతులు ఇచ్చింది. కొండపై రద్దీని నియంత్రించేందుకు వీలుగా అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నారు. సాదారణ రోజుల్లోనే తిరుమలకు 80వేలమంది నుండి 90వేలమంది వరకు భక్తులు చేరుకుంటున్నారు. ఇక వారాంతం,ప్రత్యేక పర్వదినాల్లో, విశేషమైన ఉత్సవాల రోజుల్లో 1.50లక్షలమంది వరకు కూడా భక్తులు తిరుమలకు వస్తున్నారు. గత ఏడాది కాలంలో తిరుమలలో విజన్ 2047కి శ్రీకారంచుట్టేలా పనులు చేపట్టేందుకు ప్రస్తుత టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇ సత్యనారాయణ సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. అలిపిరి పాతచెక్ పోస్టు ప్రాంతంలో సమీప స్థలాలను కలుపుకునిగానీ, దేవలోక్ ప్రాంతంలోగానీ బేస్‌క్యాంపు ఏర్పాటుకు స్థలాల పరిశీలన జరిగింది.

**బేస్‌క్యాంపుతోనే యాత్రికులకు సకల సేవలు:**

ఇప్పటికే అలిపిరి వద్ద ఇందుకోసం స్థలాన్ని కూడా టిటిడి పరిశీలించింది. ప్రస్తుతం తిరుమలలో 7,790 గదులు, వెయ్యికిపైగా మఠాల్లోని గదులు, మూడు యాత్రికుల వసతి సముదాయాల్లో 7వేల వరకు లాకర్లు సదుపాయం ఉన్నాయి. వీటన్నిటిలో 40వేలమంది నుండి 50వేలమంది వరకు భక్తులకు వసతి పొందుతున్నారు.ఆపై భక్తులు కొండకు చేరుకున్నా ఆరుబయట, ఖాళీస్థలాల్లో, ఉద్యానవనాల్లో విశ్రాంతి తీసుకోవడం, తలదాచుకోవడం కనిపిస్తుంది. సామాన్యభక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. భక్తులకు సంతోషకరమైన దర్శనంతోబాటు సంతృప్తికర వసతి కల్పించేందుకు బేస్‌క్యాంపు ప్రధానంగా నిలవనుంది. దేశంలోని పలుప్రాంతాలనుండి తిరుపతికి చేరుకునే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనాలను అలిపిరి బేస్‌క్యాంపుకు అనుసంధానం చేసి, ఇక్కడ వసతి కల్పించడం వల్ల శేషాచలం అడవిలో కొలువైన తిరుమలకు వాహనాలు కాలుష్యం,పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకునే వీలుకలుగుతుంది. ఘాట్‌లో అనుభవంలేని వాహనాల డ్రైవర్లు ప్రమాదాలకు గురవుతున్నారు. అలిపిరి నుండి భక్తులను ఆర్టీసి బస్సులద్వారా తిరుమలకు చేరవేయాలనేది ప్రధాన ఉద్దేశ్యం కూడా తెలుస్తోంది. బేస్‌క్యాంపులో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వివిధ రకాల ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రణాళికలు రూపొందించి ఆమోదించడంతో టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు టిటిడి వేగంగా ప్రయత్నిస్తోంది.



## వార్తాఫలం

**మేషం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. విలువైన వస్తువులు జాగ్రత్త అవసరం.

**వృషభం :** పనులలో జాప్యం ఒరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ప్రయాణా లలో తొందరపాటు వద్దు.

**మిథునం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు. స్వల్ప ధనలాభం.

**కర్కాటకం:** విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గుంటారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**సింహం:** కుటుంబంలో సమస్యలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగతారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కన్య :** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూర ప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు.

**తుల :** ప్రయాణాలలో నూతన పరి చయాలు పెరుగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రమే.

**వృశ్చికం:** ప్రముఖుల నుండి సలహాలు స్వీకరిస్తారు. పుణ్యక్షేత్రాల సందర్శనం. శుభవార్తలు అందుకుంటారు.

**ధనుస్సు:** వ్యాపారాలలో ఆటంకాలు ఏర్పడి చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రముగా వుంటుంది.

**మకరం:** ఋణబాధలు తప్పవు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కుంభం:** నూతన మిత్రులతో పరిచయాలు పెరుగుతాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**మీనం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి. ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాకెట్ విఫలం

>> నియంత్రిస్తున్న త్రివేంద్రంలోని ఇస్రో వారి భూకేంద్రం మొట్టమొదట ఈ వైఫల్యం గుర్తించింది. అప్పటిదాకా అంతా బాగానే ఉంది. మొదట ఆరు స్ట్రాపాన్లు, మొదటి ఘన ఇంధన దశ, రెండవ ద్రవ ఇంధన దశ నిర్ణీత కాలంలో ముగిసింది. మూడవ ఘన ఇంధన దశ వైఫల్యం కొంపముంచింది. ఈ దశను శ్రీహరికోటలోనే రూపొందించారు. 3.6 మీటర్ల పొడవు, రెండు మీటర్ల వ్యాసం, హెచ్‌టిబిడి అనే ఘన ఇంధనాన్ని ఇందులో నింపారు. 7.65 టన్నుల ఘన ఇంధనంతో ఈ మూడో దశ నిర్మాణమైంది.

**ఉత్కంఠ భరిత క్షణాలు..**

త్రివేంద్రం నుంచి వైఫల్యం నీడలు తొలిసారి బయటపడిన తర్వాత రాకెట్ ప్రయోగ దృశ్యాలను దూరదర్శన్ లైవ్ నిలిపివేశారు. అప్పుడే రాకెట్ గతి తప్పినట్లు శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో పెద్ద తెరలపై వీక్షించి పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. స్క్రీన్ మీద రాకెట్ దారి మళ్లినట్లు ఒక దృశ్యం కనిపించింది కూడా. మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రయోగాన్ని వీక్షించిన ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్‌తో పాటు ఇతర శాస్త్రవేత్తలు, 18 మంది కేంద్ర పార్లమెంటరీ కమిటీబృందం సభ్యులు, మాజీ ఛైర్మన్ ఎఎస్ కిరణ్‌కుమార్ తదితరులు రాకెట్ ప్రయోగం ఏమయిందన్న సందేహాలతో ఉన్నారు. ఆ తర్వాత కొద్ది క్షణాలకు దూరదర్శన్ వారు మళ్లీ లైవ్ ప్రసారం చేశారు. అయితే ఈ సారి రాకెట్ ప్రయోగ దృశ్యాలు కాకుండా ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ మిషన్ కంట్రోల్ సెంటర్‌నుంచి ప్రసంగిస్తున్నారు. ఈ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టలేకపోతున్నాం. కారణాలను విశ్లేషించి మళ్లీ చెప్తాం అంటూ దూరద ర్శన్‌లో క్లుప్తంగా మాట్లాడి వెళ్లిపోయారు. ఆతర్వాత ఛైర్మన్ నారాయణన్‌తో పాటు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మీడియాసెంటర్‌కు హడావుడిగావచ్చి పిఎస్ రాకెట్ ప్రయోగం విజయవంతం కాలేదనిచెప్పి క్షణాల్లోనే వెనుతిరిగారు.

**ఉపగ్రహం ఏమైంది ? నాలుగో దశ ఎక్కడ ?**

అంతరిక్షంలోని రెండు వేర్వేరు కక్ష్యల్లో పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ ఉపగ్రహాన్ని, నాలుగవ దశను ప్రవేశపెట్టేలా ఇస్రో శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించారు. మొదటగా భూమికి 534 కిలోమీటర్ల ఎత్తులోని సన్ సింక్రోనస్ పోలార్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టిన తర్వాత రాకెట్ నాలుగో దశను మరో కక్ష్య వైపు తీసుకెళ్లాల్సి ఉంది. ఈ నాలుగో దశలో మరిన్ని పరిశోధనల కోసం కొంచెం దిగువ కక్ష్యలో భూమికి 351 కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెట్టాల్సి ఉంది. ఈ రెండు కార్యక్రమాలు పిఎస్ఎల్‌వి-సి61 చేయలేకపోయింది. ఇక ఈ ప్రయో గంలో నాలుగో దశ పరిశోధనలకు కొన్ని ఉపకరణాలు పంపించి ఉన్నారు. ఈ కీలక దశ రాకెట్‌తో పాటే గతితప్పిందా? ఒక వేళ నాలుగో దశ చివరిక్షణాల్లో అంటుకుని దాన్ని నిర్ణీతకక్ష్యకు చేరువఅవుతుందా? అనే దిశలో శాస్త్రవేత్తలు భూకేంద్రాలనుంచి పరిశోధనలుచేస్తున్నారా? అన్న చర్చలు జరుగుతున్నాయి.

# భారీ అగ్నిప్రమాదం

>> ఈ ఘటనలో నగల దుకాణం యజమాని ప్రహ్లాద్ మోడి (72)తో పాటు ఆయన సోదరుడు రాజేందర్ మోది (65), ప్రహ్లాద్ మోది భార్య మున్నీ భాయి మోది (68), రాజేందర్ మోది భార్య సుమిత్ర (60), ప్రహ్లాద్ మోది పెద్ద కుమారుడు కుమారుడు పంకజ్ మోది (43), కో డలు వర్ష (36), కుమార్తెలు శీతల్ (35), రజని (32), రెండవ కుమారుడు సోదరుడు అభిషేక్ (31) మరణించారు. వీరితో పాటు పంకజ్ మోది పిల్లలు అన్య మోది (12) ఇదికా మోది (8). ఇరాజ్ మోది (2)లు, శీతల్ జైన్ కుమార్తె ఆరుషీ జైన్ (17), రజని కుమార్తె హర్షాలి గుప్తా (7), రాజేందర్ మోది మనవలు ప్రియాంషి అగర్వాల్ (6). హమేయ్ (7), రిషబ్ (4)లు మరణించారు. కాగా ఈ ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికివెళ్లి గాయపడ్డ బా ధితులను పరామర్శిం చారు. అనంతరం ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదంపై అధికా రులను అడిగి తెలుసుకున్నారు. మంటలు చెలరేగిన భవనంలో పైకి వెళ్లేందుకు ఒకటే మెట్ల మార్గం వుండడం, అది కూడా చిన్నదిగా వుండడం వల్ల ప్రమాద తీవ్రత పెరిగిందని, లోపలి భాగంలో మంటలను ఆర్పేందుకు రోబోను కూడా పంపామని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. పాతబస్తీలోని నగలు, ముత్యాల అమ్మకాలకు ప్రసిద్ధిగాంచిన గుల్జార్‌హౌజ్ వద్ద ఓ నగల దుకాణంలో సంభవించిన భారీ అగ్నిప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. పూనంచంద్ అనే వ్యక్తికి చెందిన రెండంతస్తుల భవనంలో ఒక భాగంలో పూనం చంద్ జ్వెల్లర్స్, దీని పక్కనే కృష్ణా ముత్యాల దు కాణం వుంది. భవనం మొదటి అంతస్తులో నగల దుకాణం యజమాని ప్రహ్లాద్ మోది ఆయన సోదరుడు రాజేందర్ కుమార్ మోది కుటుంబం నివసిస్తోంది. ఆయన ఇద్దరు కుమారులు పంకజ్ మోది, రెండవ కుమారుడు అభిషేక్ మోదితో పాటు పెద్ద కోడలు వర్ష వారి ముగ్గురు పిల్లలు ఇదే ఇంట్లో వుంటున్నారు. వేసవి సెలవులు కావడంతో పహ్లాద్ మోది సోదరుడు రాజేందర్ మోది, ఆయన భార్య సుమిత్రతో పాటు నగరంలోనే వుంటున్న ప్లహాద్ మోది కుమార్తెలు శీతల్ జైన్, రజని గుప్తా వారి పిల్లలంతా వేసవి విడిది కోసం తండ్రి ఇంటికి వచ్చారు. రాత్రి 12 గంటల వరకు కుటుంబ సభ్యులంతా మాట్లాడుకుని నిద్రపోయారు. ఉదయం ఆరుగంటల సమయంలో కింది భాగంలో గల నగలదుకాణంలో వున్న ఏసి కంప్రెషర్ ఒక్కసారిగా పేలిపోవడంతో నిమిషాల వ్యవధిలో మంటలు చెలరేగి దుకాణంలోని వస్తువులతో పాటు ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యింది. వెను వెంటనే మంటలు మొదటి అంతస్తు, రెండవ అంతస్తుకు వ్యాపించాయి. మంటతోపాటు పొగకూడా మొదటి, రెండవ అంతస్తుకు వ్యాపించడంతో ఇక్కడ గాఢ నిద్రలో వున్న ప్రహ్లాద్ మోది, రాజేందర్ మోదిల కుటుంబ సభ్యులు, వారి పసిపిల్లలు ఏం జరిగిందో కూడా తెలుసుకునే వీలులేని పరిస్థితి నెలకొనడంతో ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. సరిగ్గా ఇదే సమయంలో స్థానికులు దీనిపై పోలీసులతో పాటు అగ్నిమాపక శాఖకు ఫిర్యాదు చేయడంతో వారు హుటాహుటిన రంగంలో దిగి అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పారు. భవనం పై భాగంలో వెళ్లేందుక గల మెట్ల మార్గం చిన్నదిగా వుండడం, అక్కడ మంటలతో పాటు పొగ చూరడంతో అగ్నిమాపక సిబ్బంది ముందుకు వెళ్లలేక పోయారు. దీంతో నిచ్చెన ద్వారా మొదటి అంతస్తులో వెళ్లి అక్కడ ఊపిరి ఆడకుండా స్పృహలేని పరిస్థితిలో వున్న 17 మందిని బయటకు తరలించి మల క్‌పేట యశోధ ఆసుపత్రితో పాటు హైదర్‌గూడ అపోలో, ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే వారంతా మరణించారు. వీరి మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోస్టు మార్టం అనంతరం మృత దేహాలను వారి కుటుంబీకులకు అప్పగించారు.

# బావిలోకి దూసుకెళ్లిన కారు

>> క్రమంలోనే నిద్రమత్తు ఆవహించడంతో వీరు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కనే ఉన్న పాడుబడ్డ వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. పీలేరు సిఐ యుగంధర్ కథనం మేరకు సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు హుసూరు నుంచి ఐదుగురు వ్యక్తులు పీలేరులో క్యాటరింగ్ నిర్వహించడానికి ఆదివారం రాత్రి 12 గంటలకు కారులో బయలుదేరారు. మరో పది నిమిషాల్లో అనుకున్న ప్రాంతానికి చేరుకుంటారు. ఈ క్రమంలో పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ కురవపల్లె సమీసంలోకి రాగానే 4 గంటల ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కనే ఉన్న పాడుపడ్డ వ్యవసాయ బావిలోకి దూసుకొంది. బావిలోకి దూకిన కారు తలకిందలై పూర్తిగా నీటిలో మునిగిపోయింది. వీరిలో కారు వెనుక సీట్లో కూర్చొన్న ఇద్దరు వ్యక్తులు సాహసించి కారు అద్దాలు పగలకొట్టి బయటపడగలిగారు. మిగతా ముగ్గురు బయటకు వచ్చే క్రమంలో ఊపిరాడక కారులో ఇరుక్కుని మృతి చెందారు మృతి చెందిన వారిలో చింతామణి చాంద్రహళ్లి గ్రామానికి చెందిన శివానంద (45) కారులో చిక్కుకుని మృతి చెందాడు. ఇతనికి భార్య కవిత(40), చందన (17), భార్గవ్(15) ఇద్దరు పిల్లలు ఉన్నారు. సొలుగుటూరు గ్రామానికి చెందిన లోకేశ్(40) ఉండగా ఇతనికి భార్య చందన (35) అమూల్య (10), బాస్కర్(8) అనే పిల్లలు ఉన్నారు. .. కోలారు జిల్లా పొగుటూరుకు చెందిన చలపతి(48) మృతి చెందగా ఇతనికి భార్య చైత్ర(45), వినీత్ (15), వినీత(13) ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాలను మరణోత్తర పరీక్షల నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకున్న మృతుల కుటుంబ సభ్యులు బోరున విలపించడాన్ని చూపరులను కుటతడి పెట్టించాయి. బావిలోకి దూసుకెళ్లి నీటిలోనే తిరగబడిన కారులోంచి శాంద్రహళ్లి చిక్బల్లాపూర్కు చెందిన తిప్పారెడ్డి(43), సునీల్(23) సాహసించి కారు వెనుక అద్దాలు పగలగొట్టి బయటపడి మృత్యుంజయులుగా మిగిలారు. వీరు బయటపడడంతో ఈ ప్రమాదం వెలుగుచూసింది లేదంటే బావిలో నీరు అయిపోతే గాని కారు పడిన సంఘటన తెలిసేదికాదు. కారులోంచి బయటపడ్డ ఇద్దరు వ్యక్తుల ద్వారా విషయం తెలుసుకున్న స్థానిక గ్రామస్థులు సహాయక చర్యలు చేపట్టారు. రైతులు స్వచ్ఛందంగా మోటార్లు అమర్చి నీటిని తోడారు. సమాచారం అందుకున్న పీలేరు పోలీసులు, అ గ్రామ ప్రజలు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నాడు. మోటార్ల ద్వారా నీటిని తోడేయడంతో పోలీసులు క్రేన్ సాయంతో కారును బయటకు తీసి అందులో ఉన్న మృతదేహాలను వెలికితీశారు. సమాచారం అందుకున్న పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలకు నివాళి అర్పించి ఆర్థికంగా తక్షణ సాయం అందించారు.

19-5Pg3exHMNWJQE.qxd:19-5Pg3exHMNWJQE.qxd 01/01/01 7:51 AM Page 1



# ఇఓఎస్ 09 వైఫల్యంతో అంతా నిరాశ

## శాస్త్రవేత్తలు డీలా..షార్ కేంద్రం వెలవెల

**శ్రీహరికోట (తడ), మే 18 ప్రభాతవార్త:** చంద్రయాన్-3తో చరిత్ర సృష్టించిన ఇస్రో అంతకు ముందు ఒకే రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలు విజయవంతంగా ప్రయోగించి ఉంది. మంగళయాన్, ఆదిత్య ఎల్1 వంటి ఉపగ్రహాలను అలవోకగా అంతరిక్ష కక్ష్యలోకి చేర్చి పరిశోధనలు ప్రారంభించింది. ప్రపంచం మొత్తం తనవైపు చూసేలా ఇస్రోపలుమార్లు శభాష్ అనిపించుకుంది. అయితే శాస్త్రవేత్తలు ఆదివారం ఒక్క వైఫల్యంతో డీలా పడ్డారు. అత్యంత కీలకమైన దేశ రక్షణకు పెద్దన్న పాత్ర పోషిస్తుందని అందరూ ఆశతో ఎదురుచూసిన ఇఓఎస్ 09 ఉపగ్రహం నిర్ణీత కక్ష్యకు చేరుకోలేక పోయింది.

**ఇఓఎస్ 09ను ముందుకు తెచ్చారు:** గతంలో నాసా, ఇస్రో సంయుక్తంగా రూపొందించిన అతి విలువైన ఉపగ్రహం నిసార్‌ను ఈ నెలలో ప్రయోగించాల్సి ఉంది. జిఎస్ఎల్వి-ఎఫ్16 రాకెట్‌ను ఇందుకు సిద్ధంచేశారు. అయితే ఇటీవల పాకిస్తాన్ సరిహద్దుల్లో పెహల్గాం దాడులు, తద్వారా ముదిరిన సరిహద్దు వివాదం నేపథ్యంలో దేశానికి అత్యవసరంగా ఇఓఎస్ 09 వంటి అత్యాధునికమైన, శక్తివంతమైన భూపరిశీలన ఉపగ్రహం అవసరమైంది. అందుకే దీన్ని ముందుకు జరిపి చకచకా ఏర్పాట్లు పూర్తి చేసి ఆదివారం ప్రయోగించారు. ఇస్రో ఇఓఎస్ 09కు ముందే భూపరిశీలన ఉపగ్రహాలను రూపొందించి ఉంది. ఆ సిరీస్‌లో ప్రస్తుతం ప్రయోగించిన ఉపగ్రహం 9వది. ఇది మిగిలిన వాటికన్నా ఎక్కువ శక్తివంతమైనది. ఇందులోని సింథటిక్ అపర్చర్ రాడార్ (సార్)తో పగలురాత్రి, వర్షం తుపానులు వంటి అన్ని వేళల్లో పని చేసేలా రూపొందించారు. దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పిస్తున్న మన వీర సైనికులకు శత్రుదేశం కదలికలు ఎప్పటికప్పుడు తెలుసుకునే దివ్యాస్త్రంగా దీన్ని తయారు చేశారు. పైగా వ్యవసాయ అభివృద్ధి, అటవీ సంరక్షణ, ప్రకృతి వైపరిత్యాలు పసిగట్టడం, పట్టణాభివృద్ధి వంటి సేవలను కూడా ఆశించారు. ఇటువంటి కీలక పరిణామాల తర్వాత పలుమార్లు పొరుగు దేశంపై విజయాలు సాధించి సత్తా చాటిన భారత్ ఈ ఉపగ్రహ ప్రయోగంతోను సక్సెస్‌ను అందుకుని ఉంటే మరింత బలీయమైన శక్తిగా అవతరించేదని విశ్లేషకులు అంటున్నారు.

**నాయకత్వం మార్పు తర్వాత:** ఇస్రో ఛైర్మన్‌గా సోమనాథ్ నుంచి ఈ జనవరిలో వి.నారాయణన్ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత జరిగిన రెండవ రాకెట్ ప్రయోగమే విఫలం చెందింది. ఇది ఇస్రోకు 101వ రాకెట్ ప్రయోగం ఈ ఏడాది జనవరి 29న 100వ రాకెట్ జిఎస్ఎల్వి-ఎఫ్15ను శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించారు. నావిక్ ఉపగ్రహం ఎన్ఓఎస్02ని నిర్ణీత కక్ష్యలో ఆ రాకెట్ చేర్చగలిగింది. అయితే తర్వాత ఉపగ్రహం సాంకేతిక లోపానికి గురయింది. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇస్రో అధికారికంగా వెల్లడించలేదు. పిఎస్ఎల్వి-సి61 రాకెట్ మూడో దశలోనే దారి మళ్లడం కూడా ఇస్రో ఛైర్మన్ నారాయణన్, శాస్త్రవేత్తలను బాధిస్తోంది. వి.నారాయణన్‌కు ఛైర్మన్ హోదా రాకముందే ఎంతో అనుభవం ఉంది. దేశంలోని వివిధ ఇస్రో ప్రాజెక్టుల్లో పని చేసి ఎన్నో మెళకువలు తెలుసుకుని ఉన్నారు. ఆదివారం ప్రయోగ వైఫల్యం తర్వాత ఛైర్మన్ నారాయణన్ మొహం చిన్నబోయింది. అయితే ఇటువంటిపరిస్థితుల్లో రెండుసార్లు ఆయన మాట్లాడారు. ఒకసారి మీడియా ముందుకు వచ్చారు. మన శాస్త్రవేత్తలు ఇఓఎస్ 09 కన్నా ఎక్కువ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మరో ఉపగ్రహాన్ని అతిత్వరలోనేరూపొందించి ఈసారి గురితప్పకుండా సక్సెస్ సాధించాలని దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

## నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

**కుప్పం, మే 18 ప్రభాతవార్త:** ఆటలాడుకునేందుకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవరాజపురం లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన సుమతి,రాజా దంపతుల కుమార్తె షాలిని (6), వరలక్ష్మి,తిరుపతిల కుమార్తె గౌతమి (7) , యశోద, శరవణన్‌ల కుమారుడు అశ్విన్ (6)లు ఆదివారం తమ ఇళ్ల సమీపంలో ఉన్న చర్చి వద్దకు ఆడుకునేందుకు వచ్చారు. అక్కడే ఆటలాడుకుంటూ చర్చి సమీపంలో ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. స్థానికులు గమనించి హుటాహుటిన నీటి గుంతలో పడిన చిన్నారులను పైకి తేగా అప్పటికే వారు మృతి చెంది ఉన్నారు. కాగా ఈ విషాద సంఘటనపై ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా సిఎం ఆదేశాలతో ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల వంతున అందించాలని జిల్లా కలెక్టర్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌లకు ఆదేశించారు.

## విద్యార్థిపై దాడిని ఖండించిన జగన్

**విజయవాడ,మే 18,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై జరిగిన దాడిని వైకాంగ్రెస్‌అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, దళితులు, బలహీన వర్గాలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని మండిపడ్డారు. ఈమేరకు సోషల్‌మీడియాలో స్పందించారు.

## అగ్నిప్రమాద ఘటన దిగ్భ్రాంతికరం: డి.సిఎం పవన్

**విజయవాడ.మే 18,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ పాత బస్తీలోని గుల్జార్ హౌస్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఘోర అగ్ని ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ దుర్ఘటనలో 16 మంది దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదన చెందాను. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. క్షతగాత్రులకి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## నీరజ్‌చోప్రా విజయం దేశానికి గర్వకారణం: సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** దోహా డైమండ్ లీగ్-2025లో భారత జావెలిన్ త్రో క్రీడాకారుడు నీరజ్ చోప్రా బల్లెన్ని 90.23 మీటర్ల దూరం విసిరి మరోసారి చరిత్ర సృష్టించాడని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఆయన సాధించిన విజయం దేశానికి గర్వకారణమని ఎక్స్ వేదికగా అభినందించారు. ఈ ఘట్టం దేశంలో పెరుగుతున్న క్రీడా ఆకాంక్షకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. నీరజ్ చోప్రా తన ఉత్తమ ప్రదర్శనతో నవభారత స్ఫూర్తిని ప్రతిబింబించారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ధైర్యంగా సంకల్పంతో ప్రపంచాన్ని అధిగమించేం దుకు సిద్ధం అని ఈ ఘనత దేశానికి గర్వకారణమని ఎక్స్ వేదికగా అభినందించారు.

## అమరావతిలో ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రఖ్యాత నేత్ర వైద్య,పరిశోధనాలయం ఎల్.వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఏపీలో పూర్తిస్థాయిలో సేవలు అందించనున్నది. రాజధాని అమరావతిలో త్వరలో ఎల్.విప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం జరగనుంది. రాయపూడి నుంచి దొండ పాడు వెళ్లే మార్గంలో సీడ్ యాక్సెస్ రహదారికి పక్కన ఈ సంస్థకు కూటమి ప్రభుత్వం 12 ఎకరాల భూమి కేటాయించింది. కొన్ని రోజుల్లో భూమిపూజ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.


## విద్యుత్ అంతరాయాలపై స్పందించాలి: సిఎస్

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** గాలివానలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన వెంటనే యుద్దప్రాతిపదికన పునరుద్దరించేందుకు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. ముందస్తు సన్నద్ధతపై డిస్కంలు సీఎండీలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ హెచ్చరికలతో

## శ్రీశైలం రక్షణ పనులకు రూ.25.65కోట్లతో టెండర్లు

### కుడి, ఎడమ కొండ గట్టులకు 'షాట్ క్రీటింగ్'



**రాజంపేట అర్బన్, మే 18, ప్రభాతవార్త:** జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డిఎస్ఎ) హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శ్రీశైలం ప్రాజెక్టు రక్షణ పనులపై దృష్టి సారించింది. శ్రీశైలం ప్రాజెక్టు సమగ్రతకే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించిన తర్వాత జలవనరుల శాఖ స్పందించి వెంటనే రక్షణ పనులు ఈ సీజన్లోనే చేపట్టేందుకు 25.65కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. దీంతో శనివారం రక్షణ పనులు చేపట్టేందుకు టెండర్ ఉత్వర్వులు జారీ అయ్యాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్దఎత్తున వరద ఉధృతి ఏటా పెరుగుతుండటంతో డ్యామ్ రక్షణకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి అనివార్యమని ఇప్పటికే నిపుణులు హెచ్చరించారు. ఈ హెచ్చరికల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం డ్యాన్స్ సేఫ్టీ అథారిటికి ఓ లేఖ రాసింది. శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించి సలహాలు, నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ మేరకు ఎన్‌డిఎస్ఏ ఛైర్మెన్ అనిల్ జైన్ గత నెల 29న శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించారు. కేంద్ర జల సంఘం(సిడబ్ల్యూసి) సహాయాన్ని కూడ తీసుకొని డ్యామ్ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను ఎన్డిఎస్ఏ సిఫార్సు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దిగువ కుడిగట్టు పటిష్టపరిచేందుకు నిర్ణయం తీసుకుంది. అలాగే 780అడుగుల నుంచి 550అడుగుల వరకు కూడ అప్రోచ్ రోడ్డు నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు 20.93కోట్లతో టెండర్లను పిలిచారు. అలాగే కుడి, ఎడమ కొండగట్టులకు 905 అడుగుల పైన గల భాగంలో షాట్ క్రీటింగ్ చేపట్టాలని కూడ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు 4.72కోట్లు కేటాయించారు. ఈ మేరకు ఈ రెండు పనులకు టెండర్లను ఆహ్వానిస్తూ శ్రీశైలం ప్రాజెక్టు ఎస్.ఈ టెండర్ ఉత్తర్వులు జారీ చేశారు. టెండర్లు దాఖలు చేసేందుకు జూన్ 2 చివరి గడువుగా పేర్కొన్నారు.

## వర్గ విభేదాలు వీడి 'మహానాడు' విజయవంతం చేయండి

### టిడిపి నాయకులతో ఇన్‌చార్జి మంత్రి సవిత



**పులివెందుల,మే18,ప్రభాతవార్త:** ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పులివెందుల నియోజక వర్గంలోని టిడిపి నాయకు లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి సవిత కోరారు. ఆదివారం కడపలో జరిగే మహానాడు పనులు ఏ విధంగా జరుగు తున్నాయో పరిశీలిం చడానికి వెళుతూ పట్టణంలోని టీడీపి కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మండలాల టిడిపి ఇన్చార్జిలు, నాయకులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీ లో వర్గ భేదాలు పెట్టుకోకుండా కలిసికట్టుగా సభకు భారీగా తరలి వచ్చేందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో తుం గభద్ర హెచ్ ఎల్ సి కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి, హాజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, టిడిపి నాయకులు రఘునాథరెడ్డి, మద్దూరి వెంకట్రా మిరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, శివ మోహన్ రెడ్డి, నల్లారి భాస్కర్ రెడ్డి, ఆక్కుల విజయ్ కుమార్ రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

**మంత్రినికలిసిన బిజెపి నాయకులు:** పులివెందుల పర్యటనకు వచ్చిన ఇన్చర్జి మంత్రి సవితాను బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహణ సభ్యుడు భాను ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిసి పులివెందుల నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు.

## గడువులోగా గృహనిర్మాణాలను పూర్తి చేయాలి: మంత్రి పార్ధసారధి



గృహనిర్మాణాలపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొలుసు పార్థసారధి

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న గృహాలను వెంటనే పూర్తి చేయాలని,కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్దేశించిన 3 లక్షల గ్రుహాలనిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒకేసారి 3 లక్షల మందికి గృహనిర్మాణాలు పూర్తి చేసి లబ్దిదారులకు ఇంటి తాళాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం అన్నారు. ఆయన ఆదేశాలను వేగవంతగా అమలు చేద్దామన్నారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్నా గృహనిర్మాణాల పనితీరు పై విజయవాడలోని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంత్రి నిర్వహించారు, జిల్లా అధికారులు అందరూ నిత్యం లే ఔట్లలో ఉండి లబ్దిదారులతో నిర్మాణాలను పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలని, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కింది స్థాయి సిబ్బందితో నిరంతరం పర్యవేక్షించాలని, ఇళ్ళ నిర్మాణాలలో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక లబ్దిదర్లకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, లేఔట్లలో రహదారులు, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పించటానికి చర్యలు చేపట్టాలని మంత్రి పార్ధసారధి అధికారులకు దిశా నిర్దేశం చేసేరు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల గృహనిర్మాణ శాఖ అధికారులుతో మాట్లాడి ఇల్లనిర్మాణాల పురోగతిని తెలుసుకొని, సత్వరం నిర్మాణాలు పూర్తి చేయటానికి అవసరమైన చర్యలను మంత్రి సూచించేరు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో గృహనిర్మాణాల అమలు జరుగుతున్న తీరును మంత్రికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి రోజు జిల్లా అధికారులుతో సమీక్షలు నిర్వహిస్తూ నిర్మాణాలలో వేగం పెంచుతున్నామని ఆయన మంత్రికి వివరించేరు. ఈ సమావేశంలో గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్ వేణుగోపాల్, సుపరెండేంట్ ఇంజినీర్ జయరామాచారి, చీఫ్ జనరల్ మేనేజర్ అన్నపూర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

### డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆరోగ్యమంతమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రత పచ్చదనం ఎంతో అవసరమని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు, పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం పరిశుభ్రత పచ్చదనం థీమ్‌తో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా డీజీపీ మొక్కలు నాటి మాట్లాడారు. కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని అన్ని పోలీస్ స్టేషన్లలో నిర్వహిస్తున్నామని, మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ఐజీలు హరికృష్ణ, రవిప్రకాష్, రాజకుమారి డీఐజీలు అమ్మిరెడ్డి సెంథిల్‌కుమార్ ఫకీరప్ప, ఎస్పీలు శ్రీకాంత్ ఉమామహేశ్వర్ కమాండెంట్ నగేష్‌బాబు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** సరోజిని దామోదర్ ఫౌండేషన్ విద్యాధన్ ఉపకార వేతనాలకు జూన్ 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థికంగా వెనుకబడి పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు కళాశాలవిద్య అభ్యసించేందుకు సహాయం చేస్తోంది.

## 125 ఆటిజం కేంద్రాల ఏర్పాటు

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం 125 ఆటిజం కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సమగ్ర శిక్షా అభియాన్ చర్యలు చేపట్టింది. మున్సిపాలిటీకి ఒకటి చొప్పున ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు భవనాలు నిర్మించనున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా మిన హా మిగతా 25 జిల్లాల్లోనూ వీటిని అందు బాటులోకి తీసుకురానున్నారు.

ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.27.75 లక్షల చొప్పున ఎస్పీడీ శ్రీనివాసరావు నిధులు విడుదల చేశారు. ఈ కేంద్రాల్లో ఆటిజం విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు శిక్షణ అందిస్తారు. పిల్లలకు వచ్చే ఆరోగ్య సమస్యలు తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహిస్తారు.

## తిరుమల సమాచారం



## గరుడ వారధి నిర్వహణ 'గాలి'కొదిలేశారా!?

### రెండేళ్లనే కుంగిన వారధి

**తిరుపతి,మే 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి విమానాశ్రయంనుండి తిరుమలకు వచ్చే యాత్రికుల సులభ ప్రయాణం కోసం ఇతర ప్రాంతాల నుండి తిరుపతికి చేరుకునే ప్రయాణీకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలో రెండేళ్ళ క్రిందట అందుబాటులోకి వచ్చిన గరుఢవారధి నిర్వహణ "గాలి"కొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వారధిపై డివైడర్లు కళావిహీనంగా మారడం, వారధి రోడ్డు పాక్షికంగా దెబ్బతినడం నిర్వహణాలోపం, పర్యవేక్షణా రాహిత్యమేనని తిరుపతి ప్రజా సంఘాలు, భక్తులు ఆరోపి స్తున్నారు. గరుఢ వారదిపై లీలామహల్‌కూడలి దాటిన తరువాత ఎలివేటెడ్ కారిడార్ సమీపంలో రోడ్డు బాగా దెబ్బతింది. దీన్ని వారంరోజులుగా మరమ్మతులు చేయడానికి శ్రమిస్తున్నారు. అయినా కుంగినరోడ్డును బాగుచేయడం ఆప్కాన్స్ సంస్థ నిర్వాహకులు కూడా తలపట్టుకుంటున్నారు. తిరుపతినగరంలో ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు వీలుగా 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్దంచేసి గరుఢవారధి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సుమారు 694కోట్ల రూపాయలు నిదులతో టిటిడి, రాష్ట్రప్రభుత్వం స్మార్ట్‌సిటీ నుండి నిధులు విడుదల చేయడం జరిగింది. వారధి నిర్మాణంలో 90కోట్ల రూపాయలు స్మార్ట్‌స్ట్రీట్స్, కాలువల నిర్మాణం కోసం కేటాయించారు. పద్మావతిపురం నుండి కపిలతీర్థంరోడ్డులో శ్రీవారిసన్నిధివరకు, ఇటు కరకంబాడి మార్గంలో లెప్రసీ ఆస్పత్రి నుండి కపిలతీర్థం వరకు వారధి నిర్మాణం జరిగింది. ఈ వారదినిర్వహణ ఐదేళ్ళ వరకు 25కోట్ల రూపాయలతో ఆప్కాన్స్ సంస్థకు అప్పగించారు. ఇప్పుడు వర్షాలు పడితే తిరుపతి నగరంలోని గరుడవారధి క్రిందప్రాంతాలు పూర్తిగా జలమయంగా మారుతున్నాయి. చెరువులను తలపిస్తున్నాయి. వారధిపై వాతావరణ మార్పులకనుగుణంగా వర్షాలు పడినప్పుడు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరగకుండా మార్పులుచేసి మరమ్మతులు చేయాలి. అయితే ఇవేమీ పట్టించుకోకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వారధిపై రోడ్డుదెబ్బతింది. కుంగిపోయేలా ఇనుపరాడ్‌లు పైకొచ్చేశాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు చేయాలంటే భయపడుతున్నారు. ముఖ్యంగా తిరుమలకువెళ్ళే, చిత్తూరువైపు వెళ్ళే ఆర్టీసి బస్సులు గరుఢవారధిపైనే రాకపోకలు సాగిస్తు న్నాయి. మరీ ఈ వారధి నిర్వహణ గాలికోది లేశారని బిజెపి నాయకుడు నవీన్‌కుమా ర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాక స్మార్ట్‌సిటీ, వారధి కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారం ఐఎస్ఒ ప్రమాణాలకనుగుణంగా ప్రమాదాలు జరగకుండా నిర్వహణ చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు.



## భక్తులకు ఐఫోన్ అప్పగింత

**తిరుమల,మే 18ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనం కోసం వచ్చిన ఓ భక్తుల కుటుంబం యాత్రికుల వసతిసముదాయం అన్నప్రసాదం హాల్‌లో వదలివెళ్ళిన లక్షరూపాయలు విలువైన ఐఫోన్‌ను సిబ్బంది తిరిగి భక్తులకు అప్పగించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన డి.ధనవర్ష కుటుంబంతో శనివారం రాత్రి తిరుమలకు వచ్చారు. యాత్రికుల విశ్రాంతిసముదాయం -4లో లాకర్‌నుపొందారు. రాత్రి అన్నప్రసాదహాల్‌లో భోజనం చేసి లక్ష రూపాయలు విలువైన ఐఫోన్‌ను వదలివెళ్ళారు. ఆ తరువాత శుభ్రపరిచేసమయంలో ఫోన్‌ను గుర్తించిన సిబ్బంది ఉద్యోగి షణ్ముఖ పృధ్వీరాజ్‌కు శ్రీవారిసేవకులు అప్పగించారు. ఆ ఫోన్‌ను ప్రసారమాధ్యమాల ద్వారా తెలియజేసి సంబంధిత భక్తులకు అందజేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. సిబ్బంది నిజాయితీని అభినందించారు.



## భారతదేశం శక్తివంతమైన దేశమే

### ప్రధాని మోడీ నాయకత్వంలో పురోభివృద్ధి: కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

**తిరుమల,మే 18ప్రభాతవార్తప్రతినిధి:** దేశానికి సమర్ధవంతమైన నాయకుడు ప్రధానిగా నరేంద్రమోదీ పాలనలో దేశం శక్తివంతంగా ఎదిగిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. మోదీ నాయకత్వంలో అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధించిందన్నారు. పాకిస్తాన్‌పై యుద్దంలో భారత్ సైన్యం ధీటుగా ఎదుర్కొని సమాధానం చెప్పడం మోదీ పాలనకారణ మన్నారు. సైన్యానికి పూర్తిస్వేచ్ఛ, ఆర్థిక వనరులు సమకూర్చడం వంటివి ఆత్మస్థైర్యం కలిగించిందన్నారు. ప్రపంచంలోనే భారత్ అగ్రగామిగా అడుగులువేస్తోందన్నారు. ఇందుకు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి కుటుంబంతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు . ఆయనతోబాటు టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ శ్రీవారి దర్శనం చేయించారు. ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రూ.500కోట్లతో పది అంతస్తులతో అధునాతన ఆర్టీసి బస్టాండ్ టెర్మినల్

### తిరుపతిలో పాతబస్టాండు స్థానంలోనే ఇంటిగ్రేటెడ్ భవనం



**తిరుపతి,మే 18ప్రభాతవార్తప్రతినిధి:** కొన్ని దశాబ్దాల క్రిందట అప్పటి తిరుమల యాత్రికుల అవసరాలకు అనుగుణంగా తిరుపతినగరంలో నిర్మితమైన సెంట్రల్ ఆర్టీసి బస్టాండు ఇప్పటి భక్తుల రద్దీకి ,విపరీతంగా పెరిగిన ప్రయాణీల సేవలకు తగ్గట్లు లేకపోవడంతో అధునాతన నూతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు టర్మినల్ నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పదిసంవత్సరాల క్రిందట ప్రతిపాదనలు ఇప్పుడు అమలులోకి వస్తుండటంతో సుమారు 500 కోట్ల రూపాయలు వ్యయంతో గ్రౌండ్‌ఫ్లోర్‌తోబాటు 10 అంతస్థులతో తిరుమల ఆలయ నమూనా తరహాలో ఈ ఆర్టీసి బస్టాండు ఇంటిగ్రేటెడ్ టర్మినల్ నిర్మాణం చేయాలని ఆమోదించారు. తిరుపతి స్మార్ట్‌సిటీ, అంతర్జాతీయఖ్యాత ఉట్టిపడేలా అధునాతనంగా బస్‌స్టేషన్ నిర్మాణం పనులు మొదలుకానున్నాయి. ప్రస్తుతం 60వేలమంది ప్రయాణీకులతో ,50వేలమంది వరకు యాత్రికులతో నిత్యం రద్దీగా ఉండే తిరుపతి సెంట్రల్ బస్టాండు (ఏడుకొండలు బస్టాండ్, శ్రీహరిబస్టాండు, శ్రీనివాసాబస్టాండ్) నుండి తెలంగాణా, తమిళనాడు, కర్నాటక, పాండిచ్చేరి రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆర్టీసిబస్సులతో బాటు తమిళనాడు, కర్నాటక ,పాండిచ్చేరి రాష్ట్రాల ఆర్టీసి బస్సులు తిరుపతికి వస్తున్నాయి. ఇక్కడకు వస్తున్న ప్రయాణీకుల సౌకర్యంతోబాటు అన్ని రకాల వాణిజ్యసముదాయాలకు నిలయంగా ఇంటిగ్రేటెడ్ బస్‌స్టేషన్ అభివృద్ధి చేసేందుకు డిపిఆర్ సిద్దమైంది. బస్‌టర్మినల్ నుండి కూతవేటు దూరంలో ఉన్న రైల్వేస్టేషన్‌కు స్కైవే ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటూకానుంది. 13ఎకరాల్లో ఉన్న తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రస్తుతం 70వరకు ప్లాట్‌ఫామ్‌లతో గ్రామీణ ప్రాంతా లకు వెళ్లే బస్సుసర్వీసులతో నిండిపోతోంది. ఈ బస్‌స్టేషన్ నుండి తిరుమలకు నేరుగా రోడ్డుసౌకర్యం ఉంది. తిరుపతి విమానాశ్రయంకు కూడా నూతన ఫ్లైఓవర్ నిర్మాణం జరగనుంది. ఈ నిర్మాణ పనులను నేషనల్ హైవేస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా చేపట్టనుంది. నూతన టర్మినల్‌లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో అన్ని ప్రాంతాలకు వెళ్ళే బస్సుప్లాట్‌ఫామ్‌లు, మొదటి అంతస్థుల నుండి ప్రయాణీకులకు సదుపాయాలు, వాణిజ్యసముదాయాలు, హోటళ్ళు, ఆర్టీసి కార్యాలయాలు, డార్మిటరీలు, డ్రైవర్ల విశ్రాంతి గదులు, ప్రవేశ,నిష్క్రమణ ద్వారాలు ఉంటాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 3లక్షలమంది వరకు ప్రయాణీలకు సరిపోయేలా ,మరో నాలుగు దశాబ్ధాల వరకు ఇబ్బంది లేకుండా ఈ అధునాతన ఇంటిగ్రేటెడ్ బస్టాండు నిర్మాణం జరగనుంది. ప్రస్తుతం ఇతరరాష్ట్రాల నుండి బస్టాండుకు వస్తున్న ఆర్టీసి బస్సులతోబాటు తిరుపతి, చిత్తూరు, నెల్లూరుజిల్లాల నుండి వచ్చే గ్రామీణ ప్రాం తాల ఆర్టీసి బస్సులను తాత్కాలిక బస్టాండులు మంగళం, బైరాగిపట్టెడ, తిరుచానూరుసమీపం, మూవడమైలు ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని నిర్ణయిస్తున్నారు. ఈ స్థలాలను ఇప్పటికే ఆర్టీసి ఉన్నతాధికారులు పరిశీలించారు.

వార్త

మనం తలపెట్టిన కార్యం మంచిదని నమ్మకం మనకున్నప్పుడు, అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించుకోరాదు.

-ఫిలిప్‌మాసింగర్

# మాటలతో ధరలు తగ్గవు!


పెరుగుతున్న ధరలపై ఉక్కుపాదం మోపుతాం, నల్లబజారు వ్యాపారులపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామంటూ ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్న పాలకుల తీరును చూసి సామాన్యులు సైత్యం ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పుడే కాదు అధికారంలో అటు కేంద్రంలో కానీ, ఇటు రాష్ట్రాల్లో కానీ ఏ పార్టీ ఉన్నా ధరలు పెరగడం, వాటిని నియంత్రిస్తామని చెప్పడం, అక్రమ నిల్వలు చేసేవారిపై చర్యలు తీసుకొని జైళ్లకు పంపుతామని బెదిరించడం ఒక రివాజుగా మారిపోయింది. ఈ విషయంలో ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్ మార్కెటర్లను జైళ్లకు పంపారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా అక్రమార్కులు గడగడలాడిన సందర్భాలున్నాయి. రానురాను పరిస్థితులు మారిపోతున్నాయి. గతంలో ఉన్న భయభక్తులు నేడు కన్పించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరుపెద్దలు అక్రమ వ్యాపారులతో మమేకం కావడమే. రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారుతున్నది. ఎన్నికలు కూడా అలానే రూపాంతరం చెందుతున్నాయి. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంత ఉందని చెప్పకతప్పదు. కొందరు బడా వ్యాపారులతో రాజకీయ నాయకులకు అవినాభావ సందర్భాలు ఏర్పడుతున్నాయి. మొత్తం ఈ భారమంతా ప్రజలు భరించక తప్పడం లేదు. దీంతో ఎన్ని కేకలు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు చేసినా ఇవన్నీ తమను ఏమీ చేయలేవనే ధీమా అక్రమ వ్యాపారుల్లో పెరిగిపోయింది. ధరలు పెరగడానికి కారణాల్లో ఇదొకటి. ద్రవ్యోల్బణంతోపాటు మార్కెట్ మాయాజాలం, జిఎస్టీ విధానం అన్ని కలిపి సామాన్యులు అందుకోలేనంతపైకి ధరలు పెరిగిపోతున్నాయి. మరొకపక్క సరుకులు రహస్యంగా నిల్వ చేసి కృత్రిమకొరత సృష్టించి ఇష్టానుసారంగా పెంచడం పరిపాటిగా వస్తున్నది. రైతుల వద్ద ఉత్పత్తులు ఉన్నప్పుడు ధరలు పెరగడం అటుంచి తగ్గించే ప్రయత్నం చేస్తారు. రైతులు అందరూ తమ సరుకులనుఅమ్ముకున్న తర్వాత ధరలను పెంచే కార్యక్రమం ఆరంభమవుతుంది. కొరత ఎంతగా సృష్టించగలిగితే అంతగా ధరలు పెంచుకోగలుగుతున్నారు. బియ్యం, నూనెలతోపాటు, ఉప్పు, పప్పు ఒకటేమిటి ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర వస్తువులన్నీ పెరిగిపోతున్నాయి. ఈరోజు ఉన్న ధర రేపు ఉండడం లేదు. కూరగాయల పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. దేశవ్యాప్తంగా చూసినా కూరగాయల సాగు తగ్గిపోతున్నదేమోననిపిస్తున్నది. కూరగాయాలను ఉద్యానం పంటల జాబితాలో చేర్చారు. అనేక రాష్ట్రాల్లో ఉద్యానశాఖకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదు. వ్యవసాయశాఖకు తొంభై శాతం నిధులిస్తూ కూరగాయలను విస్మరిస్తున్నారు. ఈ పంటలు సాగు చేసే రైతులకు కనీసం విత్తనాల ధరల్లో రాయితీ కోసం ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయడంలో కూడా శ్రద్ధ తీసుకోవడం లేదు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవివై) పథకం కింద కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. ఇవి రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలంటే నలభై శాతం వాటా నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ఆ నిధులు ఇవ్వలేక తెలుగు రాష్ట్రాల్లో ఆ పథకం కింద విత్తనాలకు రాయితీ ఇవ్వడానికి మంగళం పాడారు. ఇక దేశంలోని అనేక ప్రధాన నగరాలకు, పట్టణాలకు చివరకు మండల కేంద్రాలకు కూడా చుట్టూ కిలో మీటర్లలో ఉన్న భూములు స్థిరాస్థి ప్లాట్లుగా మారి బీడ్లు పడ్డాయి. దీంతో కూరగాయలు పండించేందుకు దూరంగా ఉన్న భూముల్లోకి పోవాల్సి వస్తున్నది. డీజిల్, పెట్రోలు, హమాలీ, మార్కెట్ రుసుములు, కమిషన్‌లు చేరి కూరగాయల ధరలను మండిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వినియోగానికి, ఉత్పత్తికి వ్యత్యాసం పెరిగిపోతున్నది. అందుకే కూరగాయల ధరలను అదుపు చేసేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. వీటిని నియంత్రించేందుకు గతంలో ఏర్పాటు చేసిన రైతుబజార్లు కూడా దళారుల ఆధీనంలోకి పోయాయి. మొత్తంమీద అటు కూరగాయాలు, ఇటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇందువల్ల ఉన్నడబ్బును ఎలా ఖర్చు పెట్టుకోవాలో తెలియని నల్లధనస్వాములకు ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వీటన్నింటికితోడు మార్కెట్ మాయాజాలంతో ధరలు అదుపు తప్పుతున్నాయి. వ్యాపారులు లాభాల కోసమే ఈ వ్యాపారం చేస్తున్నారనేది వాస్తవం. అలాగే కమిషన్ల కోసమే దళారుల వ్యవస్థ ఉన్నదనేది కూడా నిజం. అలా వారు వ్యవహారించడాన్ని తప్పుపట్టలేం. కానీ నెలనెలా వేలాదిరూపాయలు జీతభత్యాల రూపేణ ప్రజాధనాన్ని తీసుకుంటున్న అధికారగణం ఏం చేస్తున్నది? ధరలు అదుపు తప్పుతున్నప్పుడు ప్రభుత్వ జోక్యం చేసుకొని ఇతరప్రాంతాల నుంచి సరుకులు తెప్పించి వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చి ధరలు నియం త్రించే ప్రయత్నాలు జరిగేవి. ఇప్పుడు అలాంటివేవీ ఉండడం లేదు. అంతేకాదు గతంలో ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ధరలు ఒక్కసారిగా ఆకా శాన్ని అంటితే రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో దాడులు నిర్వహించారు. కోట్లాది రూపాయల విలువైన అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. అవన్నీ మార్కెట్లోకి రావడంతో ధరలు దిగివచ్చాయి. పాలకులు ఇప్పటికైనా శ్రద్ధతీసుకోవాలి. ఇలానే నిర్లక్ష్యంచేస్తే ఎన్నిసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఉద్యోగులకు జీతభత్యాలు ఏ రీతిలో పెంచినా ఆశించిన ఫలితాలు రావు.

విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్యపరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.



స్వామి వివేకానంద

ఒక మనిషి అభివృద్ధికి, దిగజారడానికి స్వయంకృతమే కారణం అవుతుంది.



అబ్రహాంలింకన్

# ప్రజావాక్కు



## సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి

చైనా దశాబ్దాల క్రితమే భారత్‌లోని తూర్పు భాగాన ఉన్న అరుణాచలప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 38000 చదరపు కిలోమీటర్ల స్థలాన్ని చట్టవ్యతిరేకంగా ఆక్రమించుకుని తన స్థావరాలను ఏర్పరుచుకుంది. ఆ ప్రదేశంలో గడ్డి కూడా మొలవదని మన దేశాన్ని ఏలిన నాయకులు ఆ రోజుల్లోనే నిర్లక్ష్యంగా వదలివేసారు. ఆక్రమించుకన్న ప్రదేశాలకు చైనా తమ దేశానికి చెందిన పేర్లను పెడుతోందని నిన్న మొన్నటివార్త. వెంటనే విదేశాంగ శాఖ రంగం లోకి దిగి పేర్లు పెట్టుకున్నంత మాత్రాన అవి భారత్ భూభాగానికి చెందకుండా పోతాయా అని చప్పిడి మాటలు మాట్లాడుతోంది. చైనా ఆక్రమించిన మొదట్లోనే ఎందుకు ఖండించలేదు? మళ్ళీ మొదటికొస్తే పాక్ ఆక్రమిత కాశ్మీర్ నూ తెలిగ్గాతీసుకుంటూ అది భారత్‌లోనిదే అంటూ కాలయాపన చేసారు. మొండివాడు రాజుకున్న బలవంతుడే నన్నసామెత మనమేపుట్టించుకున్నాము. భారత్‌తోశాంతి చర్చలకోసం ఉవ్వీళ్లూరుతూ అనేక ఎత్తుగడలతో వస్తున్న పాకిస్థాన్ పిటకేను వదలి పెడుతుందా? అనుమానమే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## అక్రమ దందా

రాష్ట్రంలోమినరల్ వాటర్ పేరిటకోట్ల రూపాయల అక్రమ వ్యాపారం మూడు పూవ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. పల్లెలు, పట్టణములు, నగరాలలో గుర్తింపు లేని వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అనుమతులు లేకుండా నీళ్ల వ్యాపారం నడుస్తుంది. అధికారులు కూడా మామూళ్లకి ఆశపడి ఈ వాటర్ ప్లాంట్‌ల వైపు చూడడం లేదు. మినరల్ నీళ్లతాగడం వల్ల కీళ్ల నొప్పులు, అనారోగ్యం బారిన పడుతున్నారు. అనుమతిలేని వాటర్ ప్లాంట్‌లను అధికారులు తక్షణమే సీజ్ చేసి ప్రజల ఆరోగ్యంని కాపాడాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

## ఆడపిల్లలు జాగ్రత్త

నేడు సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందింది. ఫేస్‌బుక్ ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వాడకం అధికమైపోయింది. వీటివల్ల కొత్తస్నేహాలు, పరిచయాలు పెరిగిపోయాయి. మొదట్లో నమ్మకం కలిగించేలా ప్రవర్తిస్తూ తరువాత తమ అసలు రూపాన్ని చూపెడుతున్నారు.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

## విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

దేశంలో ఏరాష్ట్రంలో లేనటువంటి పర్యవేక్షణతెలంగాణ ముఖ్యమంత్రి విద్యాశాఖపై చూపుతున్నారని చెప్పడం లో అతిశయోక్తి లేదు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న మరుక్షణం నుండి విద్యాశాఖ పై సమీక్షలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఉపాధ్యాయ దీర్ఘకాలిక సమస్యల పై నిర్ణయం తీసుకున్నారు. 11062 టీచర్ పోస్టులు భర్తీ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష సం..లో రెండు సార్లు నిర్వహిస్తున్నారు. ప్రతి స్కూల్‌లో మౌలిక వసతుల కోసం ప్రత్యేక నిధులు ఇస్తున్నారు. స్కావెంజర్ల వ్యవస్థ ఏర్పాటుచేశారు. వంట పాత్రలు కొత్తవి మంజూరు చేశారు. విద్యా సంవత్సరంముందే విద్యార్థులకు బుక్స్, యునిఫాం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. 25వేల మంది ఉపాధ్యాయులను కోరుకున్న చోటుకు బదిలీ చేశారు. దాదాపు 20 వేల మందికి ప్రమోషన్స్ ఇచ్చారు. ఇప్పుడు వేసవి సెలవుల్లో పాత కొత్తటీచర్లకి 5రోజుల శిక్షాణకార్యక్రమాలు నిర్వహించనున్నారు.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## పారదర్శకతతో సీటు ఇవ్వాలి

దేశంలో కొన్ని వందల విశ్వవిద్యాలయాలు ఉంటాయి. వాటి పరిధిలో వేల విద్యార్థుల వృత్తి విద్యా కోర్సులు లక్షలు ఖర్చు చేసి, శ్రమతో భవిష్యత్తు కోసం రిస్క్ తీసుకుంటారు. అది ఏ కోర్సు అయినా అభ్యర్థి ర్యాంకు, కేటగిరి ఒకటే. సదరు ప్రవేశ పరీక్షకు అన్ని కోణాల్లో స్పష్టమైన నిబంధాలు ఉంటాయి. కళాశాల ప్రవేశం సమాన ప్రతిభ ఉన్నప్పుడు, ఏ అంశం మీద ప్రాధాన్యత ఉందో తెలియపరుస్తూ అభ్యర్థికిలేక పేరెంట్‌కి అనుమానం నివృత్తి చేయడం అవసరం. అభ్యర్థులు వారికి సీటు రానందుకు కోర్టునీఆశ్రయించడం, తిరిగి యూనివర్సిటీ కోర్టుకి వెళ్ళడం, విద్యార్థికి నష్టపరిహారం ఇవ్వడం చిన్నవిషయం కాదు.

- బొల్లోజు మేఘానధ్, విశాఖపట్నం

## టేకు కర్ర తరలింపులు

వనమహోత్సవాలు ఒకపక్క జరుగుతుంటే మరొకప్రక్క అడవులలోఉన్న టేకుకర్రతో కొందరు దొంగ చాటుగా ఫర్నిచర్ కోసం బడా వ్యాపారాలు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో గంగారం కొత్త గూడా మండలాలలో ఈ వ్యాపారం ఎక్కువగా దొరుకుతుంది. అడవీ శాఖ అధికారులు ఈ ప్రాంతాలలో జరుగుతున్నఈవ్యాపారాన్ని నిలిపివేయాలి. వనసంరక్షణ జర గాలి. రాజకీయ జోక్యం అధికారుల అలసత్వం వీడాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# న్యాయస్థానాల వికేంద్రీకరణ అవసరమే!

**విశాఖపట్టణం అన్ని సదుపాయాలతో అలరారుతున్న అద్భుతనగరం. అక్కడ హైకోర్టు బెంచి నెలకొల్పబడటం కూడా అందరూ అభిలషిందగ్గ విషయమే. యుపిలో అలహాబాదులో హైకోర్టుతో పాటు లక్నోలో మహారాష్ట్రలో ఔరంగాబాదు, నాగపూర్‌లో హైకోర్టు బెంచిలు ఉన్నాయి. ఇలా పనిఒత్తిడితో న్యాయం సామాన్యుడికి అందుబాటులో ఉండటం కోసం చాలా రాష్ట్రాలలో హైకోర్టు బెంచిల డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో న్యాయస్థానాలు ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే వికేంద్రీకరణ అన్ని రంగాలలో జరుగుతున్నదన్న నైతిక బలాన్ని సమన్యాయాన్ని అందుబాటులోకి తెచ్చిన భావన కలుగుతుంది. ప్రధాని మోడీ అన్ని వ్యవస్థలను బలోపేతం చేసినట్లే హైకోర్టు బెంచీల అవశ్యకతను గుర్తించి న్యాయ వ్యవస్థను కూడా బలపర్చాలి. ప్రస్తుతానికి ఎపిలో హైకోర్టు బెంచి కర్నూలులో రావటం ఖాయమని అనిపిస్తున్నది.**



రావులపాటి సీతారాంరావు

కొన్నాళ్ల క్రిందటి వరకూ ఒక సామెత లాంటిది ప్రజల నోళ్లల్లో నానుతుండేది. మహమ్మద్ మౌంటెన్ దగ్గరకు పోకపోతే, మౌంటెనే మహమ్మద్ దగ్గరకు వస్తుందనే అతిశయంతో కూడిన మాట వాడుకలోఉండేది. పోలిక సరిగ్గా ఉంచకపోవచ్చు. కానీ ప్రజాస్వామ్యం ద్వారానే పాలనసాగాలనుకున్న దేశాలలో ప్రజలచేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వాలే ప్రజల వాకిట ఉండి పాలన సాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండక తప్పదు. ప్రభుత్వం అనేది ఒక విధంగా మేరు పర్వతంలాంటిదే. అక్కడికి చేరుకోవటం సామాన్యుడికి సాధ్యపడకపోవచ్చు. అయినాసరే 'గవర్నమెంట్ ఎట్ యువర్ డోర్ స్టెప్' అన్న భావనకు న్యాయం జరుగుతున్నదని ప్రజలు భావించిన నాడు ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ బాధ్యత ప్రజలు ఏర్పరుచుకున్న లక్ష్యం నెరవేరినట్లే అని అనుకోక తప్పదు. ప్రభుత్వానికి ముఖ్యమైన అంగం న్యాయవ్యవస్థ. మిగతా రెండు అంగాలూ పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ తమ విధులను సంతృప్తికరంగా నిర్వహించిననాడు ఆదేశంలో ప్రజలు ఎప్పుడూ ప్రజాస్వామ్యాన్నే కోరుకుంటారు. ఈ మధ్యకాలంలో పాలనా ఫలం చిట్టచివరి పౌరుడికి కూడా చేరాలనే అభిలాష విజ్ఞులూ రాజకీయులూ, అధికారులే కాదు ప్రజలు కూడా మనసా వాచా వాంఛిస్తున్నారు. దానికి అనుగుణంగానే డివిజన్ ఆఫ్‌పవర్స్ చేపట్టేనే పాలన ఫలవంతంగా మారుతుందని ఏకాభిప్రాయంగా అందరి నోటా వినపడుతున్నది. న్యాయవ్యవస్థను కూడా ప్రజలకు చేరువగా తీసుకొనిపోవటం ద్వారా న్యాయపాలన అందుబాటులో తెచ్చినట్లవుతుందని న్యాయం అందరికీ అందే విధంగా ఉంటుందని ప్రభుత్వాలు చాలా కాలం నుంచి ప్రణాళికలు ఈమార్గంలో రచిస్తున్నాయి. మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో హైకోర్టు (రాష్ట్రంలోని ఉన్నత న్యాయస్థానం) బెంచీలు ఒకటి, రెండు ప్రాంతాలలో ఏర్పాటు చేసి న్యాయం సత్వరం అందేలా రాజధానికి రానవసరం లేకుండానే ఉన్నత న్యాయస్థానపు వ్యవస్థను దగ్గరకు తెచ్చి, ప్రజలకు న్యాయం చేస్తున్నది. తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో దాదాపు అన్ని జిల్లాల ప్రజలు మూడు గంటలలోనే (హైదరాబాద్) రాజధానికి వచ్చి ఉన్నత న్యాయస్థానంలో న్యాయ సంబంధిత విషయాలు తేల్చుకోవడానికి వెసులుబాటు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతిలోని హైకోర్టుకు లిటిగేషన్ల సందర్భంగా ఇతర జిల్లాల నుంచి లాయర్లు, ప్రజలు రావడానికి దూరాల వల్ల ఎక్కువ కాలం ప్రయాణాల్లోనే ఉండాల్సి వస్తుంది. ముఖ్యంగా రాయలసీమలో హైకోర్టు బెంచి ఒకటి ఏర్పాటు చేయాలని ఎంతో కాలం నుంచి ఉన్న డిమాండ్‌ను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వేగిరం తీర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలుపుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ కర్నూలులో హైకోర్టు బెంచిని ఏర్పాటు చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది. సంబంధిత కార్యక్రమాలు కూడా వేగిరం జరుగుతాయన్న ఆశ రాయలసీమ ప్రజలకు ఏర్పడింది. కర్నూలులో ఏర్పడబోతున్న హైకోర్టు బెంచి వల్ల న్యాయ పాలన వికేంద్రీకరించబోతున్నది. రాష్ట్ర హైకోర్టు పరిధిలోని




కేసుల్లో దాదాపు 33 శాతం రాయలసీమకు చెందినవే. హైకోర్టు మొత్తం అమరావతి నుంచి కర్నూలుకు తరలించడం కంటే హైకోర్టు బెంచి కర్నూలుతో ఏర్పాటు చేయడం తేలిక అని అందరూ ఒప్పుకుంటున్నారు. ఇంతకు మునుపు హైకోర్టులోని కొన్ని రాయలసీమ కేసులను వర్చువల్ విధానం ద్వారా పరిష్కరించే ఏర్పాటు చేసినప్పటికిని, రాయలసీమ జిల్లాల నుంచి లాయర్లు ఎనిమిది, తొమ్మిది గంటలు ప్రయాణం చేసి హైకోర్టులో మాండేటరీ పిటిషన్లు, రెగ్యులర్ అప్పీళ్లు వేయాల్సిన పరిస్థితి. బెంచి ఏర్పడితే రాయలసీమలోని నాలుగు జిల్లాలనుంచి పిటిషన్‌దారులు కర్నూలు కొచ్చి న్యాయ వ్యవహారాలు చూసుకొనే వెసులుబాటుతో పాటు అమరావతి దాకా దూరప్రయాణం చేసే పరిస్థితి తప్పుతుంది. కొందరు లాయర్లు హైకోర్టు బెంచి రాయలసీమకు చెందిన కర్నూలులో ఉండటం వల్ల మరికొన్ని లాభాలు కూడా చెప్పారు. సర్వీసు లిటిగేషన్లు, లేబర్ చట్టాలు లాంటివి కూడా న్యాయవ్యవస్థ తీర్పులకు లోబడి ఉంటాయి. కాబట్టి వాటికి సంబంధించిన కార్యాలయాలు, మరికొన్ని సంబంధిత ప్రభుత్వ సంస్థలు కూడా కర్నూలు తరలిరాక తప్పదు. వాణిజ్య సముదాయాలు కూడా కర్నూలు పట్టణంలో చోటు చేసుకుంటాయి. హైదరాబాద్‌కు కర్నూలు దగ్గరగా ఉండటం వల్ల రోడ్డు, రైళ్లు, విమాన సర్వీసు కనెక్టివిటీ కూడా బాగా కలిసివస్తుంది. నల్లమల అడవులతోపాటు శ్రీశైలం, మంత్రాలయం లాంటి పేరుగాంచిన దేవాలయాలను మరింత ఎక్కువగా దర్శించే భక్తులు, పర్యాటకులూ ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో టూరిజం ఆర్థిక పరిశ్రమగా నిలదొక్కుకునే అవకాశాలు ఉన్నాయి. విశాఖ పట్టణంలో హైకోర్టు బెంచి కావాలని 1993 నుంచి అక్కడి లాయర్లు, ప్రజలు డిమాండ్ చేయడమే కాదు ఆందోళనలు కూడా చేసిన దాఖలాలు ఉన్నాయి. అయితేఅప్పుడు కోస్టల్ జిల్లాలకు రాజధాని హైదరాబాద్ దూరంగా ఉండటం చేత ఆ డిమాండ్ ఆరోజులలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పుడున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా, కర్నూలుతోబాటు మరో హైకోర్టు బెంచి విశాఖపట్నంలో ఉండటం న్యాయమైన డిమాండ్ అని అనేక కారణాలు డిమాండ్‌కు అనుకూలంగా లేవనెత్తే వారిసంఖ్య పెరుగుతున్నది కూడా. విశాఖలో అనేక విద్యాసంస్థలు ఉన్నాయి. దామోదరం సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీతో పాటు, ఆంధ్రా యూనివర్సిటీ లా కాలేజీ, గీతం లాస్కూల్, లాంటివి అందులో కొన్నిగా చెప్పుకోవచ్చు. అయితే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశం మరొకటి ఉంది. విశాఖబార్ అసోసియేషన్‌లో 5000 మందికిపైగా అడ్వకేట్లు ఉన్నారు. అందులో 1,200 మంది మహిళా లాయర్లు కూడా ఉండటం విశేషం. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను కూడా తప్పకుండా పరిశీలించే విధంగా పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విశాఖపట్టణం అన్ని సదుపాయాలతో అలరారుతున్న అద్భుతనగరం. అక్కడ హైకోర్టు బెంచి నెలకొల్పబడటం కూడా అందరూ అభిలషిందగ్గ విషయమే. యుపిలో అలహాబాదులో హైకోర్టుతోపాటు లక్నోలో మహారాష్ట్రలో ఔరంగాబాదు, నాగపూర్‌లో హైకోర్టు బెంచిలు ఉన్నాయి. ఇలా పనిఒత్తిడితో న్యాయం సామాన్యుడికి అందుబాటులో ఉండటంకోసం చాలా రాష్ట్రాలలో హైకోర్టు బెంచిల డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో న్యాయస్థానాలు ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే వికేంద్రీకరణ అన్ని రంగాలలో జరుగుతున్నదన్న నైతిక బలాన్ని సమన్యాయాన్ని అందుబాటులోకి తెచ్చిన భావన కలుగుతుంది. ప్రధాని మోడీ అన్ని వ్యవస్థలను బలోపేతం చేసినట్లే హైకోర్టు బెంచీల అవశ్యకతను గుర్తించి న్యాయ వ్యవస్థను కూడా బలపర్చాలి. ప్రస్తుతానికి ఎపిలో హైకోర్టు బెంచి కర్నూలులో రావటం ఖాయమని అనిపిస్తున్నది. ●

# రద్దీవేళ.. తొక్కిసలాటలు ఆపలేమా?

ఐ.ప్రసాద రావు

ఉత్తర ప్రదేశ్ ప్రయాగరాజ్‌లో జరిగిన కుంభమేళా సందర్భంగా ఢిల్లీ రైల్వేస్టేషన్లో జరిగిన తొక్కిసలాటలో అనేక మంది అమాయక భక్తులు మరణించడం జరిగింది. తదుపరి తిరుపతిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో, గత వారంలో సింహాచలంలో చందనోత్సవం సందర్భంగా గోడ కూలిన సందర్భంగా కొందరు భక్తులు మరణించడం జరిగింది. అంతే కాకుండా, శనివారం గోవాలో శ్రీ లరాయ్ మాత ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో కొందరు భక్తులు మరణించడం జరిగింది. ఇలా వరుసగా వివిధ దేవాలయాలకు వెళ్లిన భక్తులు అకాలంగా మరణించడం చాలా బాధాకరం. దీనికి కారణం కొంతమేరకు భక్తుల తొందరపాటు కారణం అయితే, ఎక్కువగా ప్రభుత్వాలు, దేవస్థాన కమిటీలు తీసుకుంటున్న చర్యల్లో సమతౌల్యం లోపించడం అని తేటతెల్లం అవుతుంది. ముఖ్యంగా రైల్లో సీట్లకు మించి టికెట్ల తీసుకుని (టిక్కెట్లు ఎలా ఇస్తున్నారో) వివిధ రైల్లో ప్రయాణాలు ప్రజలు ఎలా ప్రయాణం చేస్తున్నారో, కొన్ని సందర్భాల్లో ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారో... అదే పద్ధతిలో దైవ దర్శనాలకు కూడా ముఖ్యంగా కొన్ని ప్రత్యేక పండుగ, జాతర సందర్భాల్లో ఎక్కువ మంది దేవాలయాలకు రావడంతో అదుపుతప్పి తొక్కిసలాటలు సంభవించడం, కొందరు భక్తులు ప్రాణాలు కోల్పోవడం మరికొందరు గాయాలు పాలవడం పరిపాటిగా మారుతుంది. మన దేశంలో నేటికీ అనేక దేవాలయాలు పురాతన కాలంలో నిర్మించినవి కావడంతో ప్రాకారాలు, పై గోడలు, ఇరుకు దైవ దర్శనాల మార్గాలుగా ఉండటంతో పలుమార్లు తొక్కిసలాట జరుగుతుంది. అంచనాలకు మించి ఒకో సందర్భంలో భక్తులు చేరటంతో తగినన్ని సౌకర్యాలు



కల్పించడంలో ప్రభుత్వాలు దేవస్థాన కమిటీలు, బందోబస్తు ఫెయిల్ అవుతున్నారు. ఇదే సమయంలో భక్తులు కూడా ఆచితూచి దైవదర్శనాలకు వెళ్లటం శ్రయోష్కరం. వృద్ధులు, దివ్యాంగులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. మనదేశంలో నేటికీ చాలా దేవాలయాలు చాలా పురాతనమైనవి. మరమ్మతులు చేయవలసి ఉంది. ఆధునీకరణ చేయాలి. అదే సందర్భంలో నేడు పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ద్వారాలు, మార్గాలు సంబంధిత పండితుల సలహా మేరకు విశాలపరచాలి. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. అలాగే చాలా దేవాలయాలు పర్వతప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో, కొండల్లో నెలకొన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పెరుగుతున్న భక్తులు రద్దీకి అనుగుణంగా రవాణా సౌకర్యాలు, దేవాలయాలకు చేరే మార్గాలు, ద్వారాలు వద్ద పగడ్బందిగా బందోబస్తు, రక్షణ కోసం చర్యలు తీసుకోవాలి. అడవి మృగాల నుంచి, విష సర్పాలనుంచి భక్తుల ప్రాణాలు కాపాడాలి. వివిధ దేవాలయాల్లో జరిగే వివిధ ప్రత్యేక పండుగలు సందర్భంగా ముందస్తు చర్యలు పగడ్బందిగా తీసుకోవాలి. తాగునీటి సౌకర్యం, రవాణా సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. దర్శన టిక్కెట్లు పారదర్శకంగా మంజూరు చేయడం తోపాటు సామర్థ్యానికి మించి మంజూరు చేయకూడదు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. శారీరక, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు మరింత మెరుగ్గా ఉంచాలి. అమాయక ప్రజల ప్రాణాలు కాపాడాలి. అదే సమయంలో భక్తులు కూడా ప్రభుత్వాలు దేవస్థాన కమిటీలు పోలీసులు జారీ చేసే సూచనలను అనుసరించాలి. మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు విడనాడాలి. పరిస్థితిని బట్టి ప్రయాణం చేయడం, దర్శనానికి వెళ్ళడం ప్రస్తుత సమయంలో అత్యావశ్యకం. ●

# డిజిటల్ ఇండియాలో మహిళా సాధికారత ఎక్కడ?

డి జె మోహన రావు

నేడు భారతదేశం సాంకేతిక యుగంలోకి శరవేగంగా దూసుకుపోతున్న వేళ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక డిజిటల్ ఇండియా కార్యక్రమం డిజిటల్ సేవలను ప్రతి పౌరుడికి అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ సాంకేతిక పురోగతి నిజమైన అభివృద్ధిని సాధించాలంటే పురుషులతో సమానంగా మహిళలు కూడా ఈ ప్రయాణంలో భాగస్వాములు కావడం అత్యంత ఆవశ్యకం. 'డిజిటల్ పరివర్తనలో లింగ సమానత్వం' అనేది మనం సాధించడం అత్యంత ఆవశ్యకం. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి అత్యంత కీలకమైన ఈ అంశంపై సమగ్ర గణాంకాలతో కూడిన లోతైన అవగాహన అవసరం. మన దేశంలో డిజిటల్ లింగ అంతరం వివిధ స్థాయిల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాథమిక ఇంటర్నెట్ వినియోగం నుండి అధునాతన సాంకేతిక నైపుణ్యాల వరకు మహిళలు పురుషుల కంటే వెనుకబడి ఉన్నారు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ 2023గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా కేవలం 33శాతం మంది మహిళలు మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తుండగా పురుషుల వినియోగం 57శాతంగా ఉంది. ఉపయోగించే పురుషుల్లో 71శాతం స్మార్ట్‌ఫోన్లను వాడుతుండగా, మహిళల్లో సంఖ్య కేవలం 46శాతం మాత్రమే ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఈ అంతరం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో కేవలం 28 శాతం మంది మహిళలు మాత్రమే ఇంటర్నెట్‌ను వినియోగిస్తుండగా, పురుషుల వినియోగం 53శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఈ అంతరం కాస్త తక్కువగా ఉన్నప్పటికీ 41 శాతం మంది మహిళలు, 61శాతం మంది పురుషులు ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే పూర్తి సమానత్వం ఇంకా సాధించలేదు. డిజిటల్ నైపుణ్యాల విషయానికి వస్తే ఈ అంతరం మరింత అధికంగా ఉంది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గణాంకాల ప్రకారం ప్రాథమిక డిజిటల్ అక్షరాస్యత కలిగిన మహిళలు కేవలం 25శాతం మాత్రమే ఉండగా పురుషుల్లో ఈ సంఖ్య 48శాతంగా ఉంది. కోడింగ్ వంటి అధునాతన డిజిటల్ నైపుణ్యాల విషయానికి వస్తే మహిళల ప్రాతినిధ్యం కేవలం 10-15శాతం మధ్యే ఉంది. సాంకేతిక రంగంలోని ఉద్యోగాల్లో కూడా ఇదే అసమతుల్యత కనిపిస్తోంది. విశ్వసనీయ నివేదికల ప్రకారం భారతీయ ఐటీ, సాంకేతిక రంగంలో మహిళలు దాదాపు 34శాతం మంది ఉన్నారు. మధ్య, ఉన్నత స్థాయి నిర్వహణ స్థానాల్లో ఈ సంఖ్య మరింత తక్కువగా స్టార్టప్ వ్యవస్థాపకుల్లో మహిళల శాతం కేవలం 14శాతం మాత్రమే. డిజిటల్ పరివర్తనలో లింగ సమానత్వం కేవలం సామాజిక న్యాయం మాత్రమే కాదు. ఇది భారతదేశ ఆర్థికాభివృద్ధికి గణనీయమైన ఊతమిస్తుంది. ప్రపంచ బ్యాంకు, మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థల అంచనాల ప్రకారం డిజిటల్ లింగ అంతరాన్ని తగ్గించడం ద్వారా భారత దేశ జీడీపీ 0.5శాతం నుండి 1.5శాతం వరకు పెరిగే



అవకాశం ఉంది. అంతేకాకుండా మహిళల ఉద్యోగిత రేటు పెరిగితే ఆర్థిక వృద్ధి మరింత బలపడుతుంది. డిజిటల్ నైపుణ్యాలను పొందడం ద్వారా మహిళలు ఐటీ రంగంలోనే కాకుండా ఆర్థిక సేవలు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి వివిధ రంగాల్లో కొత్త ఉద్యోగ అవకాశాలను పొందగలరు. ఈకామర్స్ వేదికలు మహిళలకు తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించడానికి, చిన్న వ్యాపారాలను స్థాపించడానికి అవకాశాలను అందిస్తాయి. తద్వారా వారి ఆర్థిక స్వావలంబన పెరుగుతుంది. మెరుగైన డిజిటల్ అక్షరాస్యత ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య సమాచారం, విద్యా వనరులకు మహిళల ప్రాప్తిని సులభతరం చేస్తుంది. తద్వారా వారి జీవన ప్రమాణాలు సమగ్రంగా మెరుగుపడతాయి. ఈ ఆందోళనకరమైన గణాంకాల వెనుక సంక్లిష్టమైన సామాజిక ఆర్థిక అడ్డంకులు ఉన్నాయి. పేదరికం, నిరక్షరాస్యతలుఅనేక మంది మహిళలకు స్మార్ట్‌ఫోన్‌లు ఇంటర్నెట్ వంటి ప్రాథమిక డిజిటల్ సాధనాలను అందుబాటులో లేకుండా చేస్తున్నాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ సర్వే ప్రకారం అనేక గ్రామీణ గృహాల్లో డిజిటల్ పరికరాలపై మహిళలకు పరిమిత నియంత్రణ ఉంది. సాంఘిక కట్టుబాట్లు, కుటుంబ నియంత్రణలు తరచుగా మహిళలు డిజిటల్ సాంకేతికతలను స్వేచ్ఛగా ఉపయోగించకుండా అడ్డుకుంటున్నాయి. ఆన్‌లైన్ భద్రత గురించిన భయాలు, సైబర్ వేధింపుల ముప్పు వారిని డిజిటల్ ప్రపంచం నుండి దూరం చేస్తున్నాయి. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) విద్యలో మహిళల తక్కువ ప్రాతినిధ్యం ఉన్నత స్థాయి సాంకేతిక ఉద్యోగాల్లో వారి సంఖ్య తక్కువగా ఉండటానికి ఒక ముఖ్యమైన కారణం. దీనిని ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ధృవీకరిస్తోంది. దురదృష్టవశాత్తు సమాజంలో పాతుకుపోయిన పితృస్వామ్య ఆలోచనలు సాంకేతిక రంగంలో మహిళల పట్ల ఉన్న పక్షపాతాలు అన్ని స్థాయిల్లో వారి వృత్తిపరమైన ఎదుగుదలకు అడ్డంకులు సృష్టిస్తున్నాయి. ఈ సంక్లిష్ట పరిస్థితిని పరిష్కరించడానికి సమగ్రమైన, బహుళస్థాయి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడం అత్యవసరం. డిజిటల్ మౌలిక సదుపాయాలు అందుబాటును మెరుగుపరచాలి. ప్రభుత్వం ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో విశ్వసనీయమైన ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్‌లను విస్తరించడానికి గణనీయంగా పెట్టుబడులు పెట్టాలి. భారత్‌నెట్ వంటి కార్యక్రమాలను వేగవంతం చేయడం చాలా ముఖ్యం. మహిళలకు ప్రత్యేకంగా ప్రత్యేక రాయితీలుతో సరసమైన డేటా టారిఫ్‌లను అందించే ఏర్పాటు కల్పించాలి. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ వంటి నిధులను సమర్థవంతంగా ఉపయోగించడం కూడా కీలకం. దేశవ్యాప్తంగా మహిళల కోసం ప్రాథమిక స్థాయి నుండి అధునాతన స్థాయి వరకు ప్రత్యేక డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించాలి. నేషనల్ డిజిటల్ లిటరసీ మిషన్ వంటి కార్యక్రమాల అమలును మెరుగుపరచడం చాలా ముఖ్యం. స్థానిక భాషల్లో శిక్షణ, మహిళా శిక్షకులను నియమించడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. మొబైల్ లిటరసీ వ్యాన్‌లు, కమ్యూనిటీసెంటర్ల ద్వారా శిక్షణను విస్తరించడం కూడా అవసరం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి భవిష్యత్తులో డిమాండ్ ఉండే డిజిటల్ నైపుణ్యాలపై మహిళలకు శిక్షణఇవ్వడానికి ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన వంటి పథకాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం, శిక్షణ తర్వాత ఉపాధి అవకాశాలను కల్పించడానికి కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం కూడా కీలకం. ●

# ఎమ్మెల్యే సుజనాకు సిఎం చంద్రబాబు పరామర్శ

**గుంటూరు, మే 18, ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరిని హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి సిఎం చంద్రబాబునాయుడు పరామర్శించారు. ఇటీవల



సుజనా లండన్‌లోని ఓ ప్రమాదంలో గాయపడ్డారు. ఈ నేపథ్యంలో సుజనా ఇంటికెళ్లి ఆయన ఆరోగ్యం గురించి సిఎం చంద్రబాబు నాయుడు అడిగి తెలుసుకున్నారు.

## ముని్సపల్ పాఠశాలలకు షెడ్యూల్ విడుదల చేయండి

గుంటూరు విద్య,మే 18,ప్రభాతవార్త : జీవో నెంబర్ 117రద్దుచేస్తూ, 2025పాఠశాల రేషనలైజేషన్ మరియు రీస్ట్రక్చరింగ్ ఆఫ్ స్కూల్స్ కొరకు జివో 19,20,21విడుదల చేయడం జరిగింది.కమ్యూనిస్టు భావజాలంతో నడపబడుతున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతి శుక్రవారం కమీషనర్‌తో సమన్వయ సమావేశాలకు వెళ్ళి చర్చలు జరిపారు.ముని్స పల్ పాఠశాలలకు 1800 పోస్టులు మంజూరు చేయడం జరిగిందని అది మావల్లే జరిగిందని ఒకరెండు రోజులు హంగామా చేశారు.ఇప్పుడంతా సజావుగా జరుగుతుందని అనుకునే సమయంలో అనేక రకాల డిమాండ్లు చేస్తు ధర్నాలకు నోటీసులు ఇవ్వడం



జరిగింది.గత 20సంవత్సరాలుగా రేషనలైజేషన్ జరగకుండా ఆగిపోయిన ముని్స పల్ పాఠశాలకు ఈ రేషనలైజేషన్ వల్ల పిల్లల సంఖ్య ఆధారంగా కేడర్ స్ట్రెంత్ ప్రకారం 2020పోస్టుల మంజూరు చేయడం జరిగింది.దీన్ని బట్టి ముని్స పల్ పాఠశాలల్లో వందల సంఖ్యలో బాలలు,భారీ సంఖ్యలో ఉపాధ్యాయుల కొరత ఉందనేది సుస్పష్టం అయింది.అలాంటి అరకొర సౌకర్యాలతోనే ముని్స పల్ పాఠశాలలు అధ్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయి.కనుక మొట్టమొదటి సారిగా ముని్స పల్ పాఠశాలల్లో రేషనలైజేషన్ మరియు రి స్ట్రక్చరింగ్ ఆఫ్ స్కూల్ ్స ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.ముని్స పల్ టీచర్స్ ఈ ప్రక్రియ ఎక్కడ ఆగిపోతుందోననే ఆందోళనలో ఉన్నారు.కనుక జిల్లా పరిషత్తు ఉపాధ్యాయ సంఘాల పోరాటంతో,వారి డిమాండ్లతో ముని్స పల్ టీచర్స్‌కి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నాము. కనుక ముని్స పల్ పాఠశాలలకు పదోన్నతుల మరియు బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ వెంటనే విడుదలచ చేయాలని,ముని్స పల్ ఉన్నత పాఠశాలల్లో +2 ఏర్పాటు చేయాలని,ముని్స పల్ టీచర్స్‌కి అంతర్ జిల్లా మరియు అంతర్ మేనేజ్‌మెంట్ బదిలీలు నిర్వహించాలని,ముని్స పల్ టీచర్ ్స ఎడ్యుకేషనల్ యూనిఫైడ్ సర్వీసు రూల్స్ విడుదల చేయాలని కమీషనర్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు సోమరౌతు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టుకు ప్రశ్నలు పంపటం రాజ్యాంగంపై చేస్తున్న మరో దాడి ..

గుంటూరు కల్చరల్,మే 18,ప్రభాతవార్త : తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలపకుండా ఏళ్ళ తరబడి తొక్కి పట్టిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును చిత్తశుద్ధితో అమలు చేయాలి ్సన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా ప్రశ్నలు సందించడం సబబు కాదని అవగాహన సంస్థ విమర్శిస్తుంది.ఈచర్య సుప్రీంకోర్టు తీర్పునుండి కేంద్రం తపి ్పంచుకో చూస్తుందన్న విమర్శల్నిఎవరూ కొట్టి పారేయలేరని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.దేశ సరో ్వన్నత న్యాయస్థానం రాజ్యాంగం యొక్క సమాఖ్య స్వభావాన్ని,రాష్ట్రాల హక్కుల్ని పరిరక్షిస్తూ ఆ తీర్పుని వెలువరించిందని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు చారిత్రతత్మకమైందని,ఆ తీరు ్వపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 14ప్రశ్నలు సంధించడం సరికాదని అవగాహన సంస్థ అభిప్రాయ పడుతుంది.సు ప్రీం తీర్పులో ప్రధానంగా ఉపయోగించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 201,202ల గురించే ఆ ప్రశ్నల్లో ఎక్కువగా ఉండడం ఆ తీరు ్వని నిర్వీర్యం చేయడానికే నని అవగాహన సంస్థ విమరి ్శస్తుంది.

## ఎండియు వాహనాలే ముద్దు.. రేషన్ డీలర్లు వద్దు...
## ప్రభుత్వానికి వినియోగదారుల తాఖీదు

ఎ కొండూరు, మే 18, ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రేషన్ షాపుల నుండి ఎండియు వాహనాల ఆపరేటర్ల ద్వారా ఇంటింటికి వెళ్ళి ప్రతినెలా అందిస్తున్న నిత్యవసర సరుకులు బియ్యం, పంచదార కందిపప్పులాంటి సరుకుల వాహనాలను నిలిపివేసి రేషన్ షాపుల్లో డీలర్ల ద్వారా విక్రయించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర సరఫరాల మంత్రి ప్రకటన పట్ల పేద మధ్య తరగతి వినియోగదారులు ముఖ్యంగా దివ్యాంగులు వృద్ధులు ఇంకా ఇతర వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ ఎండియు వాహనాల సరుకు రవాణా తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తిరిగి ఈ కూటమి ప్రభుత్వం పాత డీలర్ షాపుల విధానం ప్రవేశపెట్టడం వల్ల డీలర్ షాపుల వద్ద క్యూలో గంటల తరబడి వేచిఉండటం షాపుల వద్ద నుండి ఇళ్లకు మోసుకు రావడం తలకు మించిన భారంగా తయారవుతుందని దీనివల్ల ఇది మంచి ప్రభుత్వం కూటమితో కష్టాలు తిరిగి మొదలువుతాయని పలువురు ఇది మంచి ప్రభుత్వం నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని గత వైసిపి ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన ఈ వ్యవస్థను రద్దు చేయాలనే దురాలోచన వల్ల రాబోయే రోజుల్లో ఇది మంచి ప్రభుత్వంలో కూటమికి ప్రజా వ్యతిరేకత మహిళల వ్యతిరేకత తోడై కూటమికి తగిన శాస్తి చేస్తామని పలువురు వినియోగదారులు, మహిళల ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. ఈ ఎండియు వాహనాల వ్యవస్థ ముద్దని రేషన్ డీలర్ వ్యవస్థ వద్దని ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని తాఖీదిచ్చారు.

## మామిడి పచ్చళ్ల సీజన్‌లో కిరాణా వ్యాపారుల వ్యాపారం
## మూడు పువ్వులు... ఆరు కాయలు..!

ఎ కొండూరు, మే 18, ప్రభాతవార్త :ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో కిరాణా వ్యాపార సంస్థలు తన ఇష్టారాజ్యంగా నూనె ఇంకా ఇతర వస్తువుల ధరలు విక్రయంచడంతో మామిడి పచ్చళ్ల సీజన్‌లో తమ ఆవకాయ పచ్చళ్ల (మామిడి పచ్చళ్ళు) వేసుకుంటున్న ప్రజలు ముఖ్యంగా మహిళలు ఈ వ్యాపారుల ధరలను చూసి బెంబేలెత్తుతున్నారు. తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు ఎ కొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాల్లో వ్యాపార సంస్థల వారు ఆవకాయ నూనెలు అందులో వినియోగించి వుల్లి ధనియాలు ఆవాలు నూనె ధరలతో పాటు ఎండు మిర్చి ధరలు విపరీతంగా పెంచేసి విక్రయించడం వల్ల ధరలు నషాళానికి అంటాయని పలువురు వినియోగదారులు, గృహిణులు ఆందోళన చెందుతున్నారు. ఈ నియోజకవర్గంలో ఈ వ్యాపారులు నిత్యవసర ధరలు ఇంకా మామిడి పచ్చళ్ల సీజన్‌లో ఈ నెలలో ధరలను తమ ఇష్టానుసారంగా పెంచి విక్రయిస్తున్నా కనీసం ఈ కిరాణా వ్యాపారులపై చర్యలు తీసుకునే నాధుడే లేడని అలాగే ఎలక్ట్రానిక్ కాటా తూకంలో కూడా మోసం చేస్తున్నా సంబంధిత తూనికల కొలతల అధికారులు (మెట్రాలజీ) కల్తీ నిరోధక శాఖ సేల్స్ టాక్స్ ఇంకా ఇతర అధికారులు తనిఖీలు చేయడం మానేసి ఈ కిరాణా వ్యాపారుల వద్ద మామూళ్ళ వసూళ్లకు అలవాటుపడి విధి నిర్వాహణలో పబ్బం గడుపుతున్నారని పలువురు విమర్శించారు. ఇకనైనా ఈ నియోజకవర్గంలో కిరాణా వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

విజయవాడ కార్పొరేషన్,మే 18,ప్రభాతవార్త: ప్రజల సమస్యకు పరిష్కారం చూపే విధంగా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాలలో కూడ ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరుగుతుందని ముని్స పల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ప్రజలు విజయవాడ నగరపాలక సంస్థ సంబంధిత సమస్యలను సోమవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రధాన,జోనల్ కార్యాలయాల్లో అధికారులకు అందించవచ్చని తెలిపారు. నగరం లోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను అధికారులకు తెలియచేసి త్వరగా పరిష్కారం పొందాలని కమీషనర్ తెలిపారు.

# గుంటూరు వార్త



# పేదలకు 'కార్పొరేట్' వైద్యసేవలు

## మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర,మే 18 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా కార్పోరేట్ స్థాయి వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.ఆదివారం మండల కేంద్రం కొల్లిపర కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిభిరాన్ని ఆయన ప్రారంభించారు.శిభిరానికి వస్తూనే మనోహర్





అవ్వా..తాతలను..మహిళలను..ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను ఓర్పుగా విన్నారు.శిభిరంలో వైద్య సేవలు అందిస్తున్న ప్రతి విభాగానికి వెళ్ళి డాక్టర్లు వైద్యసేవలను అందిస్తున్న తీరును పరిశీలించారు.ఈ శిభిరానికి వైద్యం కోసం వచ్చిన ప్రతి రోగికి మెరుగైన వైద్యసేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ మెడికల్ క్యాంపుకు మండల గ్రామాల నుండి అనూహ్య స్పందన వచ్చిందని చెబుతూ ప్రధాన విభాగాలకు చెందిన 20 మంది డాక్టర్లు మరో 50 మంది సిబ్బందితో 822 మంది రోగులు వైద్యసేవలు పొందారని వారందరికి ఉచితంగా మందులు కూడా ఇవ్వటం జరిగిందన్నారు.అంకితభావంతో పనిచేసి వైద్యశాలకు పూర్వ వైభవం వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో ప్రతి కుటుంబానికి అనారోగ్య సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.సంక్షేమ పథకాల్లో భాగంగా మండలంలో దాదాపు 7 వేల మందికి ప్రతి నెలా పింఛన్‌ల క్రింద 45 కోట్ల రూపాయలు అందిస్తున్నామన్నారు.అంతేగాకుండా మండలంలో 105 మంది వితంతువులకు పెన్షలు మంజూరు చేసి పత్రాలను కూడా అందించటం జరిగిందన్నారు.రానున్న రోజుల్లో ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేస్తామన్నారు.కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రానికి తగిన మౌళిక వసతులు కల్పించి రోగులు పట్టణాలకు వెళ్ళకుండా మెరుగైన వైద్యసేవలు అందించటానికి తనవంతు



కృషి చేయనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక,ఎంపీపీ భీమవరపు పద్మావతి,తహశీల్దార్ గుమ్మడి సిద్దార్ధ,ఎంపీడీఓ విజయలక్ష్మీ,మెడికల్ ఆఫీసర్ భరత్,ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయాధికారి జివి.రంగారావు,డాక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## చార్మినార్ పరిధిలో అగ్నిప్రమాదం పట్ల సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**గుంటూరు, మే 18, ప్రభాతవార్త ప్రతినిధి:** హైదరాబాద్‌లోని చార్మినార్ పరిధి గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పలువురు దుర్మరణం పాలవటం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఏపి రాష్ట్ర సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. భవనం మొదటి అంతస్తులో చెలరేగిన మంటల్లో చిన్నారులు, మహిళలు సహా పలువురు మరణించటం విషాధకరమని అన్నారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## గుల్జార్ హౌస్ ప్రాంతంలో అగ్నిప్రమాద సంఘటన దిగ్భ్రాంతికరం: పవన్

**గుంటూరు, మే 18, ప్రభాతవార్త ప్రతినిధి:** హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్ హౌస్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఘోర అగ్నిప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నానని ఏపి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు.

## గొడవలు,ఇతర నేరాల్లో పాల్గొంటే
## కఠిన చర్యలు : పోలీసు అధికారులు

విజయవాడ క్రైం,మే 18,ప్రభాతవార్త : ఎవ్వరైనా,ఎక్కడైనా గొడవలు,ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు ఆదివారం కౌన్సిలింగ్‌లో పాల్గొన్న రైడీషీటర్లు,తదితరులను హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమీషనర్ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు పోలీస్ కమీషనరేట్ పరిధి లోని అన్ని పోలీస్‌స్టేషన్ల పోలీసు అధికారులు వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీస్‌స్టేషన్ పరిధి లోని రౌడీషీటరు లకు లా అండ్ ఆర్డర్,క్రైం సస్పెక్ట్,చెడునడత



కల్గిన వ్యక్తులకు కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో,సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక ,చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనరాదని,ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని,గంజాయి,ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ప్రవర్తనతో,మంచి మార్గంలో నడవాలని,ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకొని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీసు నిఘాను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

## చైర్ పర్సన్ ఎన్నిక ఏర్పాట్ల పర్యవేక్షణ

తిరువూరు, మే 18, ప్రభాతవార్త : తిరువూరు నగర పంచాయతీలో రేపు జరగబోయే ముని్స పల్ చైర్ పర్సన్ ఎన్నిక ఏర్పాట్లను ఎలక్షన్ ప్రిసైడింగ్ ఆఫీసర్ కె మాధురి ముని్స పల్ కమీషనర్ జి



లోవరాజు సిఐ గిరిబాబు ఎస్సై సత్యనారాయణ పర్యవేక్షించారు.

## భారత్ మహిళా మండలి భవన్ వద్ద మజ్జిగ పంపిణీ

విజయవాడ, మే 18, ప్రభాతవార్త : వేసవి తాపం నుండి పాదచారులకు ఉపశమనం కలిగించడానికి భారత్ మహిళా మండలి ఆధ్వర్యంలో విజయవాడలో మజ్జిగ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సతీమణి బొండా సుజాత, లయన్ ఎర్రంశెట్టి శ్రీనివాస్ లు ఎండలో వెళుతునన వారికి పంపిణీ చేశారు.



కార్యక్రమంలో మహిళా మండలి కమిటీ మెంబర్స్, ఉష మాధవి, కె జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బారత్‌మహిళా మండలి ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి దేవి ముఖ్య అతిథులను శాలువా, మెమొంటోలతో సత్కరించారు.

## 'కాంట్రాక్టర్స్ బారినుండి వర్కర్స్‌ను కాపాడాలి'

విజయవాడ, మే 18, ప్రభాతవార్త : వర్కర్ల హక్కులు కాలరాస్తున్న కాంట్రాక్టర్స్ భారి నుండి తమను కాపాడాలని, ఆంధ్రప్రదేశ్ ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ సిపిడబ్ల్యుఎస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాయుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం యూనియన్ రాష్ట్రసమావేశంలో ముఖ్య అతిథి యూనియన్ గౌరవాధ్యక్షులు వినుకొండ రాజారావు, చీఫ్ అడ్వైజర్ మేళం భాగ్యారావు, ముఖ్య



న్యాయ సలహాదారులు సాతులూరి రామాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రావాల్సిన ఈఎస్ఐ, పిఎఫ్, సరైనజీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు చిన్న కొండయ్య, మల్లికార్జున్, నీలాచలం, గంగరాజు, పోశయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

FOR SALE

★ East facing 1 BHK G+2 Floor, 100 Sq.yards Independent House Sale in Bikshavati Bazaar, Tenali. 8919486321.
(Ro.No.6103)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## ప్రేక్షకులను అలరించిన రెండవ రోజు నాటికలు

చిలకలూరిపేట,మే18,ప్రభాతవార్త: సిఆర్ క్లబ్ మరియు చిలకలూరిపేట కళాపరిషత్ ఉభయ తెలుగురాష్ట్రాల ఆహ్వాన నాటికపోటీలు పట్టణంలోని సిఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో రెండవ రోజు మూడు నాటికలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. మొదటి నాటికగా మిత్ర క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఇది రహదారికాదు అనే నాటికను కళాకారులు ప్రదర్శించారు. ఈ నాటిక ఇతివృత్తం. మన దేశంలో కావలసినంత స్వేచ్ఛ ఉంది. అది ఆధారంగా చేసుకొని అనేక సాంస్కృతిక దాడులు ఈ దేశాన్ని విషగాలుల్లా చుట్టు ముట్టేస్తున్నాయి. లివింగ్‌టుగెదర్ పెళ్లి చేసుకోకుండా ఆడా,మగ కలిసి ఉండటం అనే దిక్కుమాలిన సంస్కృతి ప్రవేశించి యువత జీవితాలలో అల్లకల్లోలం సృష్టించింది. దానికి పుట్టిన పిశాచి రూపమే ఇప్పుడు ఈ డింక్ సంస్కృతి. అంటే డ్యూయల్ ఇన్‌కం నో కిడ్స్. ఇద్దరూ సంపాదిస్తారంట, కానీ పిల్లలను కనరట. పందిలాంటి హీన జంతువే పిల్లల పట్ల ఎంతో జాగ్రత్త తీసుకుంటుంది. తన పిల్లలకు రక్షణ ఇవ్వడంలో అది సింహాన్ని కూడా చీల్చిపారేస్తుంది. మరి మనుషులమై ఉండి మనం ఏం చేస్తున్నాం. ఈ విధమైన సంస్కృతి మన దేశపు మహానగరాలలో చాపకింద నీరులా ప్రవహించింది. విశృంఖల సుఖాలవైపు యువత పరుగులు తీస్తున్నారు. మాతృత్వాన్ని కూడా ఫణంగా పెడుతున్నారు. ఈ సంస్కృతి పాటించిన జపాన్, చైనాలాంటి దేశాలలో ఇప్పుడు యువత కరువైపోయి దేశ భవిష్యత్తే ప్రమాదంలో పడింది. సమాజ పరిణామ క్రమాన్ని నాశనం చేసే వీళ్ల ఒక విధంగా దేశద్రోహులు వీళ్ల చెప్పే కారణం ఈ దేశంలో పరిస్థితులు బాగాలేవని, ఇది సమాజం అంటే అనేక రకాల మనుష్యుల సమూహం. ఇక్కడ దరిద్రులు ఉంటారు, ధనవంతులు ఉంటారు, దొరలు ఉంటారు, దొంగలు ఉంటారు, హంతకులు ఉంటారు, అమాయకులు ఉంటారు, మంచివాళ్లుంటారు, మాఫియా లీడర్లు ఉంటారు. వీళ్లందరి మధ్యన మనదైన జీవితంలో మనం ఉన్నతంగా ఎదగాలి. దుర్భరమైన జీవితాన్ని గడుపుతూ కూడా ఈ సమాజానికి ఒక గ్రాండ్ మాష్టర్‌ను అందించిన తల్లి సముద్రాలు. ఇటువంటి తల్లులే మన దేశానికి కావాలి. దారి తప్పిన యువజంటను చక్కదిద్దిన దృశ్యరూపమే ఈ నాటిక ఇది రహదారి కాదు. ఈ నాటికను ఆకురాతి భాస్కర చంద్ర రచించగా ఎస్‌యం భాషా దర్శకత్వం వహించారు.








రెండవ ప్రదర్శనగా కళాభారతి, కరీంనగర్ వారిచే చీకటి పువ్వు నాటికను ప్రదర్శించారు. నాటిక కథాసారాంశం. పరిస్థితులకు ఏ మనిషి అతీతం కాదు అవసరంతోనో, అవకాశం లేకో చాలామంది జీవితంలో తప్పులు చేయడం సహజం. కానీ చేసిన తప్పులు తెలుసుకొని పశ్చాత్తాపపడిన తరువాత కూడా వారిని దూరం పెట్టకండి. క్షమించి వాళ్లని దగ్గరకు తీయండి. ప్రాణం పోయిన తరువాత బాధపడేకంటే ఉన్నప్పుడే భాద్యతగా వ్యవహరించండి. క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉండి అది తెలియచెప్పేదే ఈ చీకటి పువ్వు నాటిక. ఈ నాటికను పరమాత్ముని శివరాం రచించగా, మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. సంగీతం సురభి నాగరాజు, ఆహార్యం, రంగాలంకరణ కె నాగు చేశారు.

మూడవ ప్రదర్శనగా భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం వారిచే దొందూ దొందే అనే హాస్య నాటికను కళాకారులు రసవత్తరంగా ప్రదర్శించారు. ఈ నాటిక కథాసారాంశం. 40 సంవత్సరాలకు పైబడిన ఒక లావుపాటి పెద్ద బానపొట్ట కలిగిన వ్యక్తికి తనకున్న మరో ప్రధాన లోపం వల్ల పెళ్లి జరగదు. చివరకు పెళ్లిళ్ల పేరయ్య చనువుతో ఒక సంబంధం కుదురుతుంది. అయితే తనకున్న లోపాన్ని ముందుగానే తన అత్తింటి వారికి చెప్పాలని పెండ్లికొడుకు తన తాతకు చెపుతాడు. అయితే చెవులు సరిగా వినపడని తాత ఆ విషయాన్ని అమ్మాయి బంధువులకు చెప్పడం మరచిపోతాడు. చివరకు అమ్మాయితో వివాహం జరుగుతుంది. అయితే పెళ్లయిన మర్నాడు మొదటిరాత్రికి బదులు మొదటి పగలు జరిపించాలని పెండ్లి కొడుకు తన అత్తింటివారిని కోరుతాడు. అలా మొదటి రాత్రికి బదులు మొదటి పగలు జరపడం హిందూ సంప్రాదాయం కాదని, ఆ సంస్కృతి మనకు లేదని, అత్తింటివారు సున్నితంగా తిరస్కరించి నవదంపతులను మొదటి రాత్రికి సిద్దం చేస్తారు. ఈ లోగా తనకున్న లోపాన్ని ముందుగానే తన భార్యకు చెప్పాలనే ఉద్దేశంతో తన భార్యను పెరటిలోకి మాట్లాడటానికి రమ్మంటాడు. అయితే తన భార్యకు రేచీకటి ఉందన్న ఆ విషయాన్ని అమ్మాయి తల్లిదండ్రులు దాచిపెట్టి ఈ పెండ్లి జరిపించారని పెండ్లికూతురు చెపుతుంది. దానితో ఆగ్రహించిన పెండ్లికొడుకు అత్తమామలను పిలిచి గొడవపడతాడు. ఆ గొడవలో అల్లుడికి కూడా రేచీకటి ఉందన్న విషయాన్ని అందరూ గ్రహిస్తారు. అమ్మాయికి ఉన్న లోపాన్ని చెప్పకుండా పెండ్లి చేశారు. నాకు పెళ్లి వద్దు విడాకులు కావాలని గొడవ పడుతున్న అల్లుడితో లోపాలనేని ప్రతి ఒక్కరిలో ఉంటాయని, వాటిని భూతద్దంలో చూస్తూ సంసారాలు చిన్నాభిన్నం చేసుకోకూడదని, పెళ్లిళ్లనేవి స్వర్గంలో జరుగుతాయి. నీ పెళ్లికూడా దైవసంకల్పం, ఇద్దరిలోనూ లోపం ఉంది. ఇద్దరూ సర్దుకుపోండి. దొందూ-దొందే అని నచ్చచెప్పడంతో అతనిలో మార్పు రావడంతో నాటిక ముగిస్తుంది. ఈ నాటికను రచించి దర్శకత్వం వహించింది డేవిడ్‌రాజు.

## పాంక్రియాస్‌కు ఎండోస్కోపి ద్వారా చికిత్సచేసి స్టంట్‌వేసిన డాక్టర్ బలరామకృష్ణ తేజస్వి





చిలకలూరిపేట,మే18,ప్రభాతవార్త: పట్టణంలోని ప్రముఖ వైద్యశాల జానకీ నర్సింగ్‌హోం లోని డాక్టర్ బలరామకృష్ణ లివర్ అండ్ గ్యాస్ట్రో సెంటర్‌లో ఆదివారం అరుదైన వైద్యచికిత్స జరిగింది. ఎంతోకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన 30 సంవత్సరాల మహిళ ఆదివారం ఆసుపత్రికి రాగా వైద్య పరీక్షలు నిర్వహించారు. పాంక్రియాస్‌లో సమస్య ఉన్నట్లు గుర్తించి వైద్యం చేశారు. ఎంతో రిస్క్‌తో కూడిన ఈ వైద్యాన్ని లివర్ అండ్ గ్యాస్ట్రో వైద్యనిపుణులు డాక్టర్ బలరామకృష్ణ తేజస్వి ఎండోస్కోపి విధానంతో వైద్యం చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కేసులను శస్త్రచికిత్స అవసరం లేకుండా ఇప్పుడు ఎండోస్కోపి విధానంతో చికిత్స చేయడానికి వీలవుతుందని తెలిపారు. ఎండోస్కోపి విధానంతో ఆ మహిళ పాంక్రియాస్‌లో ఉన్న రాళ్ళు, పేరుకుపోయిన అనవసరపు వ్యర్థాలను తొలగించి, శుభ్రం చేసి తిరిగి సమస్యరాకుండా స్టంట్ వేసినట్లు డాక్టర్ బలరామకృష్ణ తేజస్వి తెలిపారు. ప్రస్తుతం మహిళా ఎలాంటి కడుపునొప్పి లేకుండా మాములు స్దితిలో ఉన్నారు. ఇలాంటి రిస్క్ వైద్యం చేసిన డాక్టర్ బలరామకృష్ణ తేజస్విని ఐయంఎ వైద్య బృందం అభినందించారు.

## బాలశౌరిరెడ్డి భౌతికకాయానికి నివాళులు



నాదెండ్ల,మే18,ప్రభాతవార్త: మండలంలోని తూబాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు గాదె బాలశౌరిరెడ్డి శనివారం మృతిచెందిన సంగతి విదితమే. కాగా ఆదివారం శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ తూబాడు గ్రామంలోని బాలశౌరిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. రాజశేఖర్‌తో పాటు టిడిపి నాయకులు గోపాళం నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి నేలకూలిన వృక్షం

చిలకలూరిపేటటౌన్,మే18,ప్రభాతవార్త: పట్టణంలో శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. చీరాల రోడ్‌లోని పాటిమీద అంకమ్మ చెట్టు సమీపంలో ఈ ఈదురుగాలులకు భారీవృక్షం నడిరోడ్డుపై కూలిపోయింది. ఆ సమయంలో ఆ మార్గాన వెళ్లే ప్రయాణీకులు ఇక్కట్లకు గురయ్యారు. విద్యుత్ అంతరాయం కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా తెలియకపోవడంతో చెట్టును దాటుకుంటూ పోవడం కష్టతరమైంది. ఆదివారం ఉదయం మున్సిపల్ సిబ్బంది ఆ చెట్టును తొలగించారు.



## ఆంజనేయస్వామి దేవాలయంలో అనిల్ రావిపూడి పూజలు



చిలకలూరిపేట,మే18,ప్రభాతవార్త: మెగాస్టార్ చిరంజీవి 157వ సినిమాకు స్క్రిప్టును రచించిన ప్రముఖ సినీ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఆ స్క్రిప్టును ఆదివారం బొప్పుడి శ్రీ ప్రసన్నాంజనేయస్వామి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి తండ్రి బ్రహ్మయ్య, టిడిపి నాయకులు గుంటు కోటేశ్వరరావు, సూర్యా, సాయికృష్ణ, శిరీష, అనిల్ రావిపూడి స్నేహితులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని డైరెక్టర్ అనిల్ రావిపూడికి అందచేశారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు సత్కారం



నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఇసప్పాలెం వాసవి ఆర్యవైశ్య అన్నదాన కమిటీ కన్వీనర్ బత్తుల మురళి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పట్టణంలో అమూల్య నర్సింగ్ హోమ్‌ను 30 సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు స్థాపించి పల్నాడు జిల్లాతో పాటుప్రకాశం జిల్లా ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారికి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పేదలకు నిర్వహించే వైద్య సేవలు అతి తక్కువ ఖర్చుతో చేయటం జరిగిందన్నారు. వైద్య సేవతో పాటు ప్రజాప్రతినిధిగా పేదలకు సేవలు కొనసాగించటం విశేషమని ఈసందర్భంగా వక్తలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యక్రమంలో పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. చేగు వెంటేశ్వరరావు, నరసింహరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ సభ్యత్వం కిట్లు అందించిన జనసేన రాష్ట్ర కార్యదర్శి జిలాని

నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ జిలాని ఆదివారం క్రియాశీలక వాలంటీర్లకు సభ్యత్వ కిట్లును అందించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 50మంది క్రియాశీలక వాలంటీర్లకు పార్టీ అధినేత, డిప్యూటీ సియం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అందించటం జరుగుతుందన్నారు. వా రు పంపిన సందేశం వినిపించటం జరిగిందన్నారు. సభ్యత్వం తీసుకునే ప్రతి కార్యకర్తకు కిట్లు పంపిణీ చేయటంతో పాటు సభ్యత్వం వలన ప్రయోజనాలను వివరించాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుండి పార్టీ బలోపేతం కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సయ్య ద్ జిలాని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు జివిఎస్ ప్రసాద్, నాయకులు అచ్చుల సాంబశివరావు, పమిడిపాడు శ్రీనివాసరావు, జనసేన వీర మహిళలు తదితరులు హాజరయ్యారు.



## కూటమి ప్రభుత్వం ఏడాదిలో భష్టుపట్టింది : మాజీ ఎమ్మెల్యే కాసు

నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : ఏడాదికాలంలో కూటమి ప్రభుత్వం భష్టుపట్టిందని, ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలలో వై.ఎస్.జగన్‌కు గ్రాఫ్ పెరిగిందని, ఎక్కడకు వెళ్ళినా అన్నివర్గాల ప్రజలు ఆయనను ఆదరిస్తున్న తీరు అద్భుతంగా ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వ అనుకూల మీడియాలో ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పారన్నారు. ఓడిపోయిన తర్వాత చంద్రబాబు నాయుడు కోలుకోవడానికి మూడేళ్ళ సమయం పట్టిందన్నారు. జగన్ ఓడిపోయినా కొద్ది రోజులకే తేరుకొని ప్రజలలో నిలిచారని పేర్కొన్నారు. లిక్కర్ కేసులో ఎటువంటి సంబంధం లేని ఐఏఎస్‌లు కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి వంటి వారిని ఆధారాలు లేకుండా అరెస్ట్ చేశారన్నారు. న్యాయస్థానాలు అరెస్ట్‌లపై సాక్ష్యాలను అడిగితే ఇదిగో ఇస్తాం. అదిగో తెస్తామంటూ సాకులు చెప్తున్నారని విమర్శించారు. జగన్‌ను సైతం అరెస్ట్ చేస్తామని ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైన్‌షాపులు ప్రభుత్వమే నడిపిందని, ప్రభుత్వమే ఉద్యోగులను నియమించి అమ్మకాలు చేసిందన్నారు. అయితే ఇప్పుడు మాత్రం కూటమి నాయకులు వైన్‌షాపులను పెట్టి ప్రజలను అడ్డంగా దోచుకుంటున్నారని, ఎమ్మెల్యేలు వాటాలు తీసుకొని బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అక్రమ కేసులు పెట్టి వై.ఎస్.జగన్‌ను బెదిరించాలనుకోవడం కూటమి నాయకుల అవివేకం అన్నారు. పది వేల సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం జగన్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని పచ్చ మీడియా పుంకాలు పుంకాలుగా తప్పుడు రాతలు రాసి ప్రచారం చేశారని గుర్తు చేశారు. అరెస్ట్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అంతులేకుండాపోయిందన్నారు. అక్రమ కేసులు పెట్టి ప్రతి రోజూ అదే పాలనగా కూటమి చేస్తున్న ఈ కార్యక్రమాలకు తప్పకుండా గుణపాఠం చెప్తారని, లక్షల మంది ఓటర్లు ఇప్పటికే తప్పు చేశామని నిర్ణయానికి వచ్చారన్నారు. అఖండ విజయంతో వై.ఎస్.జగన్ వస్తారని, అప్పుడు ఎవరిని వదిలిపెట్టబోమని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హెచ్చరించారు.



## వైద్య శిబిరాల నిర్వహణతో ప్రజలకు మేలు : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : వైద్య శిబిరాల నిర్వహణతో ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక 3వ వార్డు పరిధిలోని నిమ్మతోట, సిల్మాన్ మెమోరియల్ మున్సిపల్ స్కూల్, నార్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఛైర్మన్ నార్ల మారుతీబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హాజరయ్యారు. డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సి విజన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేయడాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అభినందించారు. తెలుగుదేశంపార్టీ ప్రజల కోసం సేవా కార్యక్రమాలను ప్రభుత్వ పరంగా నిర్వహిస్తుందన్నారు. ఈ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగతంగా, స్వచ్ఛంధ సంస్థల ద్వారా వైద్య సేవలను అందిస్తున్నారని తెలియజేశారు. డాక్టర్ చెంచిరెడ్డి మాట్లాడుతూ 200 మందికి కంటికి సంబంధించి పరీక్షలు చేయడం జరిగిందన్నారు. అలాగే వారికి అవసరమైన మందులను అందించామన్నారు. 46 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని తెలియజేశారు. ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రాము, సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, అల్లంశెట్టి మోహన్‌రావు, రంగిశెట్టి రామకృష్ణ, ప్రవల్లిక సత్యం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పమిడిపాడు గ్రామంలో హత్య

నరసరావుపేట క్రైం, మే 18 ప్రభాతవార్త : మండలంలోని పమిడిపాడు గ్రామంలో ఫిరంగుల కోటేశ్వరరావు (40) ఆదివారం హత్యకు గురయ్యారు. కోటేశ్వరరావును అదే గ్రామానికి చెందిన కోట్ల అంజి కర్రతో తలపై దాడి చేసి బలంగా కొట్టడంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా ఎదురెదురు ఇళ్లల్లో ఉండే మృతుడు కోటేశ్వరరావుకు, హత్య చేసిన కోట్ల అంజికి గత కొద్ది సంవత్సరాల నుండి గొర్రెలకు సంబంధించి వివాదం నడుస్తుంది. గొర్రెలను తమ ఇంటి ముందు నిలిపి పాడుచేయవద్దని కోటేశ్వరరావు అనేక మార్లు అంజిని హెచ్చరించారు. గ్రామ పెద్దలు వద్ద ఈ విషయంలో పలుమార్లు పంచాయితీ సైతం జరిగింది. ఈ నేపథ్యంలోనే ఆదివారం కూడా మరోసారి ఇరువురి మధ్య వాగ్వివాదం, ఘర్షణ జరిగాయి. ఆవేశంలో కోటేశ్వరరావు తలపై అంజి కర్రతో దాడి చేయడంతో ఆయన మృతిచెందారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## జనసేన సభ్యత్వాల కిట్ల పంపిణీ

పెదకూరపాడు, మే 18 ప్రభాతవార్త : నియోజకవర్గ జనసేన పార్టీ సమ్మె నవకర్త రామకృష్ణ ఆదేశాల మేరకు పవన్‌కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనసేన సభ్యత్వ కిట్లు ఆదివారం పెదకూరపాడు మండలంలో సభ్యత్వ చేసుకున్నవారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కొత్తశెట్టి వేదాద్రి, గుల్లపల్లి హనుమంతరావు, సచ్చు వెంకటేశ్వరరావు, యద్దనపూడి గోపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



## నేడు ప్రత్తిపాటి నేతృత్వంలో తిరంగా యాత్ర

చిలకలూరిపేట,మే18,ప్రభాతవార్త: ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు నేతృత్వంలో యుద్ధంలో పాకిస్తాన్‌పై ఘనవిజయం సాధించిన భారతసైన్యానికి ధన్యవాదాలు తెలుపుతూ 19వ తేది సోమవారం సాయంత్రం 4గంటలకు పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో ఉన్న మదర్‌థెరిస్సా విగ్రహం వద్దనుండి గడియారస్థంభం సెంటర్ వరకు తిరంగా యాత్ర నిర్వహించబడుతుందని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, సానుభూతిపరులు, దేశభక్తిగల ప్రతి పౌరుడు పాల్గొని వీరజవానుల మృతికి, పహల్గాం ఉగ్రవాదుల మృతులకు సంతాపం తెలుపుదామన్నారు. ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసిన మన సైన్యానికి, భారత ప్రభుత్వానికి సెల్యూట్ చేస్తూ ప్రతి ఒక్కరూ జాతీయజెండా చేతపట్టుకొని తిరంగార్యాలీలో వేలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనవలసినదిగా ఆయన కోరారు.

## ఆయిల్‌మిల్లులో అగ్ని ప్రమాదం

నరసరావుపేట క్రైం, మే 18 ప్రభాతవార్త : పట్టణంలోని సత్తెనపల్లిరోడ్డులో గల ఆంజనేయ ఆయిల్‌మిల్లులో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిల్లులోని జనరేటర్ వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించాయి. మిల్లు యజమానులు, కూలీలు మంటలను గమనించి ఆయిల్ మిల్లులో తయారు చేసే ముడిసరుకును బయటకు తరలించారు. అగ్నిమాపకశాఖకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకున్నారు. మంటలు మిల్లులో వ్యాపించకుండా ఆర్పివేశారు. ఈ సంఘటనలో స్వల్ప నష్టం మాత్రమే చోటు చేసుకుందని, ప్రాణనష్టం, ఆస్థినష్టం సంభవించలేదని మిల్లు యజమానులు తెలియజేశారు.

## పోలీస్ అధికారుల తనిఖీ



నరసరావుపేట క్రైం, మే 18 ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు బస్టాండ్, రైల్వేస్టేషన్, లాడ్జిలు, హోటల్స్‌లో ప్రత్యేక తనిఖీలను ఆదివారం నిర్వహించారు. డాగ్‌స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు జరిగాయి. వాహనాలను పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవారు ఎవరైనా సరే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజల భద్రత మెరుగుపరిచేందుకు, శాంతిభద్రతల మెరుగుదలకు ప్రత్యేక డ్రైవ్‌లు జరుగుతున్నాయన్నారు. లాడ్జీలలో సి.సి.కెమేరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. శివారు ప్రాంతాలలో సంచరించే అనుమానితుల సమాచారాన్ని పోలీసులకు వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సి.ఐ.లు, ఎస్.ఐ.లు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి



నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : విద్యుత్ షాక్‌తో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామ సబ్‌స్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. మృతుడు రఫీ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కరెంట్ పోల్‌పై పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆయన విద్యుత్‌షాక్‌కు గురై పోలుపై నుండి జారిపడ్డారు. లైన్‌మెన్ రాజశేఖర్ తన విధుల స్థానంలో రఫీని ఉంచడంతో ఆ సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కాగా పూర్తిగా లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగానే ప్రైవేట్ ఉద్యోగి మృతిచెందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా లైన్‌మెన్ రాజశేఖర్ పరారీలో ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి ఫ్యాన్లు బహూకరణ

నరసరావుపేట టౌన్, మే 18 ప్రభాతవార్త : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ఎంఐఎం నాయకులు కరిముల్లా ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులు ఫ్యాన్లు లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. మీడియాలో వస్తున్న వరుస కథనాలతో ప్రత్యేకంగా ఫ్యాన్లు కొనుగోలు చేసి రోగుల కొరకు ప్రభుత్వ వైద్యశాలకు అందించామని కరిముల్లా తెలియజేశారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్న వైద్యశాలకు దూర ప్రాంతాల నుండి అనేక మంది రోగులు రావడం జరుగుతుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ వైద్యశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కరిముల్లాతో పాటు వల్లెపు నాగేశ్వరరావు, రెడ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



### మన దేశం రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని మహాయజ్ఞం

అమరావతి, మే 18 ప్రభాతవార్త : పావన కృష్ణానదితీరాన పల్నాడు జిల్లా అమరావతి మండలం పొందుగల శ్రీ గాయత్రి తీర్థంశ్రీ రామకృష్ణ శాంతి ఆశ్రమం ఆవరణలో మహాయజ్ఞం వేదమూర్తి అపోనిష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య ధర్మపత్ని మాతభగవతి దేవి శర్మ యొక్క జన్మశతాబ్ధి, అఖండదీపంపెట్టి వంద సంవత్సరములు పూర్తైన సందర్భంగా పావన కృష్ణానది తీరాన గాయత్రి తీర్థం శ్రీరామకృష్ణ శాంతి ఆశ్రమం అవరణలో మనదేశం బాగుండాలని మనదేశ ప్రజలు సుఖసంతోషాలతో రాష్ట్ర ప్రజలు ఉండాలని అత్యంత ఘనంగా 108 కుండములతో మహాయజ్ఞం జరిగిన అనంతరం పూర్ణావతి కార్యక్రమం జరిగింది. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ మహాయజ్ఞం కార్య క్రమానికి మండల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్రాల నుండి గాయత్రి పరివార్ వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. శ్రీగాయత్రి తీర్థం శ్రీ రామకృష్ణ శాంతి ఆశ్రమం నిర్వాకులు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూశారు.






## రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, మే 18 ప్రభాతవార్త : మండలంలోని కంభంపాడు, బలుసుపాడు గ్రామాలలో అమరావతి రాజధాని కోసం భూ సేకరణపై గ్రామ సభ ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ ్ అధికారులతో కలిసి భూ సేకరణ పై రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. చంద్రబాబు న్యాయం చేసేలా భూ సేకరణ జరుగుతుందని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు. భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రైతులను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్డీవో కుమార్, తహశీల్దార్ ధనలక్ష్మి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెదకూరపాడు, మే 18 ప్రభాతవార్త : శ్రీ ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం మండల పరిధిలోని జలాలపురం గ్రామంలో ఈ నెల 19వతేదీ నుండి 21వ తేదీ వరకు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ పున: ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేదమంత్రాల మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులచే గణపతి పూజతో ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 21వ తేదీ ప్రసన్నాంజనేయస్వామి ప్రతిష్ఠ మహోత్సవాలు అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## గ్రామ గ్రామాన సిపిఐ పార్టీని బలోపేతం చేయండి

అమరావతి, మే 18 ప్రభాతవార్త : సిపిఐ ని గ్రామీణ ప్రాంతాలలో బలోపేతం చేసేందుకు సిపిఐ కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ కోరారు. నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలతో పాటు రైతాంగం రైతు కూలీ కార్మికులు అసంఘటిత కార్మికుల జీవన విధానం మెరుగుపడే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొనే మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం సిపిఐ నిర్వహించే ప్రజా ఉద్యమాలలో ప్రజలను భాగస్వాములను చేయాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో అమరావతి మండల సిపిఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు, మండల కమిటీ సభ్యులు రాంబాబు, ఉదయశేఖర్, మైలా మాధవరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అమరావతి సిపిఐ శాఖ కార్యదర్శిగా శీలంముని, సహాయ కార్యదర్శిగా కె.మంత్రాల యేసు కమిటీ సభ్యులుగా టి.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, గాలం సాంబశివరావు, మాధవరావు, వేదాంతం తదితరులు నూతన కమిటీగా ఎన్నికయ్యారు. సభలో పలువురు పాల్గొని ప్రసంగించారు.

## అత్యధిక మార్కులు సాధించిన కేంద్రీయ విద్యాలయ విద్యార్థికి సన్మానం

సత్తెనపల్లి, మే 18 ప్రభాతవార్త : సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాలలో అత్యధిక మార్కులు 486/500 సాధించిన జొన్నలగడ్డ యశ్వంత్‌ని ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించి అభినందనలు తెలిపారు. ఆదివారం గార్లపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి పాలెపోగు సుమని, ఎంఈఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు గరికపాటి హిట్లర్, జాయింట్ సెక్రటరీ విజయ్‌వర్ధన్, ఉపాధ్యాయులు రామకోటయ్య, సురేష్, ఎస్‌బిఐ మేనేజర్ మణిదాస్, హెడ్ క్యాషియర్ జాన్సన్, ప్రేమ్‌కుమార్, చిలుక రమణయ్య, గార్లపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.



## 20న మినీ మహానాడు

సత్తెనపల్లి, మే 18 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనల మేరకు నియోజకవర్గంలో ఈ నెల 20వతేదీ సాయంత్రం 4 గంటలకు రఘురామ్‌నగర్‌లోని ప్రజావేదిక నందు మినీ మహానాడు జరుగుతుందని కార్యాలయ వర్గాలు తెలియజేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నరసరావుపేట ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్‌లు హాజరౌతారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో అవుట్ పోస్ట్ నందు ఆధ్యాత్మిక శిక్షణ



సత్తెనపల్లి, మే 18 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలోని ఇస్కాన్ టెంపుల్ అవుట్ పోస్ట్ నందు వేసవి కాలంలో ఆధ్యాత్మిక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు వైష్ణవ కృపదాస్ తెలియజేశారు. ఏప్రిల్ 24వతేదీ నుండి మే 18వతేదీ ఆదివారం వరకు ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. శిక్షణలో పిల్లలకు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు భగవద్గీత శ్లోకాల పారాయణం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ మృదంగము కరతాళ కీర్తనలు, శ్లోకాలు, జపం నేర్పించడం జరుగుతుందన్నారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## పల్నాడు జిల్లా అండర్-11 చెస్ జట్ల ఎంపిక

మాచర్ల, మే 18 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అండర్-11 చెస్ జట్ల ఎంపిక పోటీలను మాచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన కె.జె.మాగ్నస్, ఎ.అభినయ్, బాలికల విభాగంలో బి.మేఘశ్రీకోమలి, ఓ.పుష్పితలు గెలుపొందారు. ఈ నెల 24, 25 తేదీల్లో నరసరావుపేటలో జరిగే అండర్-11 రాష్ట్రస్థాయిలో పోటీల్లో పల్నాడు జిల్లాకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారని పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదరంగం నేర్చుకోవడం వల్ల ప్రతి పనిమీద ఏకాగ్రత అనేది ఉంటుందన్నారు. తద్వారా చదువు కూడా సులభతరంగా అర్థం చేసుకోవచ్చు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు వారికి నచ్చిన విభాగాల్లో ఆటలు, పాటలు, క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చెస్ కోచ్ కిరణ్, స్కూల్ డైరెక్టర్స్ రామకృష్ణ, శ్రీదర్‌గుప్తా, హరీష్‌చంద్ర, ప్రిన్సిపల్ హనుమంతరావు, యూనివర్సల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీరాంజనేయులు, పాఠశాల సిబ్బంది, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## దావుపల్లి పర్యటించిన ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి, మే 18 ప్రభాతవార్త: దావుపల్లి గ్రామంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం పొద్దుపోయే వరకు పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన హార్టికల్చర్ అధికారి శ్రావణ్‌కుమార్‌ను పరామర్శించారు. శ్రావణ్‌కుమార్‌తోపాటు గాయపడ్డ శ్రీనునాయక్‌ను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. అలానే ఈ మధ్య వినుకొండ నియోజకవర్గం, శివాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భార్యభర్తలు జొన్నగిరి రామాంజి, అంకమ్మల కుటుంబాన్ని పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని ఆయన ధైర్యం చెప్పారు. రామాంజి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. ఎమ్మెల్యే వెంట వెల్దుర్తి మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## భారత్ సత్తా ప్రపంచానికి తెలిసింది: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, మే 18 ప్రభాతవార్త: పాకిస్తాన్ ముష్కర మూకలను తుదముట్టించేందుకు దేశ సైనికులు చేసిన వ్యూహాత్మక యుద్ధ చర్యలు మన సత్తా ఏమిటో ప్రపంచానికి తెలియపర్చేలా ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని, భారత సాయుధ దళాల పట్ల పౌరుల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తపరిచేందుకు దేశవ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసేలా మాచర్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన తిరంగా యాత్ర విజయవంతమైంది. ఈ యాత్రలో రాజకీయ, రాజకీయేతర పక్షాలు, సామాన్య ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివచ్చారు. జాతీయ జెండాలను భుజంపై ధరించి, భారత్ మాతాకీ జై.. వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. స్థానిక రింగురోడ్డు నుంచి బసానండ్ సెంటర్ వరకు సాగిన ఈ యాత్ర ర్యాలీలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగ్రవాదులను ప్రోత్సహించే ఏ దేశమైనా భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మతాలను రెచ్చగొట్టే స్వదేశ అరాచక శక్తులనఉ సైతం ఎన్డీయే ప్రభుత్వం ఏరిపారేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, రాష్ట్ర తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షులు దారునాయక్, నియోజకవర్గ స్థాయి, పట్టణ తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## దేశభక్తి ఉట్టిపడేలా మంగళగిరిలో తిరంగా యాత్ర

తాడేపల్లి, మే 18, ప్రభాతవార్త : ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంఆ ఆదివారం సాయంత్రం మంగళగిరి పట్టణంలో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుండి మెయిన్‌బజార్, పాత కూరగాయల మార్కెట్, గాంధీచౌక్ వరకు జాతీయ పతాకాలతో తిరంగా ర్యాలీ సాగగా "భారత మాతాకి జై' అంటూ నినాదాలు చేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధా మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆపరేషన్ సింధూర్ ద్వారా గుణపాఠం చెప్పిన భరతమాత ముద్దు బిడ్డలు, వీర సైనికుల విజయకేతనానికి సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. త్రివిధ దళాధిపతులకు దేశ ప్రజలు రుణపడి ఉన్నారన్నారు. భారత్ జోలికి వస్తే ఏం జరుగుతుందో ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. సైన్యానికి ఎలాంటి నష్టం జరగకుండా అత్యంత చాకచక్యంతో పాక్‌ని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశారన్నారు. ఈ ఘనతే నిస్సందేహంగా సైనికులదే అని కొనియాడారు. దేశ శౌర్య పరాక్రమాలను చాటిన సైనికులు, త్రివిధ దళాలకు సంఘీభావంగా నిర్వహించిన తిరంగా ర్యాలీకి ప్రజల నుండి అపూర్వ మద్దతు లభించిందన్నారు. జవాన్లకు మద్దతుగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బిజెపి, టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులతో విద్యార్థులు, యువత, వ్యాపారులు, మాజీ సైనికులు, ప్రజాప్రతినిధులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.





## మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి నా రాజకీయ జీవితాశయం: ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, మే 18 ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి నా రాజకీయ జీవితాశయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. ఆదివారం పట్టణంలోని నెహ్రూనగర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ఏన్డీయే ప్రభుత్వం పెద్దఎతఉ్తన నిధులు కేటాయింపులు జరిపి, అభివృద్ధికి బాటలు వేయడం అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. [illegible] నియోజకవర్గంలో పలు విద్యాలయాలకు పెద్దపీట వేస్తూ దాదాపు రూ.5 కోట్ల 92 లక్షల నిధులతో నూతన నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. కారంపూడి మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవన నిర్మాణాలకు కోటి 59 లక్షలు, దుర్గి మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ, మోడల్ హైస్కూల్ నూతన భవన నిర్మాణాలకు రూ.కోటి 52 లక్షలు, వెల్దుర్తి కస్తూరిబా గాంధీ పాఠశాలలో నూతన భవనాలకు కోటి 8 లక్షలతో శంకుస్థాపన జరగనున్నట్లు ఆయన వెల్లడించారు. శంకుస్థాపన కార్యక్రమాల్లో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్‌బాబు తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని వివరించారు.

**మహానాడు విజయవంతం చేయండి!**

సోమవారం సాయంత్రం మాచర్ల పట్టణం, మానుకొండ కల్యాణ మండపంలో జరిగే నియోజకవర్గ మహానాడును జయప్రదం చేయాలని తెదేపా శ్రేణులకు ఎమ్మెల్యే జూలకంటి పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథులుగా హాజరవుతున్న వారికి భారీ ర్యాలీతో స్వాగతం పలకాలని ఆయన కోరారు. పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి ఉత్సవాల్లో పెద్దఎత్తున హాజరై, మహానాడును విజయవంతం చేయాలని కోరారు.

**శిరిగిరిపాడులో జాతీయస్థాయి వాలీబాల్ టోర్నమెంట్**

వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి తిరునాళ మహోత్సవం సందర్భంగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు, క్రీడా అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు. సోమవారం సాయంత్రం జరిగే ఈ టోర్నమెంట్‌ను ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రులు సత్యకుమార్, రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, శాప్ ఛైర్మన్ రవినాయుడుతోపాటు పలువురు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని స్థాయిలో ప్రప్రథమంగా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ యువతలో కచ్చితంగా క్రీడా స్ఫూర్తి నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షులు దారునాయక్, తెదేపా సీనియర్ నాయకులు ఎనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్నాడు ప్రజల జీవనాడి వరికపూడిసెల: ఎమ్మెల్యే

మాచర్ల, మే 18 ప్రభాతవార్త: పల్నాడు ప్రజల జీవనాడి, ఏడు దశాబ్దాల కల వరికపూడిసెల పూర్తి చేయకుంటే తన జీవితంలో రాజకీయాలు మాట్లాడను అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. ఆదివరం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చగా ఉన్న పల్లెల్లో వైకాపా మూకలు రాజకీయ చిచ్చు రేపుతూ, శునకానందం పొందుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. వరికపూడిసెల పూర్తి చేస్తానని చెప్పి ఎ న్నికల ఐటెమ్‌గా 15 సంవత్సరాలు రాజకీయ పబ్బం గడిపి, పుట్టిన గడ్డకు, నియోజకవర్గ ప్రజలకు రామకృష్ణారెడ్డి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రాజెక్టును పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం అని చెప్పిన పిన్నెల్లి మాటమార్చి, శంకుస్తాపన చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఆ పని స్కూల్ పిల్లలు సైతం చేయగలరని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం హయాంలో వరికపూడిసెల ఫేజ్-1, ఫేజ్-2లను పూర్తిచేసి, పల్నాడు ప్రజలకు సాగు, తాగునీరు అందించి దాహార్తిని తీరుస్తామని భరోసా ఇచ్చారు.

**నా సహనాన్ని పరీక్షిస్తే ఊరుకోను..**

నియోజకవర్గంలో శాంతిని నెలకొల్పేందుకు సహనం పాటిస్తున్నానని, అలాగని రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తే నేనేంటో చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి, ఆయన అనుచరులను ఉద్దేశించి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. నియోజకవర్గంలో దౌర్జన్యాలు, దాడులు, హత్యలు, అవినీతి, దుర్మార్గ రాజకీయాలు చేసే వ్యక్తికి వైకాపాలో పల్నాడు జిల్లా అధ్యక్ష పదవా? అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాలోక్ల కులాలు, మతాలు, వర్గాల మధ్య రాజకీయ చిచ్చు రాజేసి, రాజకీయ పబ్బం గడపాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు.

## తిరంగా యాత్రతో పరిమళించిన పిడుగురాళ్ల

పిడుగురాళ్ల, మే 18 ప్రభాతవార్తః ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో త్రివిధ దళాలకు మద్దతుగా పిడుగురాళ్ల పట్టణంలో ఆదివారం తిరంగా యాత్ర నిర్వహించారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, నియోజకవర్గ పరిశీలకుడు కల్లం రాజశేఖరరెడ్డి, యువనేత యరపతినేని నిఖిల్‌లు జాతీయ జెండాను చేతబూని ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద నుంచి నందమూరి తారక రామారావు వ్యవసాయ మార్కెట్‌యార్డు వరకు ర్యాలీ జరిపారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత త్రివిధ దళాలకు అభినందనలు తెలిపారు. భారతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం మాజీ సైనికోద్యోగి ఐతం నాగేశ్వరరావు (నాయక్), మొగిలి వెంకటేశ్వర్లు నాయక్ (సుబేదార్)లను ఘనంగా సన్మానించారు.





## తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన ఎన్టీఆర్

పిడుగురాళ్ల, మే 18 ప్రభాతవార్తః తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ దేశాలకు టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చాటి చెప్పారని ప్రజాప్రతినిధులు అన్నారు. పట్టణంలోని నందమూరి తారక రామారావు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆదివారం గురజాల నియోజకవర్గస్థాయి మహానాడు కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు, టీటీడీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి, నియోజకవర్గ పరిశీలకుడు కల్లం రాజశేఖరరెడ్డి, యువనేత నిఖిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రమానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడులో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు భారీగా పాల్గొన్నారు.





## ఆపరేషన్ సిందూర్.. మరపురాని ఘట్టం

రెంటచింతల, మే 18 ప్రభాతవార్త: ఉగ్రవాదులను అంతం చేయడంలో త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రం రెంటచింతలలో ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు, వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయోత్సవ



ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ నేత పోకూరి కాశీపతి మాట్లాడుతూ ఉగ్రవాదంపై పీఎం మోడీ ఆధ్వర్యంలో సైనికులు సాధించిన ఆపరేషన్ సిందూర్ మరపురాని ఘట్టమన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన సైనికులకు పౌరులకు నివాళులర్పించారు. జాతీయ పతాకాలు చేతపట్టి ప్రధాన రహదారి నుంచి పురవీధుల్లో అమరులైన జవాన్లను కీర్తిస్తూ ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టిన సైనికులకు బాసటగా నిలుద్దామని పిలుపునిచ్చారు. తిరంగా ర్యాలీలో బీజేపీ మండల అధ్యక్షుడు బోయ నాగిరెడ్డి, టౌన్ తెదేపా అధ్యక్షుడు మూలి రాజారెడ్డి, ఆర్యవైశ్య నేతలు ఏచూరి వెంకటసైదయ్య, ఆకుల నరసింహారావు, గుండా రామ్మూర్తి, నాళం బాబు, ఏచూరి సాంబ, కాశీపతి, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఖురాన్ గ్రంథాన్ని అందరూ పఠించాలి

రెంటచింతల, మే 18 ప్రభాతవార్త: ఇస్లాం పవిత్ర గ్రంథమైన ఖురాన్‌ను పఠించిన వారి జీవితాలు ఎల్లప్పుడు సుఖశాంతులతో వర్ధిల్లుతాయని హజరత్ మౌలానా అహమ్మద్ అబ్దుల్లా సాహెబ్ పేర్కొన్నారు. తుమృకోట అలంగీర్ మసీదు ఆవరణలో ఆదివారం నాడు జరిగిన జల్సాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తుమృకోట మసీదులో 9 నుంచి 13 ఏళ్ల మధ్య ఉన్న బాలబాలికలు 16 మంది ఏడాదిన్నర కాలంలో ఖురాన్ గ్రంథాన్ని అభ్యసించారు. ఈ సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో రాష్ట్రంలోని మౌలానాలు చిత్తూరు జిల్లా షర్ఫుదిన్ సాహెబ్, నల్గొండ జిల్లా అక్బర్ ఖాన్ సాహెబ్, అమరావతికి చెందిన ముస్తాన్ సాహెబ్ మరియు ముక్తిలు ఇమ్రాన్ సాహెబ్, మాచర్లకు చెందిన అబ్దుల్ రజాక్ సాహెబ్, అబ్దు రషీద్ సాహెబ్ తదితర వక్తలు ఈ సభలో పాల్గొని ఖురాన్ సందేశాలు బోధించారు. అనంతరం అలంగీర్ మసీదు ముతవల్లి పటాన్ హుస్సేన్ ఖాన్ ఖురాన్ పూర్తి చేసిన బాలబాలికలకు 16 మందికి, ఏడుగురు వక్తలకు శాలువాలతో సత్కరించారు. ఖురాన్ గ్రంథ పఠనాన్ని విద్యార్థినీ విద్యార్థులకు నేర్పించిన ముతిన్త సాబ్ షేక్ ఖాసింకు గ్రామ ముస్లిం సోదరులు భారీ ఎత్తున పూలమాలతో సన్మానాలు చేశారు. అనంతరం సుమారు 2000 మంది ముస్లిం సోదర సోదరీమణులకు భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ జమాల్‌కాన్, సాదిక్ ఖురాన్ పూర్తి చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అలంగిరి మసీదు అధ్యక్షులఉ పటాన్ సిలార్‌సాహెబ్‌తోపాటు మాజీ వంతల్లి మాజీ ముతవల్లి పఠాన్ జాన్‌మేరాఖాన్, షేక్ సుభాని, బాల్‌సైదా, షేక్ కంపాటి చిన్న అల్లబక్షి, హాజీ సాబ్ జమాల్ సైదా, మసీదు అధ్యక్షులు షేక్ సిలార్ సాహెబ్, పటాన్ సైసావలి, హుస్సేనియా మసీదు ప్రెసిడెంట్ పటాన్ సైసావలి, ముతవల్లి పఠాన్ మస్తాన్‌ఖాన్‌లతోపాటు రెంటచింతల మండలంలోని 11 మసీదులకు చెందిన ఇమాములు, మవుజనులు, ముస్లిం సోదరులు పాల్గొని ఈ కార్యక్రమంలో ప్రత్యేక సేవలు అందించి జయప్రదం చేశారు.



## ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి: రాష్ట్ర తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్

విజయపురిసౌత్, మే 18 ప్రభాతవార్త: రాజ్యాంగంలో పొందుపరచిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర తెదేపా ఎస్టీసెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్ అన్నారు. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో దారునాయక్ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. డా॥ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. చదువుతోనే పేదరికాన్ని పారద్రోలాలన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవాసంఘం పల్నాడు జిల్లా వైస్ ప్రెసిడెంట్ బాణావత్ వెంకటేష్‌నాయక్, మహబూబ్‌నగర్ ఎస్సీ ఎస్టీ కోర్టు పీపీ రాజేశ్వరరావు, హైకోర్టు అడ్వకేట్






కృష్ణారెడ్డి, మాచర్ల నియోజకవర్గ తెదేపా ఎస్టీసెల్ అధ్యక్షుడు వజ్రంనాయక్, మాచర్ల మండల తెదేపా అధ్యక్షుడు వీరాస్వామి [illegible], గందలానాయక్, రాంచంద్ తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో నియోజకవర్గ మహానాడు

### --మూడు తీర్మానాలను ఆమోదించిన నాయకులు,పార్టీ శ్రేణులు

తాడేపల్లి, మే 18, ప్రభాతవార్త : మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో మంగళగిరి నియోజకవర్గ టిడిపి మహానాడును ఆదివారం పెద్దఎత్తున నిర్వహించారు. నాయకులు జ్యోతిప్రజ్వలన చేసి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా చేయడం, అవినీతి రహిత నియోజకవర్గంగా మంగళగిరిని తీరి ్చదిద్దడం, నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల మృతికి సంతాప తీర్మాణాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. తీర్మానాలను జిల్లాస్థాయి మహానాడుకు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ తెదేపా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిందన్నారు. ప్రజల సంక్షేమం ఓ వైపు..రాష్ట్రాభివృద్ధి మరోవైపుతో తనదైన ముద్ర వేసుకుంటుందన్నారు. రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషిచేస్తున్నారని అలాగే



నియోజకవర్గంలోనూ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ 82లో పార్టీ పెట్టి రాజకీయ విప్లవం, సామాజిక విప్లవం తెచ్చారన్నారు. పెత్తందార్లు, సంపన్నులు రాజకీయాల్లో ఏలుబడి సాగిస్తున్న రోజుల్లో ఎన్టీఆర్ అతి సామాన్యులకు టిక్కెట్లు ఇచ్చి శాసనసభకు పంపారన్నారు. గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ టిడిపి పెట్టి పెనుమార్పు తెచ్చారన్నారు. కూడు, గూడు, నీడ నినాదంతో పేదలను ఆదుకున్నారన్నారు. నియోజకవర్గ మహానాడులో కార్పొరేషన్ డైరెక్టర్లు, టిడిపి రాష్ట్ర, జిల్లానేతలు, నియోజకవర్గ నాయకులు, అన్ని మండలాల టిడిపి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ఎంపిటీసీలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అత్యధిక మార్కులు సాధించిన కేంద్రీయ విద్యాలయ విద్యార్థికి సన్మానం

సత్తెనపల్లి, మే 18 ప్రభాతవార్త : సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాలలో అత్యధిక మార్కులు 486/500 సాధించిన జొన్నలగడ్డ యశ్వంత్‌ని ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించి అభినందనలు తెలిపారు. ఆదివారం గార్లపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి పాలెపోగు సుమని, ఎంఈఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు గరికపాటి హిట్లర్, జాయింట్ సెక్రటరీ విజయ్‌వర్ధన్, ఉపాధ్యాయులు రామకోటయ్య, సురేష్, ఎస్‌బిఐ మేనేజర్ మణిదాస్, హెడ్ క్యాషియర్ జాన్సన్, ప్రేమ్‌కుమార్, చిలుక రమణయ్య, గార్లపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.



## 20న మినీ మహానాడు

సత్తెనపల్లి, మే 18 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనల మేరకు నియోజకవర్గంలో ఈ నెల 20వతేదీ సాయంత్రం 4 గంటలకు రఘురామ్‌నగర్‌లోని ప్రజావేదిక నందు మినీ మహానాడు జరుగుతుందని కార్యాలయ వర్గాలు తెలియజేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నరసరావుపేట ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్‌లు హాజరౌతారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో అవుట్ పోస్ట్ నందు ఆధ్యాత్మిక శిక్షణ

సత్తెనపల్లి, మే 18 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలోని ఇస్కాన్ టెంపుల్ అవుట్ పోస్ట్ నందు వేసవి కాలంలో ఆధ్యాత్మిక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు వైష్ణవ కృపదాస్ తెలియజేశారు. ఏప్రిల్ 24వతేదీ నుండి మే 18వతేదీ ఆదివారం వరకు ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. శిక్షణలో పిల్లలకు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు భగవద్గీత శ్లోకాల పారాయణం, ఆర్ట్ అండ్ క్రాఫ్టస్ మృదంగము కరతాళ కీర్తనలు, శ్లోకాలు, జపం నేర్పించడం జరుగుతుందన్నారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



## దేశం , రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని మహాయజ్ఞం

అమరావతి, మే 18 ప్రభాతవార్త : పావన కృష్ణానదీతీరాన పల్నాడు జిల్లా అమరావతి మండలం పొందుగల శ్రీ గాయత్రి తీర్థంశ్రీ రామకృష్ణ శాంతి ఆశ్రమం ఆవరణలో మహాయజ్ఞం వేదమూర్తి అపోనిష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య ధర్మపత్ని మాతభగవతి దేవి శర్మ యొక్క జన్మశతాబ్ది, అఖండదీపంపెట్టి వంద సంవత్సరములు పూర్తైన సందర్భంగా పావన కృష్ణానది తీరాన గాయత్రి తీర్థం శ్రీరామకృష్ణ శాంతి ఆశ్రమం అవరణలో మనదేశం బాగుండాలని మనదేశ ప్రజలు సుఖసంతోషాలతో రాష్ట్ర ప్రజలు ఉండాలని అత్యంత ఘనంగా 108 కుండములతో మహాయజ్ఞం జరిగిన అనంతరం పూర్ణావతి కార్యక్రమం జరిగింది. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ మహాయజ్ఞం కార్య క్రమానికి మండల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్రాల నుండి గాయత్రి పరివార్ వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. శ్రీగాయత్రి తీర్థం శ్రీ రామకృష్ణ శాంతి ఆశ్రమం నిర్వాకులు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూశారు.





## రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, మే 18 ప్రభాతవార్త : మండలంలోని కంభంపాడు, బలుసుపాడు గ్రామాలలో అమరావతి రాజధాని కోసం భూ సేకరణపై గ్రామ సభ ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులతో కలిసి భూ సేకరణ పై రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. చంద్రబాబు న్యాయం చేసేలా భూ సేకరణ జరుగుతుందని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు. భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రైతులను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్డీవో కుమార్, తహశీల్దార్ ధనలక్ష్మి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెదకూరపాడు, మే 18 ప్రభాతవార్త : శ్రీ ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం మండల పరిధిలోని జలాలపురం గ్రామంలో ఈ నెల 19వతేదీ నుండి 21వ తేదీ వరకు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ పున: ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేదమంత్రాల మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులచే గణపతి పూజతో ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 21వ తేదీ ప్రసన్నాంజనేయస్వామి ప్రతిష్ఠ మహోత్సవాలు అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## గ్రామ గ్రామాన సిపిఐ పార్టీని బలోపేతం చేయండి

అమరావతి, మే 18 ప్రభాతవార్త : సిపిఐ ని గ్రామీణ ప్రాంతాలలో బలోపేతం చేసేందుకు సిపిఐ కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ కోరారు. నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలతో పాటు రైతాంగం రైతు కూలీ కార్మికులు అసంఘటిత కార్మికుల జీవన విధానం మెరుగుపడే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొనే మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం సిపిఐ నిర్వహించే ప్రజా ఉద్యమాలలో ప్రజలను భాగస్వాములను చేయాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో అమరావతి మండల సిపిఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు, మండల కమిటీ సభ్యులు రాంబాబు, ఉదయశేఖర్, మైలా మాధవరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అమరావతి సిపిఐ శాఖ కార్యదర్శిగా శీలం ముని, సహాయ కార్యదర్శిగా కె.మంత్రాల యేసు కమిటీ సభ్యులుగా టి.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, గాలం సాంబశివరావు, మాధవరావు, వేదాంతం తదితరులు నూతన కమిటీగా ఎన్నికయ్యారు. సభలో పలువురు పాల్గొని ప్రసంగించారు.



## జనసేన సభ్యత్వాల కిట్ల పంపిణీ

పెదకూరపాడు, మే 18 ప్రభాతవార్త : నియోజకవర్గ జనసేన పార్టీ సమ్మె నవకర్త రామకృష్ణ ఆదేశాల మేరకు పవన్‌కళ్యాణ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జనసేన సభ్యత్వ కిట్లు ఆదివారం



పెదకూరపాడు మండలంలో సభ్యత్వ చేసుకున్నవారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కొత్తశెట్టి వేదాద్రి, గుల్లపల్లి హనుమంతరావు, సచ్చు వెంకటేశ్వరరావు, యద్దనపూడి గోపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు భరోసా

### -సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, మే 18, ప్రభాతవార్త: సంగం డెయిరీకి పాలు పోసే పాడి రైతులకు సంగం డెయిరీ భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలోని పాల సొసైటీకి పాలు పోస్తున్న ఒరుగంటి బాలకృష్ణకు రూ.60వేల చెక్కును అందజేశారు. ఒరుగంటి బాలకృష్ణకు చెందిన పాడి పశువు ఇటీవల అకాలమరణం చెందింది. సంగం డెయిరీ పశుసంక్షేమ పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీ పాడి రైతులకు ప్రయోజనం చేకూరేవిధంగా కృషి చేస్తుందన్నారు. పాల ఉత్పత్తిదారులకు ఎప్పటికప్పుడు బోనస్‌ను అందజేయడంతోపాటు, రాయితీపై దాణా కూడా అందిస్తుందన్నారు. అదేవిధంగా పశువులు అకాల మరణం చెందినట్లయితే సదరు రైతును ఆదుకునేందుకు పశువులకు కూడా సంక్షేమ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. సంగం డెయిరీ దినదినాభివృద్ధి చెందుతుందంటే అందుకు కారణం పాడి రైతులేనన్నారు. సంగం డెయిరీ వివిధ రకాల పాల ఉత్పత్తులను తయారు చేయించి విక్రయిస్తుందన్నారు. మార్కెట్లో సంగం డెయిరీ ఉత్పత్తులకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. పాల ఉత్పత్తిదారుల, పాడి రైతులు, వినియోగదారుల నమ్మకాన్ని వమ్ముకాకుండా నూరుశాతం విశ్వసనీయతతో, పారదర్శకంతో డెయిరీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు, సంగం డెయిరీ అధికారులు, గ్రామస్తులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.



## 20నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

### -కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్

పొన్నూరు, మే 18, ప్రభాతవార్త: ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే హనుమజ్జయంతి ఉత్సవాలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ తెలిపారు. స్థానిక శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయంలోని కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ ఉత్సవాలు శ్రీ వైఖానస ఆగమోక్తముగా, త్రయాహ్నిక దీక్షతో జరుగుతాయన్నారు. 20వ తేదీన ఉదయం ఉత్సవమూర్తులకు తిరుమంజనము,అలంకరణ, రాత్రి 7గంటలకు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనము, అంకురారోపణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 21వ తేదీన ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనము, మన్యుసూక్త సహిత చతుర్దశ కలశ స్నపన,(మూల మూర్తికి అభిషేకము), అలంకారములు, మధ్యాహ్నం 12గంటలకు లక్ష తమలపాకుల పూజ, సాయంత్రం 6గంటలకు స్వామివారి ఉష్ట్రవాహన గ్రామోత్సవం జరుగుతాయన్నారు. 22వ తేదీ ఉదయం 4గంటలకు పంచామృతాభిషేకము, అలంకరణ, మధ్యాహ్నం 12గంటలకు లక్ష తమలపాకులు, మల్లెలపూలతో పూజ, సాయంత్రం 4గంటలకు తీర్థప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. రాత్రి 7గంటలకు శ్రీ సువర్చలా సమేత శ్రీ వీరాంజనేయస్వామివారి దివ్య తిరుకళ్యాణం జరుగుతుందన్నారు. ఈ కళ్యాణోత్సవంలో పాల్గొనేవారు రూ.1516చెల్లించి రశీదు పొందాలని కోరారు. 23వ తేదీ సాయంత్రం 5గంటలకు శ్రీ స్వామివారి దివ్య రథోత్సవం జరుగుతుందన్నారు. 22వ తేదీ జరిగే ప్రత్యేక పూజలో తమ గోత్రనామాలతో పూజ జరిపించుకోదలచినవారు రూ.516చెల్లించి రశీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు దేవాలయంలో సంప్రదించవచ్చని కార్యనిర్వహణాధికారి వెంకట అమర్నాథ్ కోరారు.



## వైకాపా మండలాధ్యక్షుడిగా ఆళ్ళ శ్రీరామిరెడ్డి

పొన్నూరు, మే 18, ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేబ్రోలు మండల పార్టీ అధ్యక్షుడిగా ఆళ్ళ శ్రీరామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కార్యకర్తల సమక్షంలో, కార్యకర్తల అభీష్టం మేరకు మాత్రమే పార్టీ బాధ్యులను నియమించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆళ్ళ శ్రీరామిరెడ్డిని ఏకగ్రీవంగా ఆమోదించడంతో పార్టీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అందరిని కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రానున్న రోజుల్లో పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యకర్తలు, నాయకులు అందరం కలిసికట్టుగా పార్టీ పటిష్టతకు కృషి చేద్దామని శ్రీరామిరెడ్డి పిలుపునిచ్చారు.



## ఎమ్మెల్యేని కలిసిన బులియన్ మర్చంట్స్ నాయకులు

పొన్నూరు, మే 18, ప్రభాతవార్త: పొన్నూరు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటి నాయకులు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సంకా మల్లికార్జునరావు ఎమ్మెల్యేని దుశ్శాలువ, బొకేలతో సత్కరించారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి అసోసియేషన్ కృషి చేసే విధంగా ఆలోచన చేయాలని సూచించారు. నూతన కమిటిని నరేంద్రకుమార్ అభినందించారు. ఎమ్మెల్యేని కలిసినవారిలో కార్యదర్శి షేక్ అలీషా, కోశాధికారి ఎండి ఖాశిం, మాజి కౌన్సిలర్లు వెదురుపర్తి లక్ష్మణమూర్తి,మహ్మద్ గౌస్, షేక్ బాబ్జి, తాడికొండ సుధీర్ తదితరులున్నారు.

## శాంతిభద్రతలను కాపాడడమే పోలీసుల కర్తవ్యం

పొన్నూరు, మే 18, ప్రభాతవార్త: శాంతిభద్రతలను కాపాడడమే కర్తవ్యంగా పోలీసులు పనిచేస్తున్నారని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ అన్నారు. నిడుబ్రోలులో శనివారం రాత్రి జరిగిన వార్డు నిద్ర కార్యక్రమంలో ఆయన వార్డు ప్రజలతో సమావేశమయ్యారు. వార్డులో పోలీసుల నుంచి చేపట్టాల్సిన, పరిష్కరించాల్సిన సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించబోమన్నారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు వార్డు నిద్ర కార్యక్రమాన్ని



నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సెలవులకు వేరే ప్రాంతాలకు వెళ్ళేవారు, తమకు సమాచారం ఇస్తే లాకింగ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా రాత్రి వేళ సదరు ఇంటి వద్ద గస్తీని కూడా పెంచుతామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ పౌరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డు పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నట్లుగానీ, పేకాట స్థావరాలు నడుపుతున్నట్లు కానీ, గంజాయి, తదితర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే తమకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని కోరారు. మైనర్లకు వాహనాలను ఇస్తే వారి తల్లిదండ్రులను బాధ్యులను చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే నాణ్యమైన పోలీసు సేవలను పొందవచ్చన్నారు. వార్డు నిద్ర కార్యక్రమంలో అర్బన్ ఎస్సై వాగాల శ్రీహరి, టిడిపి నిడుబ్రోలు పట్టణాధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ తదితరులున్నారు.

## 21నుంచి నండూరులో ఉత్సవాలు

పొన్నూరు, మే 18,ప్రభాతవార్త: మండల పరిధిలోని నండూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత ప్రపత్తాంజనేయస్వామి వారి దేవాలయంలో ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జయంతి ఉత్సవాలు జరుగుతాయని హనుమత్‌పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాసశర్మ చెప్పారు. 21వ తేదీన ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ తదితర పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 11గంటలకు స్వామివారికి సింధూరం, అప్పములతో అర్చనలు జరుగుతాయన్నారు. సాయంత్రం 6.30గంటలకు ప్రదోషకాల సహస్రనామార్చనలు, పంచహారతులు వేదస్వస్థి జరుగుతాయన్నారు. 22వ తేదీన శతసహస్ర నాగవల్లీ దళార్చన, అనుష్ఠాంగ హోమములు, పురుషసూక్త, మన్యుసూక్త హోమములు జరుగుతాయన్నారు.

## జనసేన బలోపేతానికి విన్నకోట కృషి అభినందనీయం

### బాపట్లలో జనసేన జెండా దిమ్మెల ఆవిష్కరణ

బాపట్ల,మే18,ప్రభాతవార్త: బాపట్లలో జనసేన పార్టీ బలోపేతానికి విన్నకోట సురేష్ చేస్తున్న కృషి అభినందనీయమని గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు.



బాపట్ల పట్టణంలో విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో అదివారం ఏర్పాటుచేసిన జనసేన పార్టీ జెండా దిమ్మెల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జండా దిమ్మెల ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టిన ఊరు బాపట్ల అని అటువంటి బాపట్లలో జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలన్నారు. బాపట్లలో జనసేనకు విశేషమైన ఆదరణ లభిస్తుందని రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో జనసేన పార్టీ బాపట్లలో పట్టు సాధిస్తుందన్నారు. అదేవిధంగా కూటమిలో భాగంగా రాష్ట్రంలో నాణ్యమైన పాలన అందిస్తూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రజల మన్ననలు పొందుతున్నారని రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా బాపట్ల జనసేన నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నానని తనకు బాపట్ల జనసేన శ్రేణుల నుండి ఎంతగానో ప్రోత్సాహం లభిస్తుందన్నారు. రానున్న రోజుల్లో బాపట్ల నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన పార్టీ కార్యక్రమాలు నిర్వహించి పార్టీని మరింత ప్రజలలోకి తీసుకెళ్ళే విధంగా కృషి చేస్తానన్నారు. పట్టణంలోని 8 వార్డులలో జనసేన పార్టీ జెండా దిమ్మెలు ఆవిష్కరించామన్నారు. దిమ్మెల ఆవిష్కరణ కార్యక్రమానికి జనసైనికులు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని జనసేన పార్టీ బలోపేతంతో పాటు జన సైనికులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాలన పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారని రాష్ట్రంలో పాలన సవ్యంగా జరిగేలా కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి, విష్ణు మొలకల చంద్రమోహన్, మాడసాని బాలాజీ, కారుమూరి ఆంజనేష్, మాసా కళ్యాణ చక్రవర్తి, మహేష్, ఏసోబు, సాయిబాబు, ధర్మారావు, వినోదు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బదిలీల్లో

## 59ఏండ్ల 10నెలలు నిండిన వారికి మినహాయింపు ఇవ్వాలి

--వైసీపీ ఎంప్లాయిస్ పెన్షనర్స్ విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షులు సాదం సత్యనారాయణ

గుంటూరు విద్య,మే 18,ప్రభాతవార్త : గతంలో 2017న జరిగిన ఉపాధ్యాయుల బదిలీల ద్వారా 2017 ఆగస్టు 1వ తేది నుండి ప్రస్తుత పాఠశాలల్లో పరిచేస్తున్నాం.మాకు జూలై 31, 2025సంవత్సరానికి 8సంవత్సరాలు పూర్తయి లాంగ్ స్టాండింగ్ అవుతాము.కానీ ప్రస్తుతం బదిలీల్లో ఎకడమిక్ ఇయర్స్ ప్రాతిపదికగా మమ్ములను 2నెలలు ముందుగానే బదిలీకు గురిచేయుచున్నారు.ఉదాహరణకు 01-08-1965లో పట్టిన వారికి జూలై 31, 2025నాటికి 60సంవత్సరాలు నిండి బదిలీలలో మినహాయింపు పొందే అవకాశాన్ని కోల్పోతున్నారు.వచ్చే మే నెలలో జరగబోయే బదిలీల యందు ఒక ఎకడమిక్ ఇయార్‌లో 9నెలలు పనిచేస్తే ఒక సంవత్సరం పూర్తయినట్లుగా పరిగణిస్తున్నారు.మే 31 నాటికి మా వయస్సు 59సంవత్సరాల 10నెలలు,అకడమిక్ ఇయర్ ప్రామాణికంగా తీసుకొని మా వయస్సు 60సంవత్సరాలు పూర్తియినట్లు పరిగణించి రేపు జరగబోయే ఉపాధ్యాయుల బదిలీల్లో మాకు మినహాయింపు ఇవ్వాల్సిందిగా వేడుకొనుచున్నాము.గతంలో పదవీ విరమణ వయస్సు 58సంవత్సరాలుగా ఉన్నప్పుడు 56సంవత్సరాల వయస్సు నిండిన వారిని పెద్దవయస్సుగా పరిగణించి బదిలీల నుండి మినహాయింపు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం 57సంవత్సరాలు నిండినా,58సంవత్సరాలు నిండినా, కనీసం 59సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయుల బదిలీల యందు మినహాయింపు ఇవ్వకపోవడం బాధాకరం.పెద్ద వయస్సులో 59సంవత్సరాలు నిండి 60వ సంవత్సరం జరుగుతున్న వారి పట్ల దయ చూపమని మిక్కిలిగా వేడుకొనుచున్నాము.అనేక రకాల బిపి,షుగర్,శుక్లాలు,మోకాళ్ళ నొప్పులు,నడుముల నొప్పులు,పెరాలసిస్ మొదలగు అనేక రుగ్మతలతో బాధపడుతున్న వారి పట్ల తమరు దయతో మాకు న్యాయం చేయాలని కోరుతున్నారు.మాయందు దయుంచి పెద్దవయస్సులో మమ్ములేను ఇబ్బంది పెట్టకుండా వచ్చే మే నెలాఖరుకు 59సంవత్సరాల 10నెలల వయస్సు నిండిన వారికి అయినా బదిలీల యందు మినహాయింపు ఇవ్వవలసిందిగా తమరిని మిక్కిలిగా వేడుకొనుచున్నాము.

## టాలీ ప్రైమ్ 6.02 ప్రారంభం

గుంటూరు విద్య,మే 18,ప్రభాతవార్త : టాలీ సొల్యూషన్స్ సంస్థ చిన్న మధ్య పరిశ్రమల వ్యాపార సంస్థలకు ఉపయోగపడే రీతిలో టాలీ ప్రేమ్ 6.02ను ప్రారంభించినట్లు సంస్థ డైరెక్టర్ వెల్లడించారు.భారతదేశంలో బిజినెస్ ఆటోమెషన్ సాఫ్ట్‌వేర్ యొక్క ప్రధాన ప్రొవైడర్,చిన్న,మధ్య తరహా కంపెనీల ఆర్థిక కార్యకలాపాలను సరళీకృతం చేయడానికి మరియు కనెక్ట్ చేయబడిన బ్యాంకుల అనుభవం ద్వారా వాటిని సజావుగా చేయడానికి రూపొందించబడినట్లు వెల్లడించారు.దాని తాజా వెర్షన్,టాలీ ప్రైమ్ 6.0ను అందిస్తుంది.ఈ అధునాతన అప్‌డేట్ కంపెనీలు మరియు అకౌంటెంట్ల కోసం బ్యాంకింగ్ సయోధ్య,బ్యాంకింగ్ ఆటోమేషన్ మరియు ఆర్థిక నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుంది.ఎలక్ట్రానిక్ ఇన్వాయిస్,ఎలక్ట్రానిక్ బిల్లుల ఉత్పత్తి మరియు జీఎస్టీ నెరవేర్పు వంటి అనుసంధాన సేవల పంపిణీలో అనుభవం ఆధారంగా,ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ సామర్థ్యాలతో అనుసంధానించడానికి మరియు సమానంగా లేకుండా సరళతతో పనిచేయడానికి వీలు కల్పించడం పట్ల టాలి నిబద్ధతను బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## పేదలకు పెన్షన్లు పంపిణీ

గుంటూరు విద్య,మే 18,ప్రభాతవార్త : స్థానిక అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో ఆదివారం ఆవోపా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 108మంది పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అవోపా రాష్ట్ర అధ్యక్షులు తటపర్తి రాంబాబు,విశిష్ట అతిథిగా



అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తటపర్తి రాంబాబు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెల 108మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.500లు చొప్పున పెన్షన్ ఇవ్వడం,విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం,ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు ఉచిత వసతి కల్పించి శిక్షణ అందిస్తున్నట్లు,జూలైలో రూ.50లక్షలను ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు,రాష్ట్ర వ్యాప్తంగా అవోపా యూనిట్ల ద్వారా విద్య,వైద్య ఉపాధి అందిస్తున్నట్లు తెలిపారు.విశిష్ట అతిథి రాచపూడి సుబ్బారావు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు అందించడం,ప్రతి వారం గో-సేవ నిర్వహించడం అభినందనీయమన్నారు.అవోపా మహిళా విభాగం అధ్యక్షులు చింత వసంత కల్పన మాట్లాడుతూ అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో త్వరలో మహిళలకు వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈనెల పెన్షన్‌కు రూ.60వేలు చలువాది ఆదినారాయణ విరాళం అందజేశారు.కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య,ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు,మద్ది సాయి రమేష్,పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు,మట్టుపల్లి రవికుమార్,నాళం కృష్ణకుమారి ,రంగా రత్నశ్రీ,మద్ది కోటి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విధానం జీవనశైలి కలిస్తేనే ఆయుర్వేదం


గుంటూరు కల్చరల్,మే 18,ప్రభాతవార్త : ఆయుర్వేదం అనేది ఒక వైద్యవిధానం మాత్రమే కాదని జీవనశైలి కూడా అని,శీరరం,మనస్సు మరియు ఆత్మ యొక్క సమతుల్యతను కాపాడంపై ఆయుర్వేదం దృష్టి పెడుతుందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్యసభలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పి.వి.నాగేంద్ర మాట్లాడుతూ అన్నారు.సంస్థ కార్యాలయంలో "ఆయుర్వేద వైద్య విధానం-సంపూర్ణ ఆరోగ్యం" అన్న అంశంపై సభ జరిగింది.సభకు ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అధ్యక్షత వహించారు.డాక్టర్ నాగేంద్ర తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వ్యాధుల మూలాలను తెలుసుకొని రోగ ఉపశమనం కన్న రోగ నివారణకే ప్రాధాన్యత ఇచ్చే ఆయుర్వేదం సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు సాదుతుందన్నారు.సమతుల్య ఆహారం,వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి ఆయుర్వేదం వివరిస్తుందన్నారు.ఆయుర్వేదం మందుల పేరుతో చాలా నకిలీలు,నాటుమందులు వస్తున్నాయని వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఆరోగ్యసభానంతరం డాక్టర్ నాగేంద్రను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.సభలో సంస్థ సభ్యులు ఏ.వి.రామారావు,ఎన్.సదాశివం తదితరులు ప్రసంగించారు.

19-5Pg5.qxd:19-5Pg5.qxd 01/01/01 7:11 AM Page 1



# భారత్ మామిడిపండ్లను తిరస్కరించిన అమెరికా!

## 15 కంటైనర్ల పండ్లను ధ్వంసంచేసిన ఎగుమతిదారులు



**లాస్ ఏంజెల్స్, మే 18:** భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయిన మామిడి పండ్లు పత్రాల్లో లోపాల కారణంగా తిరస్కరణకు గురయ్యాయి. సుమారు 15 కంటైనర్ల మామిడి పండ్లను అమెరికా అధికారులు వెనక్కి పంపారు. తప్పనిసరిగా చేయించాల్సిన ఇర్రేడియేషన్ ప్రక్రియకు సంబంధించిన డాక్యుమెంటేషన్‌లో పొరపాట్లు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ పరిణామంతో భారత ఎగుమతిదారులు సుమారు 5 లక్షల డాలర్లు అంటే దాదాపు రూ.4.15 కోట్లు నష్టపోయారని అంచనా. పండ్లను వెనక్కి రప్పించేందుకు అయ్యే ఖర్చు అధికంగా ఉండటంతో, వ్యాపారులు వాటిని అమెరికాలోనే ధ్వంసం చేయాల్సి వచ్చింది. లాస్ ఏంజెల్స్, శాన్ ఫ్రాన్సిస్కో, అట్లాంటా వంటి పలు అమెరికా విమానాశ్రయాల్లో ఈ మామిడి పండ్ల షిప్‌మెంట్లను నిలిపివేశారు. ఈనెల 8, 9 తేదీల్లో ముంబైలోని ఈ మామిడి పండ్లకు ఇర్రేడియేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. అయితే, ఈ ప్రక్రియకు సంబంధించిన పత్రాల్లో ముఖ్యంగా పీపీక్యూ203 ఫారంలో తప్పులు దొర్లాయని అమెరికా అధికారులు గుర్తించినట్లు తెలిసింది. పండ్లలో పురుగులు ఉన్నందువల్ల కాకుండా, కేవలం నిర్వాహణ లోపాల వల్లే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఇర్రేడియేషన్ అనేది పండ్లలోని కీటకాలను నిర్మూలించి, వాటి నిల్వ కాలాన్ని పెంచడానికి ఉపయోగించే ప్రక్రియ.

"పీపీక్యూ203 ఫారం సరిగ్గా జారీ చేయనందున" సరకును తిరస్కరించినట్లు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తమకు తెలిపిందని ఒక ఎగుమతిదారు వాపోయారు. సరకును వెనక్కి పంపాలి లేదా ధ్వంసం చేయాలి. దీనికి అయ్యే ఖర్చును అమెరికా ప్రభుత్వం భరించదు అని యూఎస్‌డీఏ స్పష్టం చేసినట్లు ఆయన తెలిపారు. నవీ ముంబైలోని ఇర్రేడియేషన్ కేంద్రంలో అమెరికా వ్యవసాయ విభాగం (యూఎస్‌డీఏ) ప్రతినిధి పర్యవేక్షణలోనే ఈ ప్రక్రియ జరుగుతుంది. అమెరికాకు మామిడి పండ్ల ఎగుమతికి అవసరమైన పీపీక్యూ203 ఫారంను కూడా ఆయనే ధ్రువీకరించాలి. ఇర్రేడియేషన్ కేంద్రంలో జరిగిన పొరపాట్లకు మేం నష్టపోవాల్సి వస్తోంది అని ఒక ఎగుమతిదారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల తొమ్మిది, 11 తేదీల మధ్య లాస్ ఏంజెల్స్ విమానాశ్రయంలో తన సరకును నిలిపివేసి, ఆ తర్వాత ధ్వంసం చేయాలని ఆదేశాలు అందుకున్న మరో ఎగుమతిదారు మాట్లాడుతూ, తప్పనిసరి ఇర్రేడియేషన్‌కు సంబంధించిన నిబంధనలు పాటించలేదని మాకు తెలిపారు. ఇది పూర్తిగా అవాస్తవం. ఇర్రేడియేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే మాకు పీపీక్యూ203 ఫారం ఇచ్చారు. యూఎస్‌డీఏ అధికారి జారీ చేసిన ఆ ఫారం లేకుండా ముంబై విమానాశ్రయంలో మామిడి పండ్లను విమానంలోకి ఎక్కించడానికి కూడా అనుమతించరని ఆయన అన్నారు. భారతదేశ మామిడి పండ్లకు అమెరికా ప్రధాన ఎగుమతి మార్కెట్ కావడంతో, ఈ ఘటన వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ సమస్యపై, ప్రభావితమైన మామిడి పండ్ల పరిమాణం, పత్రాల్లోని లోపాల గురించి అడిగినప్పుడు, వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ (అపెడా) ఢిల్లీ కార్యాలయం స్పందించారు. ఈ వ్యవహారం ముంబై వాషిలోని యూఎస్‌డీఏ మహారాష్ట్ర రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు (ఎంఎస్‌ఏఎంబీ) కేంద్రానికి సంబంధించినది. కాబట్టి దీనిపై వారిని వివరణ కోరాలని బదులిచ్చింది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ కింద అపెడా పనిచేస్తుంది. అయితే, ఈమెయిల్ ద్వారా వివరణ కోరినప్పటికీ ఎంఎస్‌ఏఎంబీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు.



## కాల్పుల విరమణకు స్పష్టమైన గడువు తేదీ ఏదీలేదు..

### భారత్ రక్షణశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ, మే 18:** భారతపాక్ మధ్య కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదని రక్షణ శాఖ వెల్లడించింది. కాల్పుల విరమణ అవగాహనకు గడువు ముగుస్తోందనే వార్తలను రక్షణ శాఖ వర్గాలు ఖండించాయి. ఈనెల 10న ప్రకటించిన కాల్పుల విరమణ అవగాహన మేరకే కొనసాగుతోందని స్పష్టంచేశాయి. ఆదివారం భారత్‌పాక్ డీజీఎంఓల చర్చల్లో తీసుకున్న నిర్ణయాలే కొనసాగుతాయని పేర్కొన్నాయి. 10వ తేదీన డీజీఎంఓల మధ్య జరిగిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాలకు కాలపరిమితి లేదని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం ఎలాంటి డీజీఎంఓ స్థాయి చర్చలు లేవని తెలిపాయి. అంతకుముందు మే 12న ఇరుదేశాల డీజీఎంఓల మధ్య చర్చలు జరగగా, అందులో ఇరుపక్షాలు ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు కాల్పులు జరపకూడదని నిర్ణయం తీసుకున్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని, శత్రుత్వ చర్యలు తీసుకోకూడదనే విషయాలకు కట్టుబడి ఉండాలనే దానిపై చర్చించారు. అదేవిధంగా సరిహద్దులు, ఫార్వర్డ్ బేస్ ప్రాంతాల్లో బలగాల తగ్గింపును పరిగణించాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. మరోవైపు ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన భారత సైన్యం వెస్టర్న్ కమాండ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేసింది. ఉగ్రవాదులు, పాకిస్థాన్ సైనిక స్థావరాలను ధ్వంసం చేసిన దృశ్యాలను అందులో పొందుపర్చింది. ఆపరేషన్ సిందూర్ పాక్‌పై ప్రతీకార దాడి కాదని పహల్గాం ఉగ్రదాడి బాధితులకు న్యాయం చేయడమేనని భారత సైన్యం పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి పర్యాటకులపై కాల్పులు జరిపారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరయ్యింది. ఈ దాడుల్లో సుమారు 100మందికి పైగా ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. అయితే, ఎదురు దాడులు చేసేందుకు దాయాది దేశం యత్నించినప్పటికీ భారత బలగాల దెబ్బకు తట్టుకోలేకపోయింది. చివరకు ఉద్రిక్తతలు తగ్గించాలని పాకిస్థాన్ కోరడంతో అందుకు భారత్ అంగీకరించడంతో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. పరిస్థితులు తీవ్ర రూపం దాల్చుతున్న వేళ ఇరు దేశాల మధ్య పరస్పర అవగాహనతో ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది.

# మలివిడత బెయిలౌట్ ప్యాకేజికి ఐఎంఎఫ్ సవాలక్ష షరతులు

**న్యూయార్క్, మే 18:** దాయాది దేశం పాకిస్థాన్‌కు బిగ్ షాక్. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్‌పై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ఫుల్ ఫోకస్ చేసింది. ఈ క్రమంలో పాకిస్థాన్ తన బెయిలౌట్ ప్రోగ్రామ్ మలి విడత విడుదల కోసం 11 కొత్త షరతులను విధించింది. ఈ పథకం ఆర్థిక, బాహ్య, సంస్కరణ లక్ష్యాలకు గణనీయమైన ప్రమాదాలను పెంచుతాయని ఐఎంఎఫ్ హెచ్చరించింది. పాకిస్థాన్‌పై విధించిన కొత్త షరతులలో రూ.17.6 ట్రిలియన్ల బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం, విద్యుత్ బిల్లులపై రుణ సేవల సర్ ఛార్జ్ పెంపు, మూడేళ్లకు మించి ఉపయోగించిన కార్లను దిగుమతి చేసుకోవడంపై ఉన్న పరిమితులను తొలగించడం సహా 11 షరతులు ఉన్నాయి. తాజాగా విధించిన షరతులతో ఐఎంఎఫ్ పాక్‌కు విధించిన షరతుల



సంఖ్య 50కి చేరింది. గత రెండు వారాల్లో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు గణనీయంగా పెరిగాయి. స్టాక్ మార్కెట్ లాభాల్లో ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి పాక్ రక్షణ బడ్జెట్ రూ.2.414 ట్రిలియన్లుగా ఉంది. ఇది గతేడాది పోలిస్తే రూ.252 బిలియన్లు లేదా 12శాతం ఎక్కువ. మే ప్రారంభంలో భారత్‌తో ఘర్షణ తర్వాత పాక్ సర్కార్ రూ.2.5 ట్రిలియన్లు లేదా 18శాతం ఎక్కువ బడ్జెట్ కేటాయించనుందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. 2025 జూన్ నాటికి ఐఎంఎఫ్ ఒప్పందానికి అనుగుణంగా వచ్చే ఆర్థికబడ్జెట్‌ను పార్లమెంట్ ఆమోదించాలి. అలాగే ఫెడరల్ బడ్జెట్ మొత్తాన్ని రూ.17.6 ట్రిలియన్లుగా అంచనా వేసింది ఐఎంఎఫ్. ఇందులో అభివృద్ధి వ్యయం కోసం కేటాయించిన రూ.1.07 ట్రిలియన్లు ఉంది. నాలుగు ప్రావిన్సులు కొత్త వ్యవసాయ ఆదాయపు పన్ను చట్టాలను అమలు చేయాలి. పన్ను రిటర్న్ ప్రాసెసింగ్, పన్ను చెల్లింపుదారుల గుర్తింపు, నమోదు, కమ్యూనికేషన్ క్యాంపెయిన్, సమ్మతిని మెరుగుపరచడానికి వ్యూహాల కోసం ఒక కార్యాచరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. ఐఎంఎఫ్ సూచించిన గవర్నెన్స్ డయాగ్నొస్టిక్ అసెస్మెంట్ ఆధారంగా ప్రభుత్వ బలోపేతానికి చేపట్టే యాక్షన్ ప్లాన్‌ను ప్రభుత్వం రూపొందించాలి. అంతేకాకుండా 2027 తర్వాతి ఆర్థిక రంగ వ్యూహాన్ని వివరించే ప్రణాళికను సిద్ధం చేయాలి. అలాగే ఇంధన రంగంలో నాలుగు కొత్త షరతులను విధించింది. ఇంధన సుంకాలను కాస్ట్ రికవరీ స్థాయిలలో నిర్వహించడానికి ప్రభుత్వం ఈ ఏడాది జులై 1 నాటికి వార్షిక విద్యుత్ సుంకాల పునర్వ్యవ స్థీకరణ నోటిఫికేషన్‌లను జారీచేయాలి. 2035 నాటికి ప్రత్యేక సాంకేతిక జోన్లు, ఇతర పారిశ్రామిక ప్రాంతాలకు సంబంధించిన అన్ని ప్రోత్సాహకాలను తొలగించడానికి ప్రభుత్వం ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని ఐఎంఎఫ్ షరతులు విధించింది.



## భారత్ విదేశాంగ శాఖ స్పష్టీకరణ

# రాహుల్ వ్యాఖ్యలు తప్పుదారిపట్టించేవిగా ఉన్నాయి

**న్యూఢిల్లీ, మే 18:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై గురిపెట్టిన విషయాన్ని ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టడానికి ముందే కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌కు సమాచారం అందించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఇదే విషయంపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఫై ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసిన విషయాన్ని పాక్‌కు తెలియజేయడానికి ప్రయత్నించామని తెలిపారు. పాక్ లోని ఉగ్రవాద శిబిరాలపై దాడిచేసిన విషయాన్ని పాకిస్థాన్ డీజీఎంఓకు తెలియజేశాం. ఈ చర్యను పాకిస్థాన్ తిరస్కరించింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన వెంటనే పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిన విషయాన్ని చెప్పేందుకు ప్రయత్నించామని, పాకిస్థాన్ ఈ విషయంపై తీవ్రంగా స్పందించిందని డీజీఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఫై వ్యాఖ్యానించారు. అంతకుముందు పాక్ ఉగ్రవాద వ్యవస్థలపై గురిపెట్టిన విషయాన్ని ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టడానికి ముందే కేంద్ర సర్కారు ఆ దేశానికి చెప్పి తప్పు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

పాక్‌పై దాడి గురించి ఆ దేశానికి ముందే సమాచారం ఇవ్వడం నేరం. కేంద్ర ప్రభుత్వం ఇదే పని చేసిందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బహిరంగంగా అంగీకరించారు. వారికి అలా వెల్లడించడానికి ఎవరు అధికారం ఇచ్చారు. దాని ఫలితంగా ఈ ఆపరేషన్లో భారత వాయుసేన ఎన్ని విమానాలు కోల్పోయిందో చెప్పాలని రాహుల్ సోషల్‌మీడియాలో ప్రశ్నలు గుప్పించారు. దీనికి జైశంకర్ వ్యాఖ్యల వీడియోను జోడించారు. అయితే రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఈ వ్యాఖ్యలు వాస్తవాలను పూర్తిగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ మొదలైన తొలి దశలో చేసిన హెచ్చరికను, ఆపరేషన్‌కు ముందు చేసినట్లు ఆరోపించడం తప్పుడు వ్యాఖ్యగా తెలిపింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట వైమానిక దాడులు జరిపింది. టెర్రర్ గ్రూప్స్ లష్కరే తోయిబా, జైషే మహ్మద్ స్థావరాలపై విరుచుకుపడింది. దీంతో దాదాపు 100 మంది ముష్కరులు హతమయ్యారు. ఆ తర్వాత పాక్ కూడా భారత్‌పై క్షిపణ దాడులు చేసేందుకు ప్రయత్నించగా, ఇండియన్ ఆర్మీ తిప్పికొట్టింది. ఆ తర్వాత ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.

## సరిహద్దుల్లో సైనిక ఆపరేషన్

# పేలని పాక్ బాంబులు, గ్రెనేడ్లను నిర్వీర్యంచేసిన దళాలు

**అఖ్నూర్(జమ్ము), మే 18:** పాకిస్థాన్‌తో సైనిక ఉద్రిక్తతలు తగ్గిన నేపథ్యంలో సైన్యం సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తోంది. స్థానికుల భద్రతకు ప్రమాదకరంగా మారిన పేలని బాంబులు, ఆర్టిలరీ షెల్స్‌ను, గ్రెనేడ్లను నిర్వీర్యం చేస్తోంది. పహల్గాంలో 26మంది పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈనెల 7న సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9ఉగ్ర స్థావరాలపై దాడులు జరిపింది. ఆ తర్వాత పాక్ రేంజర్లు నియంత్రణ రేఖతోపాటు, అంతర్జాతీయ సరిహద్దు వెంట పెద్దఎత్తున షెల్లింగ్‌కు పాల్పడ్డారు. జనావాసాలపై పెద్దఎత్తున దాడులకు పాల్పడ్డారు. వాటిని సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. అయితే పాకిస్థాన్ రేంజర్లు జరిపిన దాడుల్లో కొన్ని ఆర్టిలరీ షెల్స్, గ్రెనేడ్లు, బాంబులు పేలలేదు. వాటిలో కొన్ని నివాస ప్రాంతాలు, పంట పొలాల్లో పడ్డాయి. అవి స్థానికుల భద్రతకు ప్రమాదకరంగా మారాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంట ఉన్న అఖ్నూర్ సెక్టార్‌లో సైన్యం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. పేలని బాంబులు, ఆర్టిలరీ షెల్స్, గ్రెనేడ్లను నిర్వీర్యం చేస్తోంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మొత్తం 16 షెల్స్‌ను సైన్యం నిర్వీర్యం చేసింది. అఖ్నూర్‌లో పెద్దఎత్తున బాంబు దాడులు జరిగాయి. షెల్స్ ఇళ్ల ముందూ, వెనుకా పడ్డాయి. కొన్ని పొలాల్లో పడ్డాయి. పేలనివి అలాగే ఉండిపోయాయి. వాటిని నిర్వీర్యం చేసేందుకు జమ్మూ నుంచి సైన్యం వచ్చింది. అఖ్నూర్‌కు ఓ బృందం వచ్చింది. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు పొలాలకు వెళ్లిన సైన్యం వాటిని నిర్వీర్యం చేస్తోందని స్థానికులు చెప్పారు. పాకిస్థాన్ వైపు నుంచి పెద్దఎత్తున కాల్పులు జరిగాయి. పెద్దపెద్ద షెల్స్ పడ్డాయి. వాటిలో కొన్ని పేలలేదు. జమ్మూ నుంచి సైనిక బృందం వచ్చింది. పేలని బాంబులను నిర్వీర్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు పది బాంబులను నిర్వీర్యం చేశారు. తమమ భద్రతకు ప్రమాదకరంగా మారిన షెల్స్‌ను నిర్వీర్యం చేసిన సైన్యానికి అఖ్నూర్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు తాము నిశ్చింతగా ఉండొచ్చని సంతోషం వ్యక్తం చేశారు. లేకుంటే ఎక్కడ, ఎప్పుడు ఏ బాంబు పేలుతుందో అనే భయంతో రోజులు గడపాల్సి వచ్చేదని స్థానికులు తెలిపారు.


# పాకిస్థాన్‌లో తీవ్రమౌతున్న ఆహార సంక్షోభం

## 11 మిలియన్ల మందికి దక్కని పౌష్టికాహారం

**న్యూయార్క్, మే 18:** పాకిస్థాన్ తీవ్ర ఆహార సంక్షోభంలో ఉందని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ఆహార, వ్యవసాయ సంస్థ నివేదికలో తేలింది. 11 మిలియన్ల మందిపై ఈ ఆహార కొరత ప్రభావం ఉంటుందని అంచనా వేసింది. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి వరకు పాక్‌లో అధిక స్థాయిలో ఆహార సంక్షోభం కొనసాగిందని వెల్లడైంది. ఆహార సంక్షోభాలపై ప్రపంచ నివేదికను ఎఫ్ఏఓ విడుదల చేసింది. దీని ప్రకారం బలూచిస్థాన్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా వంటి వరద ప్రభావిత జిల్లాల్లో 11 మిలియన్ల మంది లేదా జనాభాలో 22శాతం మంది తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటారని అంచనా. ఇందులో 1.7 మిలియన్ల మంది పరిస్థితి మరింత దారుణంగా ఉందని తేల్చింది. 2024 గరిష్ఠ స్థాయి ఆహార కొరతతో పోలిస్తే 2025లో మరో 38 శాతం పెరిగే అవకాశం ఉంది. గతేడాది పోలిస్తే ఆహార కొరత తగ్గినప్పటికీ వాతావరణ పరిస్థితులు ప్రజల జీవనోపాధిని ప్రభావితం చేస్తాయి. 2023 నవంబర్ నుంచి 2024 జనవరి మధ్య 11.8



మిలియన్ల ప్రజలు అధిక స్థాయిలో తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొన్నారు. 2023 మార్చి 2024 జనవరి వరకు 6 నుంచి 59 నెలల వయసు గల 2.1 మిలియన్ల మంది పిల్లలు పోషకాహార లోపంతో ఇబ్బందిపడుతున్నారు. గర్భిణీలు, పాలిచ్చే బాలింతల్లో పోషకాహార లోపం ఎక్కువగా ఉంది. అలాగే సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వాలో చాలా మంది చిన్నారులు తక్కువ బరువుతో జన్మిస్తున్నారు. శీతాకాలంలో విరేచనాలు, తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, మలేరియాతో బాధపడుతున్నారు. పారిశుద్ధ్య సౌకర్యాలు, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఎఫ్ఏఓ తన నివేదికలో తెలిపింది.



# విస్తరిస్తున్న కొత్త కరోనా

## పెరుగుతున్న కేసులు..కొత్త వ్యాక్సిన్‌కు ఆమోదం!

**న్యూఢిల్లీ, మే 18:** ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆసియా దేశాల్లో (హాంకాంగ్-సింగపూర్) పెరుగుతున్న కరోనా కేసులు ఆరోగ్య నిపుణుల్లో ఆందోళనను రేకెత్తించాయి. గత కొన్ని వారాల్లో కరోనా కేసులు గణనీయంగా పెరిగాయని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. కరోనా ఇన్ఫెక్షన్ కేసులు పెరగడమే కాకుండా చాలాచోట్ల ఆస్పత్రుల్లో చేరే రోగుల సంఖ్య పెరిగింది. ఈ పెరుగుతున్న కేసులకు కొత్త వేరియంట్ కారణమని ఇప్పటివరకు నిపుణులు ప్రకటించలేదు. అయితే, వ్యాక్సిన్ రోగ నిరోధక శక్తి తగ్గుతోందని, ఫలితంగా వైరస్ ప్రభావం మరోసారి కనిపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తుగా కరోనాకు బూస్టర్ వ్యాక్సిన్ తీసుకోవాలనిఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా రక్షణ ఉంటుందన్నారు. గతంలో ఫ్లూ మాదిరిగానే కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలని పలు ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం హాంకాంగ్, సింగపూర్ వంటి నగరాల్లో ఆస్పత్రిలో చేరడం, మరణాలతోపాటు కొత్త కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఆరోగ్య సంస్థలు ప్రజలను అప్రమత్తం చేశాయి. మరోవైపు పెరుగుతున్న ముప్పు మధ్య యుఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) నోవావాక్స్ కొత్త వ్యాక్సిన్‌ను ఆమోదించింది. అమెరికాకు చెందిన నెబ్రాస్కా మెడిసిన్‌లో అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ మార్క్ ఇ రూప్ మాట్లాడుతూ ప్రస్తుతం అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఎల్‌పి 8.1వేరియంట్ ద్వారా కేసులు పెరుగుతున్నాయన్నారు. 70శాతం కేసులకు ఈ వేరియంట్ కారణమని 9శాతం కేసులకు ఎక్స్ఎఫ్‌సి వేరియంట్ కారణమన్నారు. కాలక్రమేణా ప్రజల రోగనిరోధక శక్తి బలహీనపడడం వల్ల వైరస్ మరింత సులభంగా వ్యాపిస్తుందని పలు నివేదికలు పేర్కొన్నాయి.

# మెరైన్ ఉత్పత్తుల్లో నాలుగో అతిపెద్ద దేశంగా భారత్

**న్యూఢిల్లీ, మే 18:** దేశ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి తయారీ రంగానికి ప్రాధాన్యత ఉన్న చోట ప్రోత్సహిస్తోంది. మరోవైపు, ఎగుమతులను పెంచడంపై ప్రభుత్వం వేగంగా కృషి చేస్తోంది. అటువంటి పరిస్థితిలో, ప్రభుత్వం పడిన కష్టానికి ఇప్పుడు ఫలితం కనిపిస్తోంది. ఇప్పుడు, ఎగుమతులకు సంబంధించి భారతదేశానికి వచ్చిన వార్తలను బట్టి, ప్రపంచ స్థాయిలో భారతదేశం తన బలాన్ని అమాంతం పెంచుకుంటోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతి పరంగా ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద దేశంగా అవతరించింది. భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులలో నాల్గవ అతిపెద్దదిగా అవతరించింది. 2014-15లో 105 దేశాలు భారతీయ సముద్ర ఉత్పత్తులను దిగుమతి చేసుకోగా, 2025 ఆర్థిక సం



వత్సరంలో 130 దేశాలు పెరిగాయని వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024-25లో, భారతదేశం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటి) సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 201415లో ఇది 10.51 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఆక్వాకల్చర్ పద్ధతుల్లో పురోగతి, మెరుగైన కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ నాణ్యత నిబంధనలకు కట్టుబడి ఉంది. దీంతో దేశ సముద్ర ఎగుమతులు 2015 ఆర్థిక సంవత్సరంలో 5.4 బిలియన్ల నుండి 2024-25 నాటికి 7.2 బిలియన్లకు పెరుగుతాయని అంచనా. ఎగుమతి గమ్యస్థానాలు ఈ వైవిధ్యీకరణ మార్కెట్ నష్టాలను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వృద్ధికి అవకాశాలను తెరుస్తుందని ఆయన అన్నారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం ర్యాంకింగ్ 2014-15లో ఎనిమిదవ స్థానం నుండి నాలుగు స్థానాలు మెరుగుపడింది. ఇది ప్రపంచ మార్కెట్‌లో దాని పెరుగుతున్న పోటీతత్వాన్ని, విశ్వసనీయతను సూచిస్తుంది. ఈ కాలంలో 3.15 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటుతో, భారతదేశం ప్రపంచ సగటు వృద్ధి రేటు 2.7 శాతం కంటే ముందుంది, అంతర్జాతీయ మత్స్యరంగంలో దాని వృద్ధి స్థానాన్ని మరింత బలోపేతం చేసింది.



# అమెరికాలో టోర్నడోల బీభత్సం

**మిస్సోరి, మే 18:** అమెరికాలోని లారెల్ కౌంటీలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో టోర్నడో బీభత్సం సృష్టించింది. దీంతో సుమారు 21 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల కోసం రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ తుఫాన్, టోర్నడోల ఎఫెక్ట్‌తో ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఎమర్జెన్సీ ప్రకటించారు. భారీ ఈదురుగాలతో స్థంభాలు విరిగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. మిస్సోరిలో, కెంటకీ రాష్ట్రాల్లో శుక్రవారం టోర్నడోలు బీభత్సం సృష్టించడంతో భారీగా ప్రాణనష్టం జరిగింది. కొన్ని నివేదకల ప్రకారం రద్దీగా ఉండే రహదారిపై ఈ టోర్నడోలు ప్రారంభమై నగరంలో 20 చదరపు బ్లాక్‌ల ప్రాంతంలో విధ్వంసం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ కారణంగా మిస్సోరీలో ఐదువేల భవనాలకుపైగా దెబ్బతిన్నాయని మేయర్ కారా తెలిపారు. స్కాట్ కౌంటీలోనూ టోర్నడోల బీభత్సంలో ఇద్దరు మరణించడంతో పాటు అనేక ఇళ్లు ధ్వంసమైనట్టు తెలుస్తోంది. ఇవే కాకుండా ఇల్లినోయిలో కూడా టోర్నడోలు బీభత్సం సృష్టిస్తున్నట్టు యూఎస్ నేషనల్ వెదర్ సర్వీస్ తెలిపింది.

# లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ ఖతం

**న్యూఢిల్లీ :** పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ హతమయ్యాడు. ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు సైఫుల్లా ఖలీద్‌ను మట్టుబెట్టినట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఇండియాలో జరిగిన మూడు ఉగ్రదాడుల్లో సైఫుల్లా ఖలీద్ కీలకంగా వ్యవహరించాడు. 2001లో రాం పూర్‌లోని సీఆర్పీఎఫ్ క్యాంపుపై దాడి చేశాడు. బెంగళూరులో 2005లో నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో దాడులకు పాల్పడ్డాడు. 2006లో నాగ్‌పూర్‌లోని ఆర్ ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడడంలో కీలకంగా వ్యవహరించాడు సైఫుల్లా ఖలీద్. ఐదేండ్ల వ్యవధిలోనే జరిగిన ఈ దాడుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక ఖలీద్ నేపాల్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. అక్కడ వినోద్ కుమార్ పేరుతో తప్పుడు ధృవ పత్రాలు సృష్టించి, స్థానిక మహిళ నగ్మా బానును వివాహం చేసుకున్నాడు. లష్కరే తోయిబా కార్యకలాపాలను నేపాల్ నుంచే ఖలీద్ సమన్వయం చేసినట్లు సమాచారం. ఇటీవల ఖలీద్ తన స్థావరాన్ని పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్ బాదిన్



జిల్లాలోని మట్లీకి మార్చాడు. లష్కరే తోయిబాతో పాటు దాని ప్రధాన సంస్థ జమాత్‌ఉద్ దవా కోసం ఖలీద్ పని చేస్తున్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలతోపాటు నియామకాలు, నిధుల సేకరణపై సైఫుల్లా దృష్టి సారించాడు.

# ప్రపంచదేశాలకు మేం కూడా పంపిస్తున్నాం..



## భారత్‌ను కాపీకొడుతున్న పాకిస్థాన్

**ఇస్లామాబాద్, మే 18:** ఆపరేషన్ సిందూర్‌తో చావుదెబ్బ తిన్న పాకిస్థాన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూనే ఉంది. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమనే సందేశాన్ని ప్రపంచ దేశాలకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం ఏడు బృందాలను విదేశాలకు పంపాలని నిర్ణయం తీసుకోవటంతో పాకిస్థాన్ కూడా తమ ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆలోచిస్తోంది. పాకిస్థాన్ ప్రతినిధి బృందానికి సారథ్యం వహించాలని విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టోను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కోరారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో బిలావల్ పోస్టు పెట్టారు. అంతర్జాతీయ సమాజానికి పాకిస్థాన్ వైఖరిని వివరించే బృందానికి నాయకత్వం వహించాలని ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కోరగా అంగీకరించాను. నాపై పెట్టినబాధ్యతలనునిర్వర్తిస్తాను. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో దేశానికి సేవ చేసేందుకు సిద్ధంగాఉన్నానని భుట్టో పోస్ట్ చేశారు.

# పూరీ జగన్నాథుని మహాప్రసాదానికి అపచారం

## డైనింగ్‌టేబుల్‌పై కూర్చుని తిన్న విడియో వైరల్

**పూరి, మే 18:** పూరీ జగన్నాథ ఆలయానికి చెందిన మహాప్రసాదాన్ని ఒక కుటుంబం డైనింగ్ టేబుల్‌పై కూర్చుని తింటున్న వీడియో వివాదానికి దారితీసింది. పూరీ జగన్నాథుడికి సమర్పించబడిన పవిత్ర ఆహారం మహాప్రసాదం, దీనిని సాంప్రదాయకంగా నేలపై కూర్చుని తింటారు. పూరీలోని ఒక బీచ్ రిసార్ట్‌లో డైనింగ్ టేబుల్ వద్ద పూజారి మహాప్రసాదం వడ్డిస్తుండగా పిల్లలతో సహా కనీసం 10 మంది కుటుంబ సభ్యులు తింటూ కనిపించారు. ఒక వ్యక్తి వారిని మహాప్రసాదం అలా తినకూడదు అని వారించారు. పూజారి మీరు అలా ఎందుకు



వడ్డిస్తున్నారంటూ ప్రశ్నించాడు. ఈ వీడియో వైరల్ అవ్వడంతో జగన్నాథభక్తులలో ఆందోళనలు తలెత్తడంతో ఆలయ అధికారులు టేబుల్ వద్దమహాప్రసాదంతినడం సంప్రదాయానికి విరుద్ధమని పేర్కొంటూ ప్రకటన విడుదల చేశారు.

19-5Pg6exHMNWJQE.qxd:19-5Pg6exHMNWJQE.qxd 01/01/01 7:55 AM Page 1





మురళినాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్

## మురళినాయక్‌కు పరమవీరచక్రకై ప్రతిపాదనలు పంపుతాం

### పెద్దకర్మ కార్యక్రమంలో మహారాష్ట్ర నీటిపారుదల మంత్రి సంజయ్‌రాథోడ్

**గోరంట్ల, మే 18 ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రమూకలను అంతమొందించడానికి ప్రారంభించిన ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన బంజారా బిడ్డ మురళినాయక్‌కు కేంద్ర ప్రభుత్వం నుండి పరమవీరచక్ర బిరుదు అందే విధంగా మహారాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిపాదనలు పంపుతామని మహారాష్ట్ర నీటిపారుదల శాశా మంత్రి సంజయ్‌రాథోడ్ పేర్కొన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన మురళినాయక్ పెద్దకర్మ కార్యక్రమానికి ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని కల్లితండాలోని వీర జవాన్ మురళి నాయక్ నివాసానికి మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్‌తో పాటు ప్రఖ్యాత తెలంగాణ సింగర్ మంగ్లీ, కర్ణాటకకు చెందిన కేంద్ర మాజీ మంత్రి చౌహాన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళి నివాసంలో వారు మురళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జోహార్లు పలికారు. అనంతరం మహారాష్ట్ర మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి తాండాలోనూ మురళి చిత్రపటాలకు గిరిజనులు నివాళులు అర్పిస్తున్నారని దేశవ్యాప్తంగా బంజారాలు మురళి కుటుంబానికి అండగా వుంటున్నారని పేర్కొన్నారు. మురళి కుటుంబీకులు గతంలో ముంబై నగరంలో కొన్నేళ్లపాటు నివాసముండే వారని ఇప్పటికీ వారి సమీప బంధువులు అక్కడే వుంటున్నారని మురళి కుటుంబ సభ్యులను మేము స్థానికులుగా భావించి మా ప్రభుత్వం వారికి అండగా వుంటుందని అన్ని రకాల సహాయ సహకారాలు అందచేస్తామని తెలిపారు. అనంతరం మురళి అంత్యక్రియలు నిర్వహించిన సమాధి వద్దకు వెళ్లి అక్కడ నివాళులర్పించి జోహార్లు పలికారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సిఐ బోయశేఖర్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, బంజారా సంఘం రాష్ట్ర నాయకులు శంకర్‌లాల్‌నాయక్, గంపల రమణారెడ్డి, పుడగుండ్లపల్లి శివారెడ్డి, చింతా రామచంద్రారెడ్డి, గోరంట్ల జెడ్‌పిటిసి పాలే జయరాంనాయక్, నాగేనాయక్, సర్పంచు వాసునాయక్, రాజేష్‌నాయక్, మాజీ సర్పంచు రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారం

**శ్రీశైలంప్రాజెక్టు,మే18,ప్రభాతవార్త:** శ్రీశైలక్షేత్రంలో భ్రామరి పుష్పవనం సమీపంలో అదివారంనాడు పెద్ద పులి ప్రత్యక్షం అయింది. డంపుయార్డు దగ్గర జెసిపితో భూమి చదును చేస్తుండడంతో అక్కడ పనిచేస్తున్న కూలిల కంటపడడంతో జెసిపి డ్రైవర్ దగ్గర ఉన్న చరవాణిలో రికార్డు చేయడం జరిగింది. పులి అకస్మాత్తుగా వారి కంటపడడంతో ఒకింత భయోదళనకు గురిఅయా ్యరు. కూలిల కదలికలను పసిగట్టిన పెద్దపులి కొంచం సేపు అటుఇటు తిరిగి తిరిగి అటవిప్రాంతంలోకి పోవడం జరిగింది. ఈ నేపధ్యాంలోనే పెద్ద పులి సంచారంతో స్థానికుల్లో భయోంధళన మొదలైంది. గతంలో కూడా శ్రీశైలంలో నివాసం ఉండే ఓ పూజారి ఇంట్లోకి కూడా చిరుతపులి వచ్చిన సంగతి సిసి కేమేరాల్లో రికార్డు అయిన సంగతి పాఠకులకు విధితమే. పులి సంచారంపై



విషయం తెలుసుకున్న స్థానిక అటవిశాఖ అధికారులు అప్రమత్తం అయి సంఘటన స్థలికి చేరుకోని పెద్దపులి ఎక్కడి నుండి వచ్చింది ఎటు వైపు మరల వెళ్లింది అని విషయంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరుగుతుంది. పులి సంచా రంతో స్థానికులు కూడా ఏవ్వరు కూడా అటవిప్రాంతం వైపు వెళ్లవద్దు అని స్థానికులకు అటవిశాఖ అదికారులు అప్రమత్తం చేయడం జరుగుతుంది. జనసంచారంలోకి రాకుండా అటవిశాఖ అధికారులు చర్యలకు సిద్దమవుతున్నారు.

## కాణిపాకంలో భక్తుల వేసవి రద్దీ

### దర్శనానికి నాలుగు గంటల సమయం



**కాణిపాకం, మే 18 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయంలో ఆదివారం భక్తుల వేసవి రద్దీతో కిటకిటలాడింది. సాధారణంగా ఆలయం లో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో పాటు విద్యాసంస్థలు, పాఠశాలలకు సెలవులు కావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ కొనసాగుతోంది.

రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు

## మావోలతో కేంద్రం చర్చలు జరపాలి: జస్టిస్ చంద్రకుమార్

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** పాకిస్థాన్‌తో చర్చలకు సిద్దమైన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రశ్నించారు. ఏపీ పీస్ కమిటీ ఆద్వర్యంలో ఆయన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎవరిదైనా ప్రాణమేనని పోలీసు లైనా, మావోయిస్టులైనా ఎవరూ చనిపోకూడదని చెప్పారు. ప్రాణనష్టం నివారించడానికే మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. మావోయిస్టులతో చర్చలు జరపబోమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించడం సరికాదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్చలు జరిపి, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు అరసవిల్లి కృష్ణ , పిచ్చుక శ్రీనివాస్, టి.ఆంజనే యులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలు, ఉద్యోగుల ఫంక్షనరీలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్దీకరణలో భాగంగా స్పెసిఫిక్ పర్పస్ ఫంక్షనరీలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 10న జనరల్ పర్పస్ ఫంక్షనరీలను ప్రభుత్వం కేటాయించింది. అప్పట్లోనే టెక్నికల్ ఫంక్షనరీలకు సంబంధించి విడిగా మార్గదర్శకాలు జారీ చేస్తామని వెల్లడించింది. తాజా ఉత్తర్వులతో సచివాలయాల్లో ఉద్యోగుల హేతుబద్దీకరణ ప్రక్రియ దాదాపుగా చివరి దశకు చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇప్పటివరకు 8 నుంచి 12 మంది చొప్పున ఉద్యోగుల ఉన్నారు. కొన్నిచోట్ల స్థానిక ప్రజల అవసరాలకు మించి ఎక్కువ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరికొన్ని చోట్ల తక్కువ ఉన్నట్లు తేల్చారు. ప్రజలకు నిర్దేశించిన సేవలను సకాలంలో అందించేందుకు జనాభా ఆధారంగా సచివాలయాలను ఉద్యోగుల ను విభజించాలని నిర్ణయించి ఆ మేరకు ప్రభు త్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కలెక్టర్లు తదుపరి చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచి వా లయాల శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఆదేశించారు.

## దౌత్యపరంగా పాక్‌ను ఎండగట్టాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ,రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్

**తిరుపతి, మే 18ప్రభాతవార్తప్రతినిధి:** దౌత్యపరంగా పాక్‌ను ఎండగట్టే ప్రయత్నం చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం అనేక ప్రశ్నలకు జవాబుచెప్పాలన్నారు. ఉన్న ఫళంగా అగ్రదేశం ప్రకటనతో సీజ్‌ఫైర్‌కు కేంద్రం ఆమోదించడంవెనుక ఇంకా అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. దౌత్యపరంగా పాక్‌పైచర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రమూకలకు, పాకిస్తాన్ కు సంబంధం లేదని తేలితే వారితో కలసి ఆ దేశంలోకి నేరుగావెళ్ళి ఉగ్రవాదులను పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడురోజుల ఏఐవైఎఫ్ జాతీయ సదస్సులో చివరగాఆదివారం సాయంత్రం సిపిఐ నారాయణ, సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పాక్‌తో సీజ్ ఫైర్ విషయంలో అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. ఉగ్రమూకల వ్యవహారంలో పాక్ అనుసరిస్తున్న తీరును ప్రపంచ దేశాలకు వివరించే క్రమంగా కేంద్రం ప్రకటించిన కమిటీల్లో బిజెపి ఏకపక్షనిర్ణయాలు, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పి.హరినాధరెడ్డి, జిల్లా కార్యదర్శిపి.మురళి తదితరులు పాల్గోన్నారు.

## మినీ మహానాడుకు విశేష స్పందన

**నెల్లూరు, మే 19, ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరు గోమతీనగర్‌లో జరిగిన సిటీ నియోజకవర్గ మినీ మహానాడుకు విశేష స్పందన లబించింది. నగర నలుమూలల నుండి తరలివచ్చిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. పసుపుమయంగా మారిన మినీ మహానాడు ప్రాంగణం. తెలుగుతమ్ముళ్లలో నూతన జోష్ నింపింది. పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి నారాయణ. జ్యోతిప్రజ్వలన చేసి పార్టీ జెండా ఆవిష్కరించారు. మినీ మహానాడులో అభివృద్ది పనులపై ఏడు ప్రతిపాదనలు చేశారు.. పొంగూరు షరిణి మాట్లాడుతూ కార్యకర్తల శ్రమతోనే టీడీపీ గెలుపు సాధ్యమైందన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా మా అందరి సహకారంతో నెల్లూరును స్మార్ట్ సిటీగా మారుస్తామన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారన్నారు. చంద్రబాబు పాలనలో సింహపురికి మంచి రోజులు వచ్చాయన్నారు.

డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ అవసరం తీరాక గాలికి వదిలేస్తారు, అండగా నిలిచిన కార్యకర్తలకు సంవత్సరానికి పది కోట్ల సొంత నిధులు ఇస్తున్న గొప్ప వ్యక్తి




మినీ మహానాడులో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నారాయణ అన్నారు. కార్యకర్తలు ఆర్ధికంగా ఎదిగేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారన్నారు.

నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నారాయణతో నాకు 30 ఏళ్ల పరిచయం ఉంది. ఆయన ఇంత గొప్ప నాయకులు అవుతారని అనుకోలేదన్నారు. రాష్ట్రాన్ని దోచుకొని వైఎస్సార్‌సీపీ అప్పుల పాలు చేసి వెళ్ళిందన్నారు. రాష్ట్రానికి ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆపద్బాంధవుడిగా మారారన్నారు. ఆయన పాలనలో అన్ని వ్యవస్థలు గాడిన పడతాయి. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ కార్యకర్తలంటే మంత్రి నారాయణకు సైనికులతో సమానం అన్నారు. మినీ మహానాడులో చేసిన ప్రతిపాదనలన్నీ అమలు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, సిటీ టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, కార్పొరే టర్లు, నాయకులు, ప్రెసిడెంట్లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## విఆర్‌సి ఆధునీకరణ పనులు పరిశీలించిన మంత్రి నారాయణ

**నెల్లూరు, మే 19, ప్రభాతవార్త-వైద్యం:** వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులను రాష్ట్ర పట్టణ, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె షరణితో కలిసి పరిశీలించారు. హైస్కూల్‌లో ఏర్పాట్లపై ఇండోర్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటుపై పొంగూరు షరిణి పలు సూచనలు ఇచ్చారు. ప్లే గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణంలో మార్పులు చేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ కుమార్తె షరిణి మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా మూతబడ్డ వీఆర్ హైస్కూల్‌పై మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి పెట్టారని, దేశంలోనే మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. పిల్లలకి చదువులతో పాటు ఆటలు కూడా ముఖ్యమన్నారు. ఆహ్లాదభరిత వాతావరణం ఉంటే పిల్లలు చదువుల్లో రాణించగలరని, పాఠశాల అంటే అన్ని సౌకర్యాలు, సదుపాయాలు ఉండాలన్నారు. అందుకు తగ్గట్టుగా వీఆర్ హైస్కూల్ సిద్దమవుతుందని తెలిపారు. జూన్ 12వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్న పీ-4 కింద కుమార్తె షరిణి కూడా కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకొంటానని చెప్పారు.



అనంతరం మంత్రి నారాయణ మాట్లాడారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మంత్రి లోకేష్ ఆమోదంతో రూ.15కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టామని, ఎన్సెప్పీ ఆధ్వర్యంలో పనులు చకచకా సాగుతున్నాయన్నారు. నిరుపేద పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసేలా స్కూల్‌ని డిజైన్ చేశామన్నారు. ఏడాదికి వెయ్యి మంది చొప్పున ఐదేళ్లలో ఐదు వేల మంది పేద పిల్లలకి అడ్మిషన్ కల్పిస్తామని వెల్లడించారు. అన్ని సౌకర్యాలుఉచితంగా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే పీ-4తో పేరెంట్స్‌కి అండగా నిలబడతామని వీఆర్స్‌లో చేరబోయే పేద విద్యార్థుల్లో కొందరిని నా కూతురు షరిణి పీ-4 కింద దత్తత తీసుకోవడం గర్వంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్‌తో పాటు టీడీపీ ముఖ్య నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## పురావస్తు ప్రదర్శనశాలలు నాగరికతకు దర్పణాలు

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ట్రాకింగ్ చేస్తూ కొండపల్లి ఖిల్లాకు చేరుకున్న జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** సంస్కృతి, చారిత్రక పరిరక్షణలో పురావస్తు ప్రదర్శనశాలలు (మ్యూజియాల) పాత్ర విశిష్టమైనదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వ్యాఖ్యానించారు. చారిత్రక ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా ట్రెక్కింగ్(పర్వతారోహణ)తో కొండపల్లి ఖిల్లాకు కలెక్టర్ చేరుకున్నారు. ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ, ఆర్కియాలజీ, రెవెన్యూ, పర్యాటకం, పట్టణ పరిపాలన తదితర శాఖల అధికారులు, అడ్వెంచర్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ల ప్రతినిధులతో కలిసి కొండపల్లి కోటలోని మ్యూజియంను సందర్శించారు. కొండపల్లి బొమ్మల కళాకారుల వీధి నుంచి ఖిల్లాకు ట్రెక్కింగ్ చేశారు. కొండపల్లి ఖిల్లా ప్రాంత గొప్ప వారసత్వ పరిరక్షణపై నిబద్ధతను చాటిచెప్పే లక్ష్యంతో ఈ పర్యటన చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేగంగా మారుతున్న సమాజాల్లో మ్యూజియాల భవిష్యత్తు అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. చారిత్రక ఔన్నత్యాన్ని కళ్ల ముందుంచే సజీవ తరగతిగ దులైన మ్యూజియాలను ప్రజలు ముఖ్యంగా యువత, విద్యార్థులు సందర్శించాలన్నారు. విజయవాడలోని బాపూ మ్యూజియం, కొండపల్లికోటలోని మ్యూజియం వంటివాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, డీఎఫ్‌వో సతీష్, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్య కీర్తన, ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్, విజయవాడ ప్రెసిడెంట్ తరుణ్ కాకాని, ఏపీ టూరిజం అథారిటీ కన్సల్టెంట్ సాహితి, టూర్స్ అండ్ ట్రావెల్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.



ఆకస్మిక తనిఖీ చేసి వివరాలు తెలుసుకుంటున్న ఇఓ



నృత్యనీరాజనం

## భక్తుల సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఇఓ

**ఇంద్రకీలాద్రి, మే 18, ప్రభాతవార్త :** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తులకందిస్తున్న సౌకర్యాలను ఇఓ వికె శీనా నాయక్ వ్యక్తిగతంగా ఎవరూ వెంటలేకుండా పరిశీలించారు. కేశఖండనశాల, దుర్గాఘాట్ లను మాస్క్ ధరించి టూవీలర్‌పై వెళ్ళి పరిశీలించారు. అక్కడ సిబ్బందిని భక్తునిలా వెళ్ళి వివరాలు తెలుసుకున్నారు. దుర్గాఘాట్లో భక్తులతో ముచ్చటించి వారి సౌకర్యాలను తెలుసుకున్నారు. కొన్ని చోట్ల స్వయంగా పరిశీలించి పరిశుభ్రత లేకపోవడం గమనించారు. టోల్‌గేట్ వద్ద బ్యారికేడ్లు గోపురం వైపు జరిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానంలోని ప్రథమ చికిత్స కేంద్రంలో ఒక డాక్టర్, నర్సును కేటాయించాలని కలెక్టర్ లక్ష్మీషాను కోరామన్నారు. రాష్ట్ర రాజధానిలోని పురాతన వారసత్వ సంపద అయిన దుర్గమ్మవారి దేవస్థానంలో భక్తులకు సౌకర్యాలు వుండేలా చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ పరిశీలన చేశామన్నారు.

**దుర్గమ్మకు నృత్యనీరాజనం :** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం కళావేదికపై విజయవాడకు చెందిన కళాక్షేత్ర డ్యాన్స్ ఇన్స్‌టిట్యూట్ ఆచార్యులు గీత, మౌనిక ఆధ్వర్యంలో నృత్య విద్యార్థులు నృత్యనీరాజనం సమర్పించారు.

## వ్యాపార యాజమానులకు ఆర్ధికాంశాలపై మాస్టర్ క్లాస్

**విజయవాడ, మే 18, ప్రభాతవార్త :** వ్యాపార యాజమానులకు ఆర్ధిక ప్రాథమిక అంశాలపై ఎపిఎంఎస్ఇ ఆధర ్యంలో మాస్టర్ క్లాస్‌ను విజయవాడలో ఆదివారం నిర్వహించారు. ఆర్ధిక నిపుణులు యు శ్రీనివాసమూర్తి, వైస్ చైర్మన్ ఇంటిగ్రేటెడ్ క్లీన్‌రూం టెక్నాలజీస్ ప్రై లిమిటెడ్, విరించి నందుల, బెంగుళూరు ఎంఎస్ఎంఇ అసోసియేట్స్, ఎంఎస్ఎంఇ వ్యవస్థాపకులకు ఆర్ధిక క్రమశిక్షణ, మరియు వ్యాపార విలువను నిర్మించడానికి మార్గనిర్దేశం చేశారు. వర్కింగ్ క్యాపిటల్ నిర్వహణ, లిక్విడిటి, నగదు ప్రవాహ ప్రణాళికపై లోతైన ప్రజంటేషన్‌ను ప్రతినిధులు ప్రదర్శించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఎంఎస్ రామచంద్రరావు, అధ్యక్షుడు డి దుర్గాప్రసాద్, కోశాధికారి జెవిఎస్ఆర్‌కె ప్రసాద్, జి ఎస్ అల్లాయ్ కాస్టింగ్స్ శ్రీనివాస్, ప్రోగ్రాం కన్వీనర్ పర్వతనేని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సజ్జల శ్రీధర్ రెడ్డి విచారణ ముగిసింది

### ప్రకటించిన సిట్

**విజయవాడ,మే18,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుడు సజ్జల శ్రీధర్ రెడ్డి సిట్ అధికారుల మూడో రోజుల విచారణ ముగిసిందని సిట్ అధికారికంగా ప్రకటించింది. అయితే ఆయన సిట్‌కు తగిన విధంగా సహకరించనందున మరో పర్యాయం పోలీసు కస్టడీకి కోరి విచారించే అవకాశం ఉందని సిట్ అధికారులు తెలిపారు. వైకాంగ్రెస్ సామాజిక మాధ్య మాల నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన శ్రీధర్ రెడ్డిని మూడు రోజులపాటు సిట్ అధికారులు ప్రశ్నించారు. మద్యం పాలసీ రూపకల్పన, డిస్టిలరీలకు అనుమతులు, అమ్మకాలకు సంబంధించి శ్రీధర్ రెడ్డికి ప్రశ్నలు వేశారు. విచారణ తర్వాత వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. 3 రోజుల విచారణ ముగియడంతో ఏసీబీ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. అనంతరం శ్రీధర్ రెడ్డిని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. మద్యం కేసులో 33 మంది నిందితులను సిట్ గుర్తించింది. ఇప్పటివరకు రాజ్ కసిరెడ్డి, చాణక్య, దిలీప్, సజ్జల శ్రీధర్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను అరెస్టు చేసారు. అనంతర పరిణామాల్లో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలను అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టు అయినవారి సంఖ్య 7కు చేరింది. ఇక మద్యం కుంభకోణంలో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి నేరానికి పాల్పడినట్లు పక్కా ఆధారాలు ఉన్నాయని విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టులో సిట్ వాదనలు వినిపించింది. ఇదే కేసులో ఇతర నిందితులు వీరిద్దరి పాత్రపై వాంగ్మూలాలిచ్చారని కోర్టుకు వివరించింది. ఇది మిగతా కేసుల్లాంటిది కాదని రూ.3,500 కోట్లకుపైగా దోచుకున్న వ్యవహారమని వాదించింది.

## జిఓ నెం.4 పట్ల విఆర్‌ఓ అసోసియేషన్ అసంతృప్తి

**విజయవాడ, మే 18, ప్రభాతవార్త :** ప్రతి సెక్రటేరియట్‌కు ఒక విఆర్‌ఓను కేటాయించాలని తాము పలు మార్లు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు హేతుబద్ధంగా వివరించామని, కానీ ఒక సెక్రటేరియట్‌కు ఒక విఆర్‌ఓ, మరో సెక్రటేరియట్‌కు సర్వే అసిస్టెంట్‌కు కేటాయిస్తూ జారీ చేసిన జిఓ 4 పై విఆర్‌ఓలందరూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు వెల్లడించారు. ఏపి రాష్ట్ర గ్రామవార్డు సచివాలయాల సెక్రటరీ కాటంనేని భాస్కర్ ఆదేశాలతో ఈ జిఓ4ను ఇచ్చారన్నారు. ఇలా చేయడం వల్ల 7500 మంది గ్రామ రెవెన్యూ అధికారులు మిగులు సిబ్బందిగా చూపుతారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14వేల మంది గ్రామ రెవెన్యూ అధికారులు పనిచేస్తుంటే ఇప్పుడు క్లస్టర్ విధానంలో 50శాతం విఆర్‌ఓలు తగ్గిపోతున్నారని, తమపై పనిభారం పెరిగిపోతుందని, మిగిలిన విఆర్‌ఓలకు ఏ బాధ్యతలు చెప్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సచివాలయానికి ఒక విఆర్‌ఓ లేదా ప్రతి రెవెన్యూ విలేజ్‌కు ఒక విఆర్వో వుండేలా నిర్ణయం తీసుకుని తమ క్యాడర్ స్ట్రెంత్‌ను తగ్గకుండా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నామన్నారు. లేకుంటే ఈ క్లస్టర్ విధానంపై తాము చర్చించుకుని భవిష్యత్ కార్యాచరణ నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించారు.

## హిందూ ధర్మ రక్షకులు ఛత్రపతి శివాజీ మహరాజ్

### ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మే 18, ప్రభాతవార్త :** భారతదేశంలో హిందూత్వం, ధర్మాచరణలకు ప్రాణంపోసి ఛత్రపతి శివాజీ మహారాజ్ యువతకు దేశభక్తి, దైవభక్తిని స్ఫూర్తిగా అందించారని తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో ఆదివారం సీతరామపురం వేడుకల మందిరంలో జరిగిన ఛత్రపతి శివాజీ మహారాజ్ కళా ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ నేటి తరానికి శివాజీ మహారాజ్ చరిత్రను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంస్కార భారతి, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆధునాతన శాస్త్రపరిజ్ఞానంతో ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. తొలుత ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిట్టా లక్ష్మీ నరసింహశాస్త్రి, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, రంగస్థల కళాకారులు బొబ్బిళ్ళపాటి సాయి జెండా ఊపి కళాప్రదర్శనను ప్రారంభించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక అధ్యక్షులు పిన్నం చినవెంగళరావు, కోర్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

**జూన్ 2న విగ్రహాల పునఃప్రతిష్ఠ:** జగ్గయ్యపేట పట్టణంలోని ప్రాచీన ధనశైల శ్రీరామాలయంలో జూన్ 2న విగ్రహాల పునఃప్రతిష్ఠ జరుగనుండగా శ్రీచినజీయర్‌స్వామి వారి ఆదేశాలతో ఆదివారం శ్రీరామాలయంలో భక్తులకు హైందవ జెండాల పంపిణీ కార్యక్ర మాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రారంభిం చారు. పట్టణంలోని ప్రతి ఇంటికి ఒక జెండా, మృత్తికా కలశం ఇవ్వటం జరుగుతుందని వీటిని స్వీకరించిన వారు ప్రతిరోజూ శ్రీరామనామ జపం చేస్తూ అన్ని బియ్యపు గింజలను ఈ కలశంలో వేస్తూ 11రోజుల అనంతరం ఆలయంలో అందజే యాలని ఇలా సేకరించిన బియ్యంతో ప్రసాదం తయారుచేసి స్వామివారికి నైవేద్యం సమర్పించి పూజలుపూర్తయిన అనంతరం భక్తులకు పంపిణీ చేయటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

**శివాలయంలో శుద్ధి:** పట్టణంలోని శ్రీచంద్రమౌళీ శ్వరస్వామి (పెద్దశివాలయం)లో ఆదివారం అన్నపూర్ణ సేవా సమితి వ్యవస్థాప కులు మహంకాళి జయప్రకాష్ ఆధ్వర్యంలో సేవా సమితి సభ్యులు 22 మంది శుద్ధి సేవా కార్య క్రమాన్ని చేపట్టారు.

19-5P□g7exHMNWJQE.qxd:19-5P□g7exHMNWJQE.qxd 01/01/01 7:57 AM Page 1



# నిజాం నాటి నక్షాలకు మోక్షం

### వచ్చే వారం నుండి ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాల్లో రీసర్వే

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నిజాం కాలం నుంచి ఉన్న నక్షాలకు మోక్షం కల్పించ బోతున్నామని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తర తరాలుగా నిజాం కాలం నుండి సర్వే చేయని లేదా సర్వే రికార్డులు లేని 413 గ్రామాలు ఉన్నాయని గత పది సంవత్సరాలలో ఈ సమస్యకు ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కారం చూపలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందుకు గాను 413 గ్రామాల్లోని ఐదు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు నిర్వహించి దానిలో వచ్చే ఫీడ్‌బ్యాక్ మేరకు మిగిలిన గ్రామాల్లో కూడా చేపడతామని తెలిపారు.

పైలట్ గ్రామాలు మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో ఆధునిక సాంకేతికను వినియోగిస్తూ రెండు పద్ధతులలో విస్తృత సర్వే జరుగుతుందని, ఏరియల్, డ్రోన్ సర్వే పద్ధతి, ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతుల్లో సర్వే చేసి జియో రిఫరెన్స్, క్యాడస్ట్రల్ మ్యాపులు, హక్కుల నమోదు పత్రాలను తయారుచేస్తారని తెలిపారు. ఈ నూతన విధానాల వలన భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుంది, ఫలితంగా రైతులు, గ్రామీణ భూయజమా నులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ రీ సర్వే కోసం వివిధ రాష్ట్రాలలో రీ సర్వే లో అనుభవం కలిగిన ఆర్వీ అసోసియేట్స్, మార్వెల్ జియో స్పేషియల్, ఐఐసి టెక్నాలజీస్, నియో జియో, డ్రోగో డ్రోన్ సంస్థలను ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. పైలట్ గ్రామాల్లో ఈ సంస్థలు రీ సర్వే చేస్తాయని, సర్వే ఫలితాల ఆధారంగా మిగిలిన గ్రామాలకు విస్తరిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఆధునిక యంత్రాలు, టెక్నాలజీని వాడుకుని శాశ్వతంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా మా ప్రభుత్వం అడుగులు వేస్తుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

#### మున్నేరు, పాలేరు లింక్

#### కెనాల్‌కు రూ.162.54 కోట్లు విడుదల

వృధాగా సముద్రంలోకి వెళ్తున్న మున్నేరు వాగు వరద నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించడానికి మున్నేరు పాలేరు లింక్ కెనాల్ కు రాష్ట్ర ప్రభుత్వం రూ.162.54 కోట్లు విడుదల చేసిందని రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 98 ని విడుదల చేసినట్లు చెప్పారు.

సముద్రంలోకి పోయే వరద నీటిని రూపాయి ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా మళ్లించాలన్న ఆలోచన ఈ రాష్ట్రాన్ని పదేళ్లు ఏలిన ప్రభుత్వానికి రాలేదని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల వృధాగా పోతున్న వరద నీటిలో సుమారు 10 టిఎంసిల వరద నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించవచ్చన్నారు. దీంతా ఈ రిజర్వాయర్ పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయ కట్టు స్థిరీకరణ జరుగుతుందని ఇందులో ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు. పాలేరు లింక్ కెనాల్‌కు నిధులు విడుదల చేసిన సిఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలాగే ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నా అన్నారు. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు తాగునీరు, డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో పది చెరువులకు సాగునీరు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతీ ఏటా వర్షాకాలంలో వస్తున్న వరద నీరు వృధా కాకుండా ఒడిసి పట్టాలనే సంకల్పంతో మున్నేరు నుంచి పాలేరుకు లింక్ కెనాల్‌ను మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు.



# ప్రతి ఎకరం సాగులోకి తీసుకురావడమే లక్ష్యం

### రెండు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తాం

### పనుల జాప్యంపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం

**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), మే 18, ప్రభాతవార్త :** కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాన్ని సాగులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తంకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పాలకీడు మండలంలోని బెట్టే తండ లోని మూసీ నది వద్ద, జాన్ పహాడ్ సమీపంలోని కృష్ణా నది వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల పనులను ఆయన పరిశీలించారు. మొదట పెట్టే తండా సమీపంలోని మూసీ నది వద్ద 33 కోట్ల 83 లక్షలతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం నిర్మాణపు పనులను ఆయన పరిశీలించి అధికారులను పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు నెల వరకు ఈ పథకం పూర్తవుతుందని మంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పథకం పూర్తి అయితే బెట్టే తండా, పాడే తండా, రాఘువాపురం, సజ్జాపురంలోని బడుగు బలహీన వర్గాల రైతులకు చెందిన 2,041 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు.

గిరిజనులకు చెందిన 1877 మంది, షెడ్యూల్ కులాలకు చెందిన 34 మంది, బలహీన వర్గాలకు చెందిన 100 మంది, ఇతరులు 97 మంది మొత్తంగా 2,176 మంది రైతులకు చెందిన 2041 ఎకరాలు సాగులోకొస్తాయని తెలిపారు. ఈ పథకం అమలు అయితే ఈ ప్రాంతంలోని పేద రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ పథకానికి సంబంధించి భూ సేకరణ పూర్తయిందని వాటికి సంబంధించిన రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించడం జరిగింది అని తెలిపారు.

ఈ పథకం అమల్లోకి వచ్చి రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు ఆదేశించారు. అనంతరం జాన్ పహాడ్ సమీపంలోని కృష్ణా నది వద్ద 273 కోట్లతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ పథకం ద్వారా సుమారు 11 గ్రామాలకు చెందిన పదివేల ఎకరాలకి సాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం నిర్మాణం పనులను ఇప్పటికి రెండుసార్లు పరిశీలించానని, ఇది మూడవ సారి పరిశీలించేందుకు వచ్చానని ఆయన పనుల్లో పురోగతి కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ తీరుపై ఆయన మండిపడ్డారు. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేదని ఆయన మందలించారు. నిర్మాణపు పనులు వేగవంతం చేయాలని అవసరమైన నిధులను విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పనుల్లో జాప్యం బాగా జరుగుతుందని ఏజెన్సీ నిర్లక్ష్యం కనిపిస్తుందని ఇకనుంచి పథకాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, అవసరమైతే ఎక్కువ మిషన్లను, కూలీలను పెంచుకొని నవంబర్ నాటికి పూర్తి చేయాలని ఏజెన్సీ ని ఆదేశించారు. నిర్మాణపు పనుల్లో జాప్యం జరిగిన నిర్లక్ష్యం వహించిన సహించేది లేదన్నారు. ఈ పథకం పూర్తి అయితే జాన్ పాడ్, గుండబోయిన గూడెం, గుండ్లపాడు, అలింగాపూర్, బొత్తల పాలెం, కోమటికుంట, మీగడం పాడు తండా, చెరువు తండా, పాలకవీడు, సజ్జాపురం, నాగిరెడ్డి గూడెం గ్రామాల్లోని పదివేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.

# వన్ నేషన్-వన్ ఎలక్షన్‌పై ప్రజల్లో చైతన్యం నింపాలి

### ఒకేసారి ఎన్నికలు జరిగితే సమయం వృధాకాదు

### రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మార్చుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్రం సిద్ధించి 76 సంవత్స రాలు పూర్తి చేసుకున్న ఇంకా బ్రిటిష్ వారి విధానాల్ని అవలంబిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో ఉన్నటువంటి వర్తమాన రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్ని మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివారం ఒకే దేశం ఒకే ఎన్నికలు పేరుతో దేశవ్యాప్త అవగాహన కార్యక్రమంలో భాగంగా, నగరంలో ఒక హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే కొన్ని చట్టాలు మార్చుకున్నామన్నారు. కానీ దురదృష్టం ఏంటంటే మార్చే క్రమంలో వాటికి అడ్డంపడే ప్రయత్నం జరుగుతుందన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ సంబంధించి ప్రజల్లో చైతన్య నింపాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ నినాదాన్ని ప్రజల మధ్యకు తీసుకుని వెళ్లాలన్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీలపై, మేధావులపై, విశ్లేషకులపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారాలంటూ కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడ ఎలక్షన్ జరిగిన దేశమంతా చర్చ జరుగుతుందన్నారు. దీనివల్ల ఎన్నో పని గంటలు వృధా అవుతున్నాయన్నారు. ఒకేసారి ఎన్నికలు జరుగితే ఇలాంటి పరిస్థితి ఉండదన్నారు. దేశంలో ఏదైనా సంస్కరణలు తీసుకు రావడం దేశం కోసం ఏదైనా చేయాలంటే అది మోడీ ప్రభుత్వానికి సాధ్యం అన్నారు. మార్పు రావాలి అంటే మోడీ నాయకత్వంలోనే మార్పు వస్తుందన్నారు. జిఎస్టీ విషయంలో కావచ్చు, 370 ఆర్టికల్ విషయంలో కావచ్చు అది ఏదైనా మోడీ పట్టుదలతోనే అది సాధ్యమైందన్నారు. ట్రిబుల్ తలక్ విషయంలో కూడా అదే జరిగిందన్నారు. సిఎఏ న్యూ క్రిమినల్ యాక్ట్, తీసుకోచ్చింది మోడీ ప్రభుత్వమే అన్నారు. ఉగ్రవాదాన్ని మోడీ ప్రభుత్వమే కూకటి వేళ్ళతో పెకిలించే ప్రయత్నం చేస్తుందన్నారు. గతంలో హైదరాబాద్ నగరంలో ఎన్నో ఘటనలు మనం చూసామన్నారు.

పాకిస్థాన్ విషయంలో నేడు పరిస్థితి మారింది ఉగ్రవాద చర్యలకు పాల్పడితే పాకిస్తాన్ గడ్డమీదికి వెళ్లి వారిని తుద ముట్టించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పహాల్గం దాడి తర్వాత క్యాండిల్ లైట్లతో ఎర్ర గులాబీలతో సంతాపం ప్రకటించలేదని, వారి స్థావరాల్ని పేల్చేశాం అన్నారు. ఇది దేశం గురించి ఆలోచించే వారికే సాధ్యమవుతుందన్నారు. అధికారం కోసం ఓట్ల కోసం పదవుల కోసం ఆలోచించే వారికి సాధ్యం కాదన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వేస్టేషన్ పునర్నిర్మాణం లాంటి అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం దేశం పరిస్థితులు దేశం యొక్క అభివృద్ధి వన్ నేషన్ వన్ ఎలక్షన్ రావాల్సిందే అన్నారు. ఎక్కడో ఒకచోట ఎప్పుడు ఎలక్షన్స్ ఉండడం వల్ల సిబ్బందికి ప్రభుత్వానికి ఇబ్బంది అన్నారు. అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని, ఈ విషయంలో ఒక్కసారి ప్రజలందరూ ఆలోచించాలన్నారు. దేశ అభివృద్ధి కోసం భవిష్యత్తు తరాల నిర్మాణం సంస్కరణలు తీసుకురావాల్సిందేనని, తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంలో మోడి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు. రాఫెల్ యుద్ధ విమానాల విషయంలో ప్రతిపక్షాలు ఎంత రాద్ధాంతం చేశాయో అందరికి తెలుసు. కానీ నేడు యావత్ ప్రపంచం మన దేశం వైపు చూస్తుందన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి దేశాన్ని అందించాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవసరం ఉందని, దీనికి అందరూ ప్రజలు సహకరించాలన్నారు. మేధావులు అన్ని వర్గాలు ఆలోచించాలని, ప్రజలు సహకరించాలన్నారు.

### రూ.11 లక్షల విలువైన పటిక, బెల్లం పట్టివేత

#### నల్గొండ, సిద్దపేటలో ఎక్సైజ్ అధికారుల దాడులు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది మూడుచోట్ల దాడులు నిర్వహించి 6,740 కేజీల బెల్లం 250 పటిక పట్టుకున్నారు. బెల్లం పట్టిక విలువ రూ.11 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేశారు. బెల్లం ఆలంతోపాటు పట్టుకున్న వాహనాల విలువ రూ. 23 నుంచి రూ.25 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో లారీలో అక్రమంగా వెళుతున్న 8,000 కేజీల బెల్లం, 200 కేజీల పటికను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నల్లగొండ జిల్లా కొండ మల్లేపల్లి రోడ్‌లో లారీలో వెళ్తున్న 2,400 కేజీల బెల్లాన్ని దేవరకొండలో పట్టుకున్నారు. నిర్మల్ ఖానాపూర్ ప్రాంతంలో ఎక్సైజ్ సిబ్బంది బైక్ పై తీసుకు వెళుతున్న 340 కేజీల బెల్లాన్ని 20 కేజీల ఆలమును ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.



### హెలికాప్టర్ ద్వారా సరస్వతిఘాట్‌ను పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌శర్మ

**కాళేశ్వరం, మే 18, ప్రభాతవార్త:** హెలిప్యాడ్ వద్ద జాయ్‌రైడ్ హెలికాప్టర్, సరస్వతి ఘాట్‌ను ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. భక్తులు కాళేశ్వరం అందాలను వీక్షి ంచేందుకు అనువుగా జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సరస్వతి ఘాట్ ప్రాంతాలను పరిశీలించారు. ఏర్పాట్లను సమీక్షి స్తూ, వాకీటాకీ ద్వారా అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం భక్తుల రద్దీ పెరుగు తుందని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు వారి కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విభాగం అధికారులు వారి ప్రదేశాల్లో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టంగా ఆదేశించారు. స్నాన ఘాట్స్ వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని, శుభ్రత, నీటి సరఫరా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు.

### 42 శాతం రిజర్వేషన్ల అమలు చేశాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

#### 14 బిసి సంఘాలు డిమాండ్

**హైదరాబాద్(సైఫాబాద్), మే 18, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని 14 బిసి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాజకీయ పార్టీల సవాళ్లు-ప్రతిసవాళ్లతో సమస్యను పక్కదారి పట్టిస్తే సహించేది లేదని హెచ్చరించాయి. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన 14 బిసి సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభసభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కొంతమంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వానికి దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని సవాళ్లు విసురుతున్నారని, ఇలాంటి సవాళ్ల ఉద్దేశం ఏమిటీ?, రిజర్వేషన్‌లు పెంచకుండానే ఎన్నికలకు వెళ్లాలనా?, అన్ని పార్టీల ప్రతి సవాళ్లు రిజర్వేషన్‌లను పెంచకుండా తప్పించుకోవాలని చూస్తున్నాయా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన వాగ్దానం ప్రకారం బిసి రిజర్వేషన్‌లను పెంచి ఎన్నికలు జరపాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి నాయకులు జిల్లపల్లి అంజీ, పగిళ్ళ సతీష్, రాందేవ్, నిమ్మల వీరన్న, చిక్కుడు బాలయ్యముదిరాజ్, నిఖిల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మద్యం ధరలు పెంపు

### వైన్‌షాపులకు సర్క్యులర్లు జారీ

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** తెలంగాణలోని మందుబాబులకు బ్యాడ్ న్యూస్. మద్యం ధరలు పెరగనున్నాయి. క్వార్టర్‌పై రూ. 10, హాఫ్‌పై రూ. 20, ఫుల్‌పై రూ. 40 పెంచేందుకు ఎక్సైజ్ శాఖ సర్క్యులర్లు పంపినట్లు సమాచారం. ఇటీవలే బీర్ల ధరలు పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు ఇతర మద్యం ధరలు పెంచేందుకు డిసైడ్ అయింది. అయితే ఈ పెంపుపై ఎక్సైజ్ శాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ధరలు పెరిగినా అమ్మకాలు తగ్గకపోవచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

తెలంగాణలో మద్యం ప్రియులకు ఇది నిజంగా షాకింగ్ న్యూసే. ఇటీవలే బీర్ల ధరలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం, తాజాగా ఇతర మద్యం ధరలను కూడా పెంచడానికి సిద్ధమైంది. మార్కెట్ ధరల్లో మార్పుల కారణంగా ఈ కొత్త రేట్లు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం. తెలంగాణ ఎక్సైజ్ శాఖ మద్యం ధరలను పెంచుతూ మద్యం దుకాణాలకు సర్క్యులర్లు పంపినట్లు తెలిసింది. ఈ సర్క్యులర్ల ప్రకారం, 180 (మిల్లీ లీటర్లు)క్వార్టర్ బాటిల్‌పై రూ. 10, 360 (మిల్లీ లీటర్లు)హాఫ్ బాటిల్‌పై రూ. 20, ఫుల్ బాటిల్‌పై రూ.40 ధరలు పెరగనున్నాయి. అయితే, ఈ ధరల పెరుగుదలపై ఎక్సైజ్ శాఖ నుండి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

అధికారిక ప్రకటన లేకపోవడంతో మద్యం ప్రియులు కొంత గందరగోళానికి గురవుతున్నారు. ఒకవైపు ధరల పెంపు గురించి వార్తలు వస్తుండగా.. మరోవైపు ఎక్సైజ్ శాఖ దీనిపై స్పందిచడం లేదు. ఒకవేళ ఈ ధరల పెరుగుదల వాస్తవమైతే మందుబాబుల జేబులకు మరింత చిల్లు ఎట్టే అవకాశముంది. గత అనుభవాలను బట్టి చూస్తే ధరలు పెరిగినా అమ్మకాలు ఆశించిన స్థాయిలో తగ్గకపోవచ్చని తెలుస్తోంది. తతెలంగాణలో మద్యం అమ్మకాల జోరు కొనసాగే అవకాశం ఉంది. ధరల పెంపుపై ఎక్సైజ్ శాఖ ఎప్పుడు అధికారికంగా ప్రకటన చేస్తుందో వేచి చూడాలి. ఇక తెలంగాణలో ఎండలు మండు తుండటంతో బీర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఎండలు తీవ్రంగా ఉండటంతో చల్లని బీర్ తాగడానికి మందుబాబులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బీర్ల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి.

సాధారణ రోజులతో పోలిస్తే అమ్మకాలు రెట్టింపు అయ్యాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా యువత బీర్లు ఎక్కువగా తాగుతున్నారు. అయితే, ఈ పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, బేవరేజెస్ కంపెనీల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే బీర్ల ధరలను 15 శాతం వరకు పెంచింది. ధరలు పెరిగినా అమ్మకాలు మాత్రం తగ్గడం లేదు. పెళ్లిళ్ల సీజన్ కూడా కొనసాగుతుండటంతో బీర్ల వినియోగం మరింతగా పెరిగింది. దీంతో వైన్ షాపుల్లో చల్లని బీర్లు దొరకడం కూడా కష్టంగా మారింది. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది బీర్ల అమ్మకాలు రెట్టింపు అయినట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో చల్లటి బీర్లకు కొరత ఏర్పడింది. ఏప్రిల్ నెలలో మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ. 3,272.32 కోట్ల ఆదాయం వచ్చింది. ఈనెలాఖరు వరకు బీర్ల డిమాండ్ ఇలాగే కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# తెలంగాణలో డమ్మీ పేలుళ్లకు ఐసిస్ కుట్ర

### ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు

#### పాక్‌పై భారత్ దాడి చేసినందుకు కుట్ర

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** నిషిద్ధ ఐసిస్ ఉగ్రవాద సంస్థ తెలంగాణలో మరోసారి పేలుళ్లకు కుట్ర పన్నింది. పహల్గాం ఉగ్రదాడి తరువాత పాక్‌పై భారత్ దాడికి దిగినందుకు ప్రతీకారంగా వీరు ఈ కుట్ర పన్నినట్లు తేలింది. దీనిపై తెలంగాణ, ఎపి పోలీసులు పక్కా సమాచారంతో ఇద్దరు ఉగ్రవాదులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలను జప్తు చేశారు. పట్టుబడ్డ ఉగ్రవాదుల్లో ఒకడు విజయనగరం వాసి కాగా మరొకతను హైదరాబాద్ వాసి. సౌది అరేబియా నుంచి ఈ ఇద్దరు ఉగ్రవాదులకు ఐసిస్ పెద్దలు ఈ పేలుళ్ల కుట్రకు ఆదేశించినట్లు తేలింది. వివరాలు ఇలావున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, దాని తరువాత పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడికి దిగడం, అనంతరం పాక్ డ్రోన్లతో ఎదురు దాడి చేయడం, వీటిని భారత సైన్యం ధ్వంసం చేయడం తెలిసిందే. దీని తరువాత పాక్ అనుకూల ఉగ్రవాద సంస్థ లు భారత్‌లో దాడులకు పాల్పడే వీలుందన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు దేశ వ్యాప్తంగా అప్రమత్త ంగా వుండసాగారు. ఈ క్రమంలో కాశ్మీర్‌లో పలువురు ఉగ్రవాదులు పట్టుబడగా ఆరుగురు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. దీంతో పాటు ముంబాయిలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. వీరిద్దరు దుబాయ్ నుంచి భారత్‌కు రాగా ముంబాయి విమానాశ్రయంలో పట్టుబడ్డారు. వీరిద్దరు 2023 పూణె పేలుళ్ల కేసులో నిందితులు. వీరిని విచారిస్తున్న క్రమంలో అందిన సమాచారం ఆధారంగా విజయనగరం వాసి సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన స మీర్ అనే ఐసిస్ ఉగ్రవాదులు హైదరాబాద్‌లో డమ్మి పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తేలింది. పాక్‌పై భారత్ దాడులకు పాల్పడినందుకు వీరు హైదరాబాద్‌లో డమ్మీ పేలుళ్లకు పాల్పడి ప్రజలను భయాందోళనలకు గురిచేసేందుకు వ్యూహం పన్నినట్లు తేలింది. దీనిపై ఎన్ఐఎ అధికారులు తెలుగు రాష్ట్రాల పోలీసలును అప్రమ త్తం చేయడంతో రెండు రాష్ట్రాల కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు వెంటనే రంగంలో దిగి విజయనగరంలో సిరాజ్‌ను, హైదరాబాద్‌లో సమీర్‌ను అరెస్టు చేశారు. వీరిని విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో వీరు తమ నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. సోమవారం నాడు ఇద్దరు ఉగ్రవాదులను కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించే వీలుంది.

# నకిలీ మందుల అమ్మకాలపై నిరంతరం నిఘా పెట్టాలి

### డిసిఎ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** మార్కెట్లో నకిలీ మందుల వ్యాప్తిని అరి కట్టేందుకు దాడులు ముమ్మరం చేయాలని, నిరంతర నిఘా తోనే ఈ దందాను అరికట్టవచ్చని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ షా నవాజ్ ఖాసీం అన్నారు. ఈ మేరకు ఆయన అబ్కారీ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వ హించారు. నకిలీ ఔషధాల తయారీ, పంపిణీ, అమ్మకాలలో నిమగ్నమైన వ్యవహారాలను నిర్మూ లించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం నకిలీ డ్రగ్స్ తరలించి విక్రయా లకు పాల్పడు తున్న వారిపై నిఘా పెంచాలన్నారు.

అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ దుర్వినియోగాన్ని అరికట్టడం మన శాఖ కర్తవ్యమన్న డైరెక్టర్ జనరల్ నకిలీ డ్రగ్స్ దందాను అరికట్టేందుకు సమిష్టి కృషి అవస రమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి డ్రగ్స్ ఫ్రీతెలంగాణ లక్ష్యాన్ని నిజం చేసేందుకు, మత్తుపదార్థాల దుర్వినియో గాన్ని అరికట్టేందుకు మధ్యపాన నిషేధ శాఖతో సమన్వయంగా 1 కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఔషధ తనిఖీ అధికా రులు విక్రయ కేంద్రాలలో తనిఖీలు నిర్వ హిస్తూ తప్పని సరిగా క్యూఆర్ కోడ్లు ధృవీకరించాలని, నకిలీ ఔషదాలు గుర్తించేందుకు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అలాగే ప్రజలను తప్పుదారి పట్టించే అనధికారిక ప్రకటనలు చేసేవ్యక్తులపై కఠిన చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు.

### వణ్యప్రాణుల రక్షణకు 150 ప్రత్యేక బృందాల ఏర్పాటు

**హైదరాబాద్,మే 18,ప్రభాతవార్త :** వన్యప్రాణుల సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. ఇందులో భాగం వాటి సంరక్షణక ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. అడవులు, ఇతర ప్రాంతాల్లో వేటగాళ్ళ వేటకు అనేక వన్యప్రాణులు బలువుతున్నాయి. వేటగాళ్ళ బారి నుంచి వాటిని కాపాడేందుకు రాష్ట్రప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. వీటి సంరక్షణ కోసం ప్రత్యేకంగా 150 స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసింది వేటగాళ్ల నుంచి జంతువులను రక్షించడంతోపాటు వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేలా ఈ బృందాలు పనిచేస్తాయి. జంతువుల రాకపోకలను పసిగట్టేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 242 ట్రాక్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు... రాజాగా ప్రకటన విడుదలైంది. వాటి దాహార్తి తీర్చడానికి మొత్తం 449 సోలార్ బోర్ వెల్స్ అమర్చబోతున్నారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో... వన్యప్రాణులకు చాలావరకు మేలు జరగడమే కాకుండా వేటగాళ్ళ ఆటను కూడా కట్టించనట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

### మంద కృష్ణమాదిగ, చెన్నయ్య రహస్యమిత్రులు

#### పిడమర్తి రవి ఆరోపణ

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైకోర్టులో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య వేసిన కేసు వెనుక ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హస్తం ఉందని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పడమర్తి రవి ఆరోపించారు. రాష్ట్రంలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్‌లు కల్పించి వర్గీకరణ అమలు చేస్తున్న తరుణంలో 5 శాతం కూడా లేని మాల సామాజిక వర్గానికి ప్రభుత్వం కల్పిస్తే దాన్ని కూడా ఓర్వలేని జి.చెన్నయ్య వర్గీకరణ అమలుపై హైకోర్టులో కేసు వేయడం వెనుక కృష్ణమాదిగ హస్తం ఉందని, ఆదే విధంగా జి.చెన్నయ్య, కృష ్ణమాదిగ రహస్య మిత్రులని, గత మూడు దశాబ్దాల కాలంలో మంద కృష్ణమాదిగ, జి.చెన్నయ్యకు డబ్బులు ఇచ్చి వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం చేయించారని, ఇప్పుడు కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించారని ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిడమర్తి రవి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వానికి మందిగలంతా సిఎం రేవంత్‌రెడ్డి పక్షాన ఉంటే దీన్ని ఓర్వలేక కృష్ణమాదిగ ఈ పనిచేశారని, భవిష్యత్తులో బిజెపి బలోపేతం కోసం కృష్ణమాదిగ ఈ పనిచేశారని, ఎన్ని కుట్రలు చేసినా రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేసి తీరుతారని ఆయన స్పష్టం చేశారు. సరస్వతి పుష్కారాలలో ఎంపి వంశీకృష్ణకు ఆహ్వాన పత్రిక అందలేదని జి.చెన్నయ్య వ్యాఖ్యలు మానవ అహంకారానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో వర్గీకరణను అడ్డుకోవడం మనువాదమే అవుతుందని హెచ్చరించారు. జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను సన్మానిస్తున్నామని, ఈ కార్యక్రమం తొలుత హైదరాబాద్‌లో ప్రారంభమౌ తుందన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ మీసాల మల్లేష్, బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, నిమ్మల వీరన్న, వరలక్ష్మి, జోగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# పావోలినికి ఇటాలియన్ టైటిల్

## మాజీ ఛాంపియన్ గౌఫ్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్ టైటిల్-2025ను ఇటలీకి చెందిన జాస్మిన్ పావోలిని కైవసం చేసుకుంది. రోమ్‌లో జరిగిన ఫైనల్లో జాస్మిన్ పావోలిని 6-4, 6-2 తేడాతో కోకో గౌఫ్‌ను ఓడించి ఇటాలియన్ ఓపెన్‌ను గెలుచుకుంది. ఇటీవల రోలాండ్ గారోస్‌ను ఓడించి తన రెండవ 1000 సిరీస్ టైటిల్‌ను సాధించింది. 1985లో మాజీ యూఎస్ ఓపెన్ ఛాంపియన్ గౌఫ్‌ను ఓడించి రాఫెల్లా రెగ్గి తర్వాత రోమ్ ఈవెంట్‌ను గెలుచుకున్న తొలి ఇటాలియన్ మహిళగా పావోలిని నిలిచింది. ఇక 29 ఏళ్ల ఆమె ఓపెన్ ఎరాలో తన తొలి రోమ్ టైటిల్‌ను గెలుచుకున్న మహిళ కాగా, పావోలిని కంటే ఎనిమిది సంవత్సరాలు చిన్నదైన గౌఫ్, 2002లో సెరెనా విలియమ్స్ తర్వాత కిరీటాన్ని గెలుచుకున్న అతి పిన్న వయస్కురాలిగా అవతరించే అవకాశాన్ని కోల్పోయింది. కాగా జెంగ్ క్విన్వెన్‌పై జరిగిన సెమీఫైనల్ విజయంలో లాగానే, గౌఫ్ 55 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్‌లు చేసి, సర్వ్‌లో ఏడు డబుల్ ఫాల్ట్‌లతో ముందుకు సాగింది, దీంతో పావోలిని విజయం సులభతరం అయింది. అయితే పావోలిని ఇంకా సింగిల్స్ మరియు మహిళల డబుల్స్ టోర్నమెంట్‌లను గెలుచుకోలేకపోవడం విశేషం.




# వరల్డ్ ఛాంపియన్‌గా షెర్బిని

## రికార్డు స్థాయిలో 8వ టైటిల్ సొంతం

## రెండో రౌండ్‌లోనే ఇంటికి భారత్ ప్లేయర్లు

**న్యూఢిల్లీ:** స్క్వాష్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో షెర్బిని రికార్డు స్థాయిలో 8వ టైటిల్‌ను గెలుచుకుని తొలి కిరీటాన్ని కైవసం చేసుకుంది. చికాగోలో జరిగిన స్క్వాష్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఈజిప్షియన్లు మహిళల విభాగంలో ఛాంపియన్‌గా నూర్ ఎల్ షెర్బిని, పురుషుల విభాగంలో మోస్తఫా అసల్ ఛాంపియన్‌లుగా నిలిచారు. ఈ ఈవెంట్‌లో వరుసగా 10వ ఫైనల్ ఆడుతున్న 29 ఏళ్ల ఎల్ షెర్బిని, స్వదేశీయురాలు మరియు ప్రపంచ నంబర్ త్రి హనియా ఎల్ హమ్మామిని 3-1 (11-5, 11-9, 4-11, 11-7) తేడాతో ఓడించి తన ఎనిమిదో టైటిల్‌ను గెలుచుకుంది. ప్రపంచ నంబర్ టు షెర్బిని ఎనిమిది ప్రపంచ ఛాంపియన్‌షిప్ కిరీటాల నికోల్ డేవిడ్ యొక్క ఆల్‌టైమ్ రికార్డును సమం చేసింది. కాగా పురుషుల ఫైనల్లో, ప్రపంచ నంబర్ వన్ అసల్ ప్రపంచ నంబర్ టు మరియు స్వదేశీయుడు అలీ ఫరాగ్‌ను 3-0 (11-7, 11-8, 11-3) తేడాతో ఓడించి తన తొలి టైటిల్‌ను గెలుచుకున్నాడు. 24 ఏళ్ల అసల్ ఇప్పుడు పిఎస్ఎ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు మరియు బ్రిటిష్ ఓపెన్ టైటిళ్లతో పాటు, ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కూడా కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీ ఫైనల్‌లో 33 ఏళ్ల ఫరాగ్ చేతిలో ఓడిపోయి ఉంటే అతను ఈ స్థానాన్ని కోల్పోయేవాడు. ఇక ఈ ఎడిషన్ ఈవెంట్‌లో భారత్‌లో ఐదుగురు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో వేలవన్ సెంథిల్‌కుమార్ ప్రారంభ రౌండ్‌లోనే ఓడిపోగా, అభయ్ సింగ్, భారత నంబర్ 1 రమిత్ టాండన్ మరియు అరంగేట్ర వీర్ చోత్రాని రెండవ రౌండ్‌లోనే నిష్క్రమించారు. మహిళల డ్రాలో, 17 ఏళ్ల అరంగేట్ర ఆటగాడు అనాహత్ సింగ్ రెండవ రౌండ్‌లోనే నిష్క్రమించాడు.



ఆట

# టెస్ట్‌లలో డబుల్ హీరోస్

## సెంచరీల్లో టాప్ 5 భారత్ బ్యాటర్లు

## అద్భుతమైన విజయాలు అందించిన ప్లేయర్లు

**న్యూఢిల్లీ:** రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి వైదొలగడంతో టీమ్ ఇండియా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జట్టులో ముఖ్యంగా బ్యాటింగ్‌లో అనుభవజ్ఞులైన బ్యాటర్లు లేరు. జట్టు పూర్తిగా యువ, కొత్త ఆటగాళ్లతో నిండిపోయింది. టెస్ట్ క్రికెట్‌లో కేవలం సెంచరీలు మాత్రమే కాదు డబుల్ సెంచరీల మోత మోగించి భారత్‌కు అద్భుతమైన విజయాలు అందించిన ప్లేయర్లు చాలా మంది ఉన్నారు. టెస్ట్ క్రికెట్‌లో ఎన్నో మంది దిగ్గజ భారతీయ బ్యాటర్లు సెంచరీల మీద సెంచరీలు సాధించి చరిత్ర సృష్టించారు. విరాట్ కోహ్లీ నుండి సునీల్ గవాస్కర్ వరకు చాలా మంది ప్లేయర్లు డబుల్ సెంచరీలతో భారత్ కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించారు. అటువంటి టాప్ 5 హీరోల్లో టెస్టు క్రికెట్ లో అత్యధిక డబుల్ సెంచరీలు సాధించిన భారత ప్లేయర్ల లిస్టులో మొదటి స్థానంలో కింగ్ కోహ్లీ ఉన్నాడు. కోహ్లీ 123 టెస్ట్‌లలో 46.85 సగటుతో 9230 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. అలాగే, 7 డబుల్ సెంచరీలు కూడా బాదాడు. ఇక ఈ ప్లేయర్ల జాబితాలో టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ రెండో స్థానంలో ఉన్నాడు. 103 టెస్ట్‌లలో 49.43 సగటుతో 8503 పరుగులు కొట్టాడు. ఇందులో 23 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. సెహ్వాగ్ టెస్టు 6 డబుల్ సెంచరీలతో పాటు రెండు ట్రిపుల్ సెంచరీలు కూడా సాధించాడు. అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన భారత ప్లేయర్ల లిస్టులో మూడో స్థానంలో సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. 200 టెస్ట్‌లలో 53.78 సగటుతో 15921 పరుగులు సాధించిన సచిన్ టెండూల్కర్ 51 సెంచరీలు, 68 అర్ధసెంచరీలు సాధించాడు. టెస్టు క్రికెట్ లో అత్యధిక సెంచరీలు బాదిన రికార్డు సచిన్ పేరిట ఉంది. టెండూల్కర్ టెస్టులో 6 డబుల్ సెంచరీలు సాధించాడు. ప్రపంచ క్రికెట్ లెజెండరీలలో ఒకరైన రాహుల్ ద్రవిడ్ భారత జట్టు కోసం ఎన్నో మారపురాని ఇన్నింగ్స్ లను ఆడాడు. అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన భారత ప్లేయర్ల లిస్టులో రాహుల్ ద్రవిడ్ నాల్గవ స్థానంలో ఉన్నాడు. ద్రవిడ్ 163 టెస్ట్‌లలో 52.63 సగటుతో 13265 పరుగులు సాధించాడు. ఇందులో 36 సెంచరీలు, 63 అర్ధసెంచరీలు ఉన్నాయి. ద్రవిడ్ టెస్టు క్రికెట్ లో 5 డబుల్ సెంచరీలు చేశాడు. కాగా భారత్ తరపున టెస్టు క్రికెట్‌లో అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన ప్లేయర్ల లిస్టులో ఐదవ స్థానంలో సునీల్ గవాస్కర్ ఉన్నాడు. సన్నీ 125 టెస్ట్‌లలో 51.12 సగటుతో 10122 పరుగులు సాధించాడు. ఇందులో 34 సెంచరీలు, 45 అర్ధసెంచరీలు ఉన్నాయి. అలాగే, టెస్టులో 4 డబుల్ సెంచరీలు సాధించాడు.



# పంజాబ్ కింగ్స్ హ్యాట్రిక్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025లో కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ హ్యాట్రిక్ విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో 12 మ్యాచ్‌ల్లో 8 మ్యాచ్‌ల్లో విజయం అందుకున్న పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది. జైపూర్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. ఈ లక్ష్య ఛేదనలో రాజస్థాన్ 7 వికెట్లు నష్టానికి 209 పరుగులకే పరిమితమైంది. యశస్వి జైస్వాల్ 25 బంతుల్లో 50 పరుగులు, 9 ఫోర్లు, 1 సిక్స్‌తో చెలరేగిపోయాడు. అలాగే వైభవ్ సూర్యవంశీ 15 బంతుల్లో 40 పరుగులు, 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో మరోసారి మెరుపు ఆరంభం ఇచ్చినా రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు. ఆ తర్వాత వచ్చిన సంజు శాంసన్ 16 బంతుల్లో 20 పరుగులు, 1ఫోరు, 1సిక్స్, రియాన్‌పరాగ్ 11బంతుల్లో 13పరుగులు, 1సిక్స్‌కొట్టి దూకుడుగా ఆడలేకపోయారు. ధ్రువ్ జురెల్ 31 బంతుల్లో 53 పరుగులు, 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో అర్ధ సెంచరీ చేసి పోరాడినా మిగిలిన బ్యాటర్ల నుండి సరైన సహకారం అంద లేదు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పంజాబ్ స్పిన్నర్ హర్ ప్రీత్ బ్రార్ కీలక సమయంలో వికెట్లు తీసి రాజస్థాన్‌ను దెబ్బతీశాడు. యున్సెన్, ఒమర్జాయ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. యశస్వి జైస్వాల్, సూర్యవంశీ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. అర్ష్‌దీప్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో జైస్వాల్ వరుసగా 4 పోర్లు, 1 సిక్స్ బాది 22 పరుగులు పిండుకున్నా ఫలితం లేకుండా పోయింది. అంతకు ముందు ప్లే ఆఫ్స్ రేసులో ఉన్నపంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ చేసి భారీ స్కోర్ చేసింది. టాపార్డర్ విఫలమైనా యువకెరటం నేహల్ వధేరా(70) అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడినా కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(30)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో ఆఖర్లో శశాంక్ సింగ్(59 నాటౌట్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్(21 నాటౌట్) విధ్వంసంక బ్యాటింగ్‌తో అలరించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికారేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. అయితే ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(9)ను తక్కువ స్కోర్‌కే ఔట్ చేసిన తుషార్ దేశ్‌పాండే రాజస్థాన్‌కు రెండో ఓవర్లోనే బ్రేకిచ్చాడు. కాసేపటికే ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన మిచెల్ ఓవెన్(0)ను క్వెనా మఫాకాడకౌట్ చేశాడు. అయినాసరే ప్రభ్‌సిమ్రన్‌సింగ్(0) దూకుడుగాఆడాడు. శ్రేయాస్ అయ్యర్(30) జతగా పంజాబ్ స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే దేశ్‌పాండే మరోసారి షాకిస్తూ ప్రభ్‌సిమ్రన్‌ను ఔట్ చేశాడు. దాంతో, పవర్ ప్లే 3.1 ఓవర్‌కే పంజాబ్ కీలకమైన 3 వికెట్లు కోల్పోయింది. దేశ్‌పాండే విజృంభణతో34కే మూడు కీలక వికెట్లు పడిన పంజాబ్‌ను అయ్యర్, నేహల్ వధేరా(70)లు ఆదుకున్నారు. క్రీజులో కుదురుకున్నాక జోరు పెంచిన ఇద్దరూ బౌండరీలతో హడలెత్తించారు. దాంతో, 10 ఓవర్లకు పంజాబ్ స్కోర్ 97కు చేరింది. అయితే దంచికొడుతున్న అయ్యర్ రియాన్ పరాగ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వత గేర్ మార్చిన వధేరా ఆకాశ్ మధ్వాల్ బౌలింగ్‌లో రెండో ఫోర్లతో అర్ధ శతకం సాధించాడు.



# హాకీ టోర్నీలో 4 దేశాలతో భారత్ ఢీ

## 25న చిలీతో పోరు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది డిసెంబరులో జరిగే మహిళల జూనియర్ ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు సన్నాహాల్లో భాగంగా భారత్ జట్టు ఈ నెలలో నాలుగు దేశాల టోర్నీలో పోటీపడనుంది. అర్జెంటీనాలోని రొసారియా నగరంలో ఈ నెల 25 నుండి జూన్ 2 వరకూ జరిగే ఈ టోర్నీలో భారత్ తో పాటు, అర్జెంటీనా, చిలీ, ఉరుగ్వే జట్టు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీలో ఆడనున్న భారత్ జట్టును హాకీ ఇండియా ప్రకటించింఇ. 24 మంది సభ్యులతో కూడిన భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టుకు గోల్‌కీపర్ నిధి నాయకత్వం వహిస్తుంది. డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో భారత్ జట్టు తమ తొలి మ్యాచ్‌ను ఈ నెల 25న చిలీతో ఆడుతుంది. ఆ తర్వాత టీమిండియా వరుసగా ఈ నెల 26న ఉరుగ్వేతో, అర్జెంటీనాతో 28న, చిలీతో 30న, ఉరుగ్వేతో జూన్ 1న, అర్జెంటీనాతో 2న తలపడుతుంది. భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టులో నిధి (కెప్టెన్, గోల్‌కీపర్), ఏంజిల్ హర్షరాణి మింజ్ (గోల్‌కీపర్), మమితా ఓరమ్, లాల్‌తట్లుయాంగి, మనీషా, పూజా సాహూ, పార్వతి టొప్నో, నందిని, సాక్షి శుక్లా (డిఫెండర్లు), ప్రియాంక యాదవ్, అనీషా సాహూ, రజని కెర్కెట్టా, బినామా ధన్, ఖైడెమ్ షిలీమా చాను, సంజన హోరో, సుప్రియా కుజుర్, ప్రియాంక డోగ్రా (మిడ్ ఫీల్డర్లు), హీనా బానో, సోనమ్, సుఖ్‌వీర్ కౌర్, గీతా యాదవ్, లాల్‌రిన్‌పుయ్, కనిక సివాచ్, కర్మన్‌ప్రీత్ కౌర్ (ఫార్వర్డ్లు), స్టాండ్‌బై విద్యశ్రీ, హుదా ఖాన్, మనీమని దాస్, సెలెస్టినా హోరో ఉన్నారు.

# లాంచ్ కాబోయే 'ఇవి' కార్లు ఇవే!

**ముంబై, మే 18:** ఎలక్ట్రిక్ వాహనాల విభాగం రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. అగ్రశ్రేణి కార్ల తయారీ సంస్థలన్నీ ఐసీఈ నుంచి నుండి 'ఇవి' వాహనాలవైపు వేగంగా మారుతున్నారు. కియా, మహీంద్రా, మారుతి సుజుకి, టాటా ఎంజీ వంటి కంపెనీలు కొత్త కార్లను లాంచ్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రిలీజవ్వబోయే 'ఇవి' కార్ల గురించి తెలుసుకుందాం. కియా క్లావిస్ 'ఇవి' కియా క్లావిస్ 'ఇవి' త్వరలో లాంచ్ కానుంది. కియా కంపెనీ ఇప్పటికే ఈ మోడల్ ఇంధన వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. ఈ మోడల్‌లో భవిష్యత్‌లో ఈవీ వెర్షన్ లాంచ్ కానుందని నిపుణులు చెబుతన్నారు. ఈ మోడల్ హాట్ సెల్లింగ్ ఉత్పత్తిగా ఉంది. క్రెటా ఎలక్ట్రిక్ నుండి చాలా కీలకమైన హార్డ్‌వేర్‌ను తీసుకుంటుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి మోడల్ రెండు బ్యాటరీ కాన్ఫిగరేషన్‌లలో అందించే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. ఎంజీ ఎం9 భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించిన జేఎస్‌డబ్ల్యూ ఎంజీ ఎం9ని భారత మార్కెట్‌కు త్వరలో తీసుకురానుంది. ఎంజీ ప్రీమియం శ్రేణిలో ఉన్న ఈ కారు 90 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో వస్తుంది. అలాగే ఈ కారును ఓ సారి ఛార్జ్ చేస్తే దాదాపు 430 కి.మీ. మైలేజ్ అందిస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓ మహీంద్రా కంపెనీ ఎక్స్‌యూవీ 3 ఎక్స్ఓ కారును ఈవీ వెర్షన్‌లో త్వరలో లాంచ్ చేయనుంది. ఈ కారు 2025 చివర్లో మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ లాంచ్ గురించి కంపెనీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అధికారికంగా లాంచ్ అయిన తర్వాత, ఈ మోడల్ టాటా పంచ్ 'ఇవి'కు నేరుగా పోటీగా ఉంటుందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. టాటా హారియర్ 'ఇవి' 2025 బీఎంజీఈ సమయంలో టాటా కంపెనీ హారియర్ 'ఇవి'ను ప్రదర్శించింది. టాటా కంపెనీ ఈ కారుకు సంబంధించిన అన్ని పరీక్షలను దాదాపు పూర్తి చేసిందని, త్వరలోనే హారియర్ 'ఇవి'మార్కెట్‌ను పలుకరించనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2025 ముగిసేలోపు ఈ కారు మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది.



# కార్ల కోసం వేసవి చిట్కాలు

**ముంబై, మే 18:** దేశంలోనిదాదాపు అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి సమయంలో కార్లను కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. ఎండలో డ్రైవింగ్ చేయడం వల్ల మీకు అసౌకర్యం కలగడంతో పాటు కారుకూ నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా విండ్ షీల్డ్ పగుళ్లు తీస్తుంది. పెయింట్ వాడిపోయే ప్రమాదం ఉంది. అధిక వేడి కారణంగా టైర్లు హీటెక్కిపోతాయి. ఇలాంటి సమయంలో ఈ కింద తెలిసిన విధంగా కార్లను సంరక్షించుకోవాలి. ఎండా కాలంలో కారును వాడకుండా ఇంటిలోనే ఉంచడం కుదరదు. మన అవసరాలకు అనుగుణంగా దాన్ని ఉపయోగించుకోవాలి. కాబట్టి సాధ్యమైనంత వరకూ కారును నీడ కింద పార్కు చేయాలి. ఎందుకంటే సుమారు 30 నిమిషాల పాటు కారు ఎండలో ఉంటే లోపలి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతాయి. ప్రయాణం సమయంలో ఒక అరగంట పాటు చెట్ల కింద ఆపడంవల్ల మీతోపాటు కారుకు మంచి జరుగుతుంది. క్యాబిన్ చల్లబడడమే కాకుండాపెయింట్, డాష్ బోర్డులో పగుళ్లు రాకుండా ఉంటాయి. పార్కింగ్ చేసే ప్రదేశాల్లో నీడ లేనప్పుడు సన్ షేడ్‌లు, విండో వైజర్లను ఉపయోగించుకోవాలి. ఇవి సూర్యరశ్మిని నిరోధించి, కారు లోపలి భాగాన్ని చల్లగా ఉంచుతాయి. ముందు వెనుక ఉన్న కిటికీలపై వీటిని ఉంచడంమంచిది. అదే సమయంలో స్టీరింగ్ వీల్, సీట్లపై తువాళ్లు కప్పడం మర్చిపోవద్దు. తువాళ్లపై నీటిని చల్లడం వల్ల మరింత చల్లదనం అందుతుంది. ఈ పద్ధతులు కారు లోపల భాగం వేడెక్కకుండా చూడటానికి ఎంతో సహాయపడతాయి. బయట గాలి కారు లోపలకు వెళ్లడానికి వీలుగా, లోపలి భాగం వేడెక్కకుండా ఉండేందుకు కొద్దిగా కిటికీల తెరవడం చాలా మంచిది. దీనివల్ల లోపలి గాలిబయటకు, బయట గాలి లోపలకు వెళ్లి ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. ఇటీవల సౌరశక్తితో పనిచేసే ఫ్యాన్లు ఎక్కువగా తయారవుతున్నాయి. వాటిని కారు లో ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రయోజనం కలుగుతుంది. ఇంజిన్ ఆఫ్‌లో ఉన్నప్పుడు క్యాబిన్ ఉష్ణో గ్రతను సరిచేస్తాయి. ఎండలో పార్కు చేసిన సమయంలోనూ ఉపయోగపడతాయి.



# వాణిజ్యం

# ఆన్‌లైన్ మోసాలకు ఎయిర్‌టెల్ చెక్

**ముంబై, మే 18:** భారతదేశంలో ప్రముఖ టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ అన్ని కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్స్‌లో హానికరమైన వెబ్‌సైట్లను రియల్ టైమ్‌లో గుర్తించి బ్లాక్ చేసేలా కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏఐ ఆధారంగా తీసుకున్న ఈ పరిష్కార చర్యలు ఎస్ఎంఎస్, ఈమెయిల్, ఓటీటీ మెసేజింగ్ యాప్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో సహా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ ద్వారా యాక్సెస్ చేసే ప్రమాదకరమైన లింక్లను గుర్తించి బ్లాక్ చేస్తుంది. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాల నుంచి వినియోగదారులను రక్షించడం లక్ష్యంగా ఈ కీలకచర్యలు తీసుకున్నారు. ఎయిర్టెల్‌మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ నెట్వర్క్స్‌లో ఇంటిగ్రేట్ చేసిన ఈ సేవ అదనపు ఖర్చు లేకుండా అందరు వినియోగదారు లకు ఆటోమెటిక్‌గా అందుబాటులో ఉంటుంది. హానికరమైన వెబ్ సైట్ గుర్తించినప్పుడు వినియోగ దారులు బ్లాక్‌ను వివరించే నోటిఫికేషన్ పేజీకి మళ్లించి ఆ పేజీ క్లోజ్ అవుతుంది. భారతదేశం అంతటా సైబర్ మోసం బాగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నామని ఎయిర్‌టెల్ ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌ను ఉపయోగించి స్కామర్లు ఎక్కువగా దోపిడీ చేస్తున్నారు. సాంప్రదాయ ఓటీపీ దొంగతనం, స్పామ్ కాల్స్‌కు అతీతంగా హానికరమైన లింక్లను ఉపయోగించే అధునాతన పథకాలు ఇప్పుడు మిలియన్ల మంది వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ మోసాలను అరికట్టేందుకు ఎయిర్టెల్ ఇంజనీర్లు ఏఐను ఉపయోగించి రియల్‌టైమ్ డొమైన్ ఫిల్టరింగ్‌ను నిర్వహించే మల్టీలెవల్ నిఘా వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఇది వెబ్ ట్రాఫిక్‌ను గ్లోబల్ రిపోజిటరీలతో ఎయిర్టెల్ అంతర్గత డేటాబేస్లో క్రాస్‌రిఫరెన్స్ చేస్తుంది. ఇలాంటి చర్యలతో వినియోగదారులు మోసపోతామనే ఆందోళన లేకుండా ఇంటర్నెట్ బ్రౌజ్ చేయడమే తమ లక్ష్యమని




ఎయిర్‌టెల్ ప్రతినిధులు చెబుతున్నారు. ఆరు నెలల ట్రయల్స్ తర్వాత కచ్చితత్వంతో కూడిన బ్లాకింగ్ సిస్టమ్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సేవ ప్రస్తుతం హర్యానా సర్కిల్లో అందుబాటులో ఉంది. త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# ఈ వారం కొత్త ఐపిఓలు ఇవే..

**న్యూఢిల్లీ, మే 18:** ఆటో విడిభాగాల కంపెనీ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 21న ప్రారంభం కానుంది. 23న ముగియనున్న ఇష్యూకి రూ.85-90 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ.2,150 కోట్లుగా నమోదైంది. కంపెనీ ప్రధానంగా ఆటోరంగంలోని సేఫ్టీ క్రిటికల్ సిస్టమ్స్‌ను రూపొందించడంతో పాటు, ఇతర ఇంజినీరింగ్ సొల్యూషన్స్ అందిస్తోంది. టెక్స్‌టైల్ తయారీ కంపెనీ బొరానా వీవ్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 20న ప్రారంభం కానుంది. 22న ముగియనున్న ఇష్యూకి రూ.205-216 ధరల శ్రేని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా 67.08 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ.145 కోట్లు సమీకరించే యోచరలోఒ ఉంది. 19న యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 69 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇష్యూ నిధులను కొత్త తయారీ యూనిట్ ఫైనాన్స్ వ్యయాలతో పాటు, వర్కింగ్ కేపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. గుజరాత్‌లోని సూరత్ వద్ద ఏర్పాటు చేస్తున్న యూనిట్ ద్వారా గ్రే ఫ్యాబ్రిక్‌ను ఉత్పత్తి చేయనుంది.




# సాలరీ అకౌంట్‌తో ప్రయోజనాలెక్కువే..

**ముంబై, మే 18:** చాలా మందికి బ్యాంకు అకౌంట్లు ఉంటాయి. అయితే కొన్ని ఖాతాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. కానీ చాలా మందికి తెలియవు. బ్యాంకు అందించే వివిధ రకాల ఖాతాలు ఉన్నాయి. వీటిలో కరెంట్ ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా, సేవింగ్స్ ఖాతా మొదలైనవి ఉన్నాయి. సాధారణంగా చాలా మందికి పొందుపు ఖాతాల ఉంటాయి. మీరు ఆ అకౌంట్‌ను సాలరీ అకౌంట్‌గా మార్చుకోవచ్చు. ఇదిలా ఉండగా, సాలరీ అకౌంట్‌తో చాలా ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. ఆ ప్రయోజనాలు చాలా మందికి తెలియవు. దీనివల్ల ప్రజలు సాలరీ అకౌంట్‌ను నిర్వహించడానికి భయపడుతుంటారు. సాలరీ అకౌంట్ కింద ఓవర్‌డ్రాఫ్ట్ ప్రయోజనం ప్రజలకు లభిస్తుంది. ఓవర్‌డ్రాఫ్ట్ అంటే అత్యవసర పరిస్థితుల్లో మీరు ఖాతా నుండి డబ్బును ఉపసంహరించుకోవచ్చు. అంటే మీ అకౌంట్‌లో డబ్బులు లేకున్నా ఓవర్ డ్రాఫ్ట్ ద్వారా కొంత అమోంట్‌ను పొందవచ్చు. ఓవర్‌డ్రాఫ్ట్ సద్వినియోగం చేసుకున్న తర్వాత అత్యవసర పరిస్థితుల్లో మీరు డబ్బు అప్పుగా తీసుకోవాల్సిన అవసరం ఉండదు లేదా క్రెడిట్ కార్డును ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. చాలా బ్యాంకులు సాలరీ అకౌంట్‌లకు బీమా కవరేజీని కూడా అందిస్తున్నాయి. మీరు దీని కింద ఆరోగ్య బీమా తీసుకుంటే ఆకస్మిక వైద్య ఖర్చుల గురించి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆరోగ్య బీమా వల్ల కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. నేటి కాలంలో వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. ఈలోగా బీమా మాత్రమే ఉపయోగపడుతుంది. అయితే, దీని కోసం మీరు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మీ వేతనం అంత కాకపోతే ప్రభుత్వం రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమాను కూడా అందిస్తుంది. ఇది ఆయుష్మాన్ యోజన ద్వారా లభిస్తుంది. అయితే, ఈపథకం ప్రయోజనాలను పొందడానికి ఒక జీతం నిర్ణయించింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14